ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 23.03.2026 | సంపుటి :12 సంచిక : 243 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## హోటళ్లకు గ్యాస్ సరఫరా పెంపు

**రాష్ట్రాలకు వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపు 50 శాతానికి పెంపు**

**దేశీయంగా ఉత్పత్తి మెరుగైనందున నిర్ణయం**

న్యూఢిల్లీ(జనంసాక్షి): హోటళ్ల నిర్వాహకులకు గ్యాస్ కష్టాలు కొంతమేర తీరనున్నాయి. దేశీయంగా ఉత్పత్తి పెరిగినందున, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల కేటాయింపును శనివారం మరో 20% పెంచడమే ఇందుకు కారణం. దీంతో మొత్తం కేటాయింపు 50 శాతానికి చేరినట్లయ్యింది. పశ్చిమాసియాలో 3 వారాల నుంచి జరుగుతున్న యుద్ధం వల్ల, మన దేశానికి ఇంధన సరఫరాల్లో అంతరాయం ఏర్పడింది. దీంతో ఇళ్లలో వినియోగించే 14.2 కిలోల వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్లకు ఇబ్బంది లేకుండా చూసేందుకు, వాణిజ్య సంస్థలకు ఎల్‌పీజీ సరఫరాలను మొదట్లో దాదాపుగా నిలిపివేశారు. ఆ తర్వాత, సరఫరాలలో అయిదో వంతు (20%) పునరుద్ధరించారు. రాష్ట్రాలు పైపుల ద్వారా ఇళ్లకు గ్యాస్ సరఫరా చేసే ప్రాజెక్టులను వేగవంతం చేయాలనే

మిగతా 2లో..




సిద్దిపేట జిల్లా నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, వివేక్, ఎమ్మెల్యేలు తదితరులు..

"వరికి బోనస్ ఇస్తున్నాం. వరదల వల్ల నష్టపోతే పరిహారం ఇస్తున్నాం.రాష్ట్రంలో పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలి. గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు బాగా పండించేవారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల ఆ జిల్లాలో పంటల సాగు తగ్గింది. కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. పంటమార్పిడి ద్వారా మాత్రమే.. వ్యవసాయం లాభసాటి అవుతుంది. సిద్దిపేట ఫ్యాక్టరీ కొడంగల్‌లో నూ నిర్మించాల ని మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేస్తున్నా. అంకాపూర్ రైతుల ను ఆదర్శంగా తీసుకుని రైతు లంతా ముందుకెళ్లాలి. తెలంగాణలో ఒక్కో జిల్లా, ఒక్కో పంటకు ప్రసిద్ధి. మనకు సారవంతమైన భూ ములున్నాయి. కష్టపడే రైతులు ఉన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది.
- సీఎం రేవంత్ రెడ్డి



# అన్నదాత సంక్షేమ కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా

## నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ జాతికి అంకితం

**సిద్ధిపేటలోనూ కాంగ్రెస్ గెలవాలి • గెలిచిన ఎమ్మెల్యేకు మంత్రి పదవి**

- అంకాపూర్‌ను ఆదర్శంగా తీసుకోండి • ఇబ్బందులు ఉన్నా.. రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం
- సిద్దిపేట ఫ్యాక్టరీ కొడంగల్‌లోనూ నిర్మించాలి • రైతుభరోసా నిధులను విడుదల చేసిన సీఎం రేవంత్
- పథకం కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం • మొత్తం రూ.9వేల కోట్ల నిధుల విడుదల
- తొలి విడతగా రూ.3,590 కోట్లు అన్నదాతల ఖాతాల్లో నిధులు జమ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

సిద్ధిపేట(జనంసాక్షి):ఎన్ని ఇబ్బందులు ఉన్నా.. రైతు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను ఆయన విడుదల చేశారు. ఈ పథకం కింద 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందించేందుకు రూ.9 వేల కోట్లను ప్రభుత్వం సమకూర్చింది. సిద్దిపేట జిల్లా నర్మెటలో నిర్వహించిన సభలో తొలి విడతగా రూ.3,590 కోట్లు విడుదల చేశారు. ఆదివారం సెలవు కావడంతో సోమవారం అన్నదాతల ఖాతాల్లో జమవుతాయని చెప్పారు. ఇరవై రోజుల అనంతరం రెండో విడతలో రూ.2,650 కోట్లు, మూడో విడతలో రూ.2,760 కోట్లు విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెడుతున్నా.. రైతుల విషయంలో వెనుకంజ వేయడం లేదన్నారు.

మిగతా 2లో..

### తెలంగాణ పునర్ నిర్మాణంలో
## ఆర్య వైశ్యులది కీలక పాత్ర

- వారు అభివృద్ధిలో కీలక భాగస్వాములు
- ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన శ్రీవాసవి శక్తి మహోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి గారి స్పీచ్ పాయింట్స్.. ఆర్య వైశ్యులు ఊరికి ఒక్కరు ఉన్నా ఆధిపత్యం చూపిస్తుంటారు.తెలంగాణ ఆర్థిక అభివృద్ధి లో భాగస్వాములు ఆర్య వైశ్యులు..ఆర్య వైశ్యులకు 6 మున్సిపల్ చైర్మన్ పదవులతోపాటు ఒక మేయర్ పదవి ఇచ్చి రాజకీయం గా ప్రాధాన్యత కల్పించాం..రాజరికం లో అధికారం మారాలంటే హింస తప్పనిసరిగా ఉండేది..,కానీ మహాత్మా గాంధీ ఒక్కరే అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు.. రవి హస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అహింస,సహాయ నిరాకరణ,ఉప్పు సత్యాగ్రహం తో పారదోలిన గొప్ప తత్వవేత్త గాంధీ..దేశ అభివృద్ధి లో ఆర్య వైశ్యులు భాగస్వాములు ..అవకాశాలు వచ్చినా రాకున్నా క్రమశిక్షణ ఉల్లంఘించకుండా ఓపిక తో ఉంటారు..నాకు ఇష్టమైన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి రోశయ్య..ఆయనతో వాదించడం ,ప్రశ్నించడం గౌరవంగా ఉండేది..రోశయ్య విగ్రహం లక్డీకాపూల్‌లో పెట్టి ఆయన స్ఫూర్తి ని కొనసాగిస్తున్నాం..టీ జీ వెంకటేష్ కూడా రాయలసీమ లో ఇతరులకు దీటుగా

మిగతా 2లో..

# తీవ్రంగా ప్రతిఘటిస్తున్న ఇరాన్



### భారత్ చేరిన అమెరికా
## ఎల్‌పీజీ నౌక

- దేశంలో తీరనున్న ఎల్‌పీజీ కొరత
- రష్యాకు చెందిన చమురు నౌక కూడా భారత సముద్రజలాల్లోకి ప్రవేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):పశ్చిమాసియా సంక్షోభం కారణంగా చమురు, ఎల్‌పీజీ సరఫరా గొలుసుకు అంతరాయం ఏర్పడింది. దీంతో దేశంలో ముఖ్యంగా ఎల్‌పీజీకి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఊరటనిచ్చేలా అమెరికాకు చెందిన ఎల్‌పీజీ నౌక భారత్‌కు చేరింది. అమెరికాలోని టెక్సాస్ నుంచి బయల్దేరిన పయనీర్ నౌక ఎల్‌పీజీ లోడ్‌తో కర్ణాటకలోని మంగళూరు పోర్టుకు ఆదివారం చేరుకుంది.దీంతోపాటు రష్యాకు చెందిన చమురు నౌక కూడా దేశ సముద్రజలాల్లోకి ప్రవేశించింది. అక్వాటైటాన్ పేరుతో రష్యా నుంచి వచ్చిన ఈ నౌక

మిగతా 2లో..

## అమెరికాకు ముచ్చెమటలు

- ఇజ్రాయెల్ అణు పరిశోధన కేంద్రం లక్ష్యంగా.. విరుచుకుపడ్డ ఐఆర్‌జీసీ
- డిమోనా నగరాన్ని తాకిన ఇరాన్ క్షిపణులు
- హర్మూజ్‌కు బ్రిటన్ అణు జలాంతర్గామి!
- ఖతార్‌లో కూలిపోయిన హెలికాప్టర్
- ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను కాపాడతాం: ఇరాన్

టెహ్రాన్(జనంసాక్షి):ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. డిమోనా నగరంలోని ఇజ్రాయెల్‌కు అత్యంత కీలమైన అణు పరిశోధనా కేంద్రం లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. అణు పరిశోధన కేంద్రం సమీపంలోని భవనాలపై ఈ క్షిపణులు పడ్డాయి. అయితే ఈ పరిశోధన కేంద్రానికి ఎలాంటి నష్టం జరగలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, పౌరుల నివాసాలపై దాడులు జరగడంతో 100 మందికి పైగా గాయపడ్డారు. శనివారం ఇరాన్ లోని కీలకమైన అణుశుద్ధి కేంద్రమైన నతాంజ్‌పై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతీకారంగానే తాజాగా టెహ్రాన్ ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది.ఇరాన్ నుంచి రెండు బాలిస్టిక్ క్షిపణులు రాగా.. వాటిని అడ్డుకోవడంలో ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు విఫలమయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అరాద్, డిమోనా నగరాల్లోని నివాస ప్రాంతాలపై క్షిపణులు పడ్డాయి. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగగా.. భవనాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అరాద్‌లో జరిగిన దాడిలో దాదాపు 88 మంది గాయపడగా.. వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉందని రెస్క్యూ సిబ్బంది తెలిపారు. దెబ్బతిన్న భవనాల నుంచి దాదాపు 150 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో పలువురు మరణించి ఉండవచ్చని ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది.

మిగతా 2లో..



ఇరాన్ క్షిపణుల దాడిలో ధ్వంసమైన ఇజ్రాయెల్ అణుపరిశోధన కేంద్ర భవనం

## 48 గంటల్లోగా హర్మూజ్ తెరవాలి

- లేదంటే ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై భీకర దాడులు చేస్తాం.. ట్రంప్ అల్టిమేటం
- మాపై దాడి చేస్తే మేమూ మీ కీలక ఇంధన వనరులపై దాడులు చేస్తాం.. దీటుగా బదులిచ్చిన ఇరాన్
- శత్రునౌకలు మినహా అన్నీ జలసంధి గుండా వెళ్లడానికి అనుమతి



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు అల్టిమేటం జారీ చేశారు. చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందేనని ఆదేశించారు. లేదంటే ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. "ఇప్పటి నుంచి సరిగ్గా 48 గంటల్లోగా ఇరాన్ హర్మూజ్ జలసంధిని తెరవాలి. ఈ క్రమంలో ఎలాంటి బెదిరింపులకు పాల్పడకూడదు.

మిగతా 2లో..



## ప్రపంచం కోసమే ఇరాన్‌తో యుద్ధం

- అమెరికా కలిసి పోరాడుతున్నాం: నెతన్యాహు
- 48 గంటల్లో పౌరుల నివాసాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేసిందని విమర్శలు

టెల్‌అవీవ్(జనంసాక్షి): యావత్ ప్రపంచం కోసం అమెరికా-ఇజ్రాయెల్‌లు కలిసి ఇరాన్‌తో పోరాడుతున్నాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు. గత 48 గంటల్లో పౌరుల నివాసాలే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేసిందని నెతన్యాహు వెల్లడించారు. ప్రపంచాన్ని ఇరాన్ ప్రమాదంలో పడేస్తోందనడానికి ఈ దాడులే రుజువన్నారు. అదృష్టవశాత్తూ ఇరాన్ దాడుల్లో తమ దేశ పౌరులెవరూ చనిపోలేదని పేర్కొన్నారు. కానీ ఇరాన్ ఉద్దేశం సామాన్య పౌరుల్ని చంపడమేనని మండిపడ్డారు. తామూ దాడులు చేస్తున్నాం, కానీ ఇరాన్ పౌరులను లక్ష్యంగా చేసుకోలేదని గుర్తు చేశారు.

మిగతా 2లో..

### ఇంధన, ఎరువుల సరఫరాలో
# ఇబ్బందులు రావొద్దు



- పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ ప్రధాని మోదీ కీలక భేటీ
- నిరంతరాయంగా సరఫరా చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర మంత్రులు, అధికారులతో సమీక్ష

న్యూఢిల్లీ(జనంసాక్షి): పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో పెట్రోలియం, విద్యుత్, ఎరువుల రంగాల స్థితిగతులపై ప్రధాని నరేంద్ర మోదీ సీనియర్ మంత్రులతో చర్చించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, జైశంకర్, రామ్మోహన్ నా యుడు, హర్దీప్ సింగ్ పురి, సర్బానంద సోనో వాల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డో భాల్ హాజరయ్యారు. దేశవ్యాప్తంగా నిరంతర సరఫరా, సమర్థ పంపిణీపై మంత్రులతో ప్రధాని మోదీ చర్చించారు. గ్యాస్, పెట్రోల్ , ఎరువుల సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలన్న ప్రధాని, సరఫరాలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారులు, పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి కేంద్రం అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పరిశీలిస్తోందని ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.ప్రపంచ ఇంధన రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ తన ఆధీనంలో ఉంచుకుంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ చాలా తక్కువ నౌకలను మాత్రమే దీని గుండా అనుమతిస్తోంది. ఈ దిగ్బంధం వల్ల భారత్ సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇప్పటికే సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేషియా, ఇజ్రాయెల్, ఇరాన్ నాయకులతో ఫోన్ ద్వారా చర్చలు జరిపారు.

## 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తా

**పార్టీలో ఇక కొనసాగలేను: జీవన్‌రెడ్డి**

**నా రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, మార్గదర్శనం కావాలని కార్యకర్తలను కోరిన సీనియర్ కాంగ్రెస్ నేత**



జగిత్యాల(జనంసాక్షి): కాంగ్రెస్‌లో కొనసాగ లేనంటూ జగిత్యాల కార్యకర్తలకు సీనియర్ నేత టి. జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ నెల 25న కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తానని అందులో పేర్కొన్నారు. గత 20 నెలలుగా పార్టీలో మానసిక క్షోభకు గురవుతున్నానని తెలిపారు. అవమానాలు భరిస్తూ పార్టీలో కొనసాగలేనని చెప్పారు. స్థానిక నేతలు, కార్యకర్తలతో సమావేశమై, అందరి సలహాలు, సూచనలతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని లేఖలో పేర్కొన్నారు. 'నా రాజకీయ ప్రస్థానంలో మీ తోడు, మార్గదర్శనంకావాలి' అని కార్యకర్తలను కోరారు.

## తెలంగాణ బిల్డింగ్ రూల్స్‌లో మార్పులు



**కీలక సవరణలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్(జనంసాక్షి): 'తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012'కి సంబంధించి ప్రభుత్వం కీలక సవరణలు చేసింది. ఈ మేరకు జీవో జారీ చేసింది. దీని ప్రకారం.. 21 మీటర్లు, అంతకంటే ఎక్కువ ఎత్తుతో నిర్మించనున్న వాటిని హైరైజ్ భవనాలుగా గుర్తించనున్నారు. 750 చ.మీ నుంచి 2000 చ.మీలు ఉన్న స్థలంలో 18-21 మీటర్ల భవనాలు నిర్మించాలంటే టీడీఆర్ వినియోగం తప్పనిసరి. నాన్ హైరైజ్ భవనాలకు టీడీఆర్ వినియోగంతో సెట్‌బ్యాక్ సడలింపు ఇచ్చారు. ఇప్పటి వరకు 2012లో జారీ చేసిన ఉత్తర్వులోని నిబంధనలు అమల్లో ఉన్నాయి. వాటికి కాలానుగుణంగా ప్రభుత్వాలు సవరణలు చేశాయి. వీటివల్ల లాభంతో పాటు సమస్యలూ వస్తున్నాయని ప్రణాళిక విభాగం భావించింది. అదే సమయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ 2016లో నిర్మాణ అనుమతులకు కొత్త చట్టాలను తీసుకొచ్చింది. వాటిని దృష్టిలో ఉంచుకుని కొత్త నిబంధనలను ప్రభుత్వం తీసుకొచ్చింది.

**మా అణుకార్యకలాపాలపై అమెరికా దాడులు చేస్తే**

## ఢిల్లీ, ముంబయిపై బాంబులేస్తాం

వార్త 2 లో

**భారత్‌ను ఉద్దేశిస్తూ పాక్ మాజీ రాయబారి అబ్దుల్ బాసిత్ వివాదాస్పద వ్యాఖ్యలు**





# తెలంగాణ పునర్ నిర్మాణంలో ఆర్య వైశ్యలది కీలక పాత్ర

ఎదిరించి గెలిచి రాజకీయాలు చేస్తున్నారు..ఆర్య వైశ్యులకు సముచితమైన స్థానం కల్పిస్తాం ..మీ ఆలోచన లే ప్రభుత్వం విధానం ..మీ గౌరవానికి భంగం కలగకుండా చూస్తాం ..గిన్నీస్ బుక్ రికార్డ్ సాధించినందుకు అభినందనలు..

# హోటళ్లకు గ్యాస్ సరఫరా పెంపు!

షరతులకు లోబడి, మరో 10% సరఫరా పెంచడంతో, వాణిజ్య ఎల్‌పీజీ సరఫరా 30 శాతానికి చేరింది. గ్యాస్ ఉత్పత్తి మెరుగుపడినందున.. రెస్టారెంట్లు, హోటళ్లు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఆహార శుద్ధి యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్లు, రాయితీ ఆహార కేంద్రాల వంటి కీలక రంగాలకు వాణిజ్య ఎల్‌పీజీ కేటాయింపును ఇంకో 20% పెంచుతున్నట్లు శనివారం ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మొత్తం కేటాయింపు 50 శాతానికి చేరింది. ఇందువల్ల వలస కార్మికులకు ఇబ్బందులు తగ్గుతాయని ప్రభుత్వం పేర్కొంది.

షరతులు వర్తిస్తాయ్

రాష్ట్రాలకు చమురు కార్యదర్శి రాసిన లేఖ ప్రకారం.. వాణిజ్య సంస్థలు చమురు కంపెనీల వద్ద నమోదు చేసుకుని, పైపుల ద్వారా సహజ వాయువు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటేనే అదనపు కేటాయింపు వర్తిస్తుంది. ఇళ్లలో వినియోగించే వంటగ్యాస్ సిలిండర్ల సరఫరా స్థిరంగా ఉందని, భయాందోళనలతో చేసే బుకింగ్‌లు తగ్గాయని ప్రభుత్వం పేర్కొంది. పంపిణీ కేంద్రాల వద్ద గ్యాస్ సిలిండర్లకు కొరత లేదని, నిర్దేశించిన గడువు ప్రకారం బుక్ చేసుకుంటే, సాధారణ డెలివరీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అధికారిక వర్గాలు తెలిపాయి.

# ప్రపంచం కోసమే ఇరాన్‌తో యుద్ధం చేస్తున్నాం

ఇరాన్ పాలకులు, నేతలు, క్రిమినల్ గ్యాంగులనే టార్గెట్ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇజ్రాయెల్‌లోని అరద్‌లో ఇరాన్ క్షిపణి దాడి చేసిన ప్రాంతాన్ని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం పరిశీలించారు. ఈ క్రమంలో ఇరాన్‌పై మండిపడ్డారు.

## మా అణుకార్యకలాపాలపై అమెరికా దాడులు చేస్తే ఢిల్లీ, ముంబయిపై బాంబులేస్తాం

**పాక్ మాజీ రాయబారి వివాదాస్పద వ్యాఖ్యలు**

ఇస్లామబాద్(జనంసాక్షి):పశ్చిమాసియాలో కొనసాగుతోన్న ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ మాజీ రాయబారి అబ్దుల్ బాసిత్ భారత్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తమ అణు కార్యక్రమం లక్ష్యంగా అమెరికా దాడులు చేస్తే.. భారత్‌లోని దిల్లీ, ముంబయి వంటి నగరాలపై బాంబులు వేస్తామంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 2014-2017 వరకు బాసిత్ భారత్‌లో పాక్ దౌత్యవేత్తగా పనిచేశారు. తాజాగా ఓ చర్చా కార్యక్రమంలో మాట్లాడుతూ.. అమెరికా, ఇజ్రాయెల్ నుంచి తమ దేశానికి ఏదైనా ముప్పు వాటిల్లితే.. మరో ఆలోచన లేకుండా భారత్‌పై దాడులకు దిగుతామని నోరుపారేసుకున్నారు. అమెరికా తమపై దాడి చేస్తే.. గల్ఫ్‌లోని ఆ దేశ స్థావరాలను, ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకోవడం తమకు కష్టతరమవుతుందన్నారు. ఈ క్రమంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం తప్ప తమకు మరో మార్గం లేదంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారు. ఇందుకు పాక్ ఏ మాత్రం వెనకాడబోదన్నారు. ఆయన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా.. బాసిత్ వివాదాస్పద వ్యాఖ్యలపై భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

## భారత్ చేరిన అమెరికా ఎల్‌పీజీ నౌక

శనివారమే మంగళూరు పోర్టును చేరినట్లు పలు ఆంగ్ల మీడియా సంస్థలు పేర్కొన్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా చమురు సంక్షోభాన్ని తగ్గించడమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్చి 12 నాటికి రష్యా నౌకల్లో లోడ్ చేసిన చమురును కొనుగోలు చేయొచ్చని అనుమతి ఇచ్చారు. ఈ నేపథ్యంలో రష్యా నౌక భారత్‌కు చేరుకోవడం గమనార్హం.

## పాలనలో.. మోదీ రికార్డు

న్యూఢిల్లీ(జనంసాక్షి):తన రాజకీయ జీవితంలో ప్రధాని మోదీ మరో అరుదైన మైలురాయిని చేరుకున్నారు. 8,931 రోజుల పాటు (గుజరాత్ సీఎం పదవీకాలం సహా) ఎలాంటి విరామం లేకుండా దేశంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ అధిపతిగా పనిచేసిన వ్యక్తిగా నిలిచారు. ఇప్పటి వరకు సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉన్న ఈ రికార్డును మోదీ అధిగమించారు. చామ్లింగ్ సిక్కిం ప్రభుత్వ అధిపతి (ముఖ్యమంత్రి)గా 8,930 రోజులు పనిచేశారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 2014లో ప్రధానమంత్రి అయ్యే వరకు ఆ పదవిలో ఉన్నారు. అప్పటినుంచి నేటి వరకు ప్రధానిగా కొనసాగుతున్నారు. గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా మోదీ నిలిచారు. అంతే కాకుండా ముఖ్యమంత్రిగా ఎక్కువ అనుభవమున్న ప్రధాని కూడా ఆయనే. స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర తొలి నేత కూడా మోదీయే. కేంద్రంలో రెండుసార్లు పూర్తి పదవీకాలాన్ని పూర్తిచేసుకొని, మూడోసారి అధికారం చేపట్టిన కాంగ్రెసేతర పార్టీ నేతగా రికార్డు నెలకొల్పారు. వరుసగా 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తన పార్టీని మోదీ విజయపథంలో నడిపించారు. దీంతో మూడు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని సాధించిన నెహ్రూ రికార్డును సమం చేశారు. గతేడాది జులైలో మోదీ.. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రికార్డును అధిగమించి వరుసగా దేశంలో అత్యధిక కాలం పనిచేసిన రెండో ప్రధానిగా నిలిచారు. వరుసగా ఆరు ఎన్నికల్లో ఒక పార్టీ పక్ష నేతగా ఎన్నికైన ఏకైక నేత నరేంద్రమోదీ. 2002, 2007, 2012లలో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గి సీఎం అయ్యారు. 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో నెగ్గి ప్రధాని అయ్యారు.








# అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా





"వరికి బోనస్ ఇస్తున్నాం. వరదల వల్ల నష్టపోతే పరిహారం ఇస్తున్నాం. రైతుల కోసం ఇప్పటివరకు రూ.1.40 లక్షల కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో పంటల విధానంలో మరిన్ని మార్పులు రావాలి. గతంలో రంగారెడ్డి జిల్లాలో కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు బాగా పండించేవారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల ఆ జిల్లాలో పంటల సాగు తగ్గింది. కూరగాయలు, పండ్లు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కేంద్రం 50 లక్షల టన్నుల వరి మాత్రమే కొంటామని చెప్తోంది. పంటమార్పిడి ద్వారా మాత్రమే.. వ్యవసాయం లాభసాటి అవుతుంది. సిద్దిపేటలో నిర్మించిన ఫ్యాక్టరీ కొడంగల్‌లోనూ నిర్మించాలని మంత్రి తుమ్మలకు విజ్ఞప్తి చేస్తున్నా. నిజామాబాద్ జిల్లాలోని అంకాపూర్ రైతులను ఆదర్శంగా తీసుకొని రైతులంతా ముందుకెళ్లాలి. తెలంగాణలో ఒక్కో జిల్లా.. ఒక్కో పంటకు ప్రసిద్ధి. రాష్ట్రంలో సారవంతమైన భూములున్నాయి.. కష్టపడే రైతులు ఉన్నారు. మన పంటలను ఎగుమతి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలని నిర్ణయించాం. మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దుతున్నాం. ఒకప్పుడు సౌరవిద్యుత్ వ్యాపారం అంబానీ, అదానీ వంటివారు చేసేవారు. ఈ ప్రభుత్వం మహిళలతో సోలార్‌ప్లాంట్లను ఏర్పాటు చేయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచే ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాం. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు.. ఉదయం టిఫిన్ కూడా పెడుతున్నాం. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల మనకు రాబోయే రోజుల్లో యూరియా కొరత వచ్చేలా ఉంది. రామగుండం ఫ్యాక్టరీ యూరియా అంతా మనకే దక్కేలా భాజపా ఎంపీలు సహకరించాలి. ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేద్దాం. ఎన్నికలు లేనప్పుడు ప్రాంతాల అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలి. ప్రత్యర్థి పార్టీ నేతల గురించి ఆలోచిస్తే.. ప్రజలకు అన్యాయం జరుగుతుంది. ప్రజలకు ఇచ్చే నిధుల విషయంలో వివక్షచూపే సీఎంను కాదు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేటలోనూ కాంగ్రెస్ గెలవాలి. ఇక్కడి నుంచి గెలిచిన వ్యక్తికి మంత్రి పదవి ఇస్తా. గత పాలకులు విపక్షనేతల నియోజకవర్గాల పట్ల వివక్ష చూపించారు. నేను నేతలతో వ్యతిరేకిస్తాను గానీ, ప్రజల పట్ల వివక్ష చూపను. సిద్దిపేటకు కూడా నిధులు భారీగా ఇచ్చాను. వివక్ష చూపే వ్యక్తినయితే.. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కొడంగల్‌కు తీసుకెళ్లేవాడిని. ప్రజలు బీఆర్ఎస్‌కు రెండుసార్లు అధికారం ఇచ్చారు.. మాకు రెండు సార్లు ఇస్తారు." అని రేవంత్ అన్నారు. అంతకుముందు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 62 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో రూ.300 కోట్లతో ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టారు.

మరోవైపు రూ.80 కోట్లతో నర్మెటలో పామాయిల్ రిఫైనరీ ప్లాంట్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు.

**రైతును ధైర్యంగా సాగు మడిలో నిలబెట్టేందుకు భరోసా ఇస్తున్నా : సీఎం రేవంత్**

రాష్ట్రంలోని 70 లక్షల మంది రైతుల కోసం రూ.9వేల కోట్ల 'రైతు భరోసా' నిధులను విడుదల చేశారు. అంతకు ముందు ఆయన 'ఎక్స్'లో రేవంత్ పోస్ట్ చేశారు. "అన్నదాత సంతోషం కోసం అన్నగా బాధ్యత తీసుకున్నా. రైతును ధైర్యంగా సాగు మడిలో నిలబెట్టేందుకు భరోసా ఇస్తున్నా. 70 లక్షల మంది రైతన్నల కోసం రూ.9000 కోట్ల రైతు భరోసా నిధుల విడుదలకు నేడు శ్రీకారం చుడుతున్నాం. సిద్దిపేట జిల్లా నర్మెట వేదికగా మరోసారి మా పాలనలో రైతే రాజు అని రుజువు చేస్తూ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఆర్థిక సాయంతో చేతులు దులుపుకోవడం కాదు.. కేవలం 17 నెలల వ్యవధిలో పామాయిల్ పరిశ్రమ మొదలు పెట్టి, పూర్తి చేసి నేడు రైతు లోకానికి అంకితం చేస్తున్నాం. దానికి కొనసాగింపుగా రిఫైనరీ యూనిట్‌కు శంకుస్థాపన చేస్తున్నాం" అని సీఎం పేర్కొన్నారు.

## 48 గంటల్లోగా హర్మూజ్ తెరవాలి

దాన్ని పూర్తిగా తెరవకుంటే.. ఇరాన్‌లోని పలు విద్యుత్ కేంద్రాలను అమెరికా లక్ష్యంగా చేసుకుంటుంది. వాటిని పూర్తిగా ధ్వంసం చేస్తాం. ముందుగా.. అన్నింటికంటే అతిపెద్ద విద్యుత్ కేంద్రంతో ఈ దాడులు ఆరంభించాల్సి వస్తుంది" అని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్‌ను ఇరాన్ మూసివేసింది. దీంతో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ తాజా హెచ్చరికలు చేశారు.

శత్రు నౌకలు మినహా అన్నీ వెళ్లొచ్చు! - ఇరాన్

హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందేనని, లేదంటే విద్యుత్ కేంద్రాలపై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ స్పందించింది. శత్రు దేశాలకు చెందినవి మినహా అన్ని నౌకలు తమతో సమన్వయం చేసుకుంటూ హర్మూజ్ ద్వారా వెళ్లొచ్చని పేర్కొంది. ఈ మేరకు ఐరాసలోని ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంవో)లో ఇరాన్ సీనియర్ ప్రతినిధి అలీ మౌసావి ఈ విషయాన్ని వెల్లడించారు. హర్మూజ్‌లో ప్రస్తుత పరిస్థితికి అమెరికా, ఇజ్రాయెల్‌లు ప్రధాన కారణమని మౌసావి ఆరోపించారు. దౌత్యానికి ఇరాన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, అయినప్పటికీ.. దురాక్రమణ నిలిపివేయడం, పరస్పర విశ్వాసం ఎంతో ముఖ్యమన్నారు. నావికుల రక్షణ, సముద్ర భద్రతను మెరుగుపరచడానికి ఐరాస విభాగమైన ఐఎంవోకు సహకరించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందన్నారు. ఇదిలాఉంటే, హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవకుంటే.. ఇరాన్‌లోని పలు విద్యుత్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. అతిపెద్ద విద్యుత్ కేంద్రంతోనే ఈ దాడులు ఆరంభిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ స్పందన రావడం గమనార్హం.

ఇరాన్ యుద్ధంతో గాల్లోకి 50 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలు

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. డ్రోన్లు, క్షిపణులు, బాంబు దాడులతో భారీగా కర్బన ఉద్గారాలు వెలువడుతున్నాయి. యుద్ధం మొదలైన 14 రోజుల్లోనే 50 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ వెలువడినట్లు 'క్లైమేట్ అండ్ కమ్యూనిటీ ఇన్‌స్టిట్యూట్' వెల్లడించింది. భవనాల ధ్వంసంతో 24 లక్షల టన్నులు, రిఫైనరీలు, గ్యాస్ ప్లాంట్లపై దాడులతో 18 లక్షల టన్నుల ఉద్గారాలు వెలువడినట్లు తెలిపింది. ఈ ఉద్గారాలతో పర్యావరణానికి 1.3 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం వాటిల్లినట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ 14 రోజుల్లో విడుదలైన విష వాయువులు ఓ దీవి ఏడాది పొడవునా విడుదల చేసే కాలుష్య ఉద్గారాల కంటే ఎక్కువని పరిశోధకులు పేర్కొన్నారు. 11 లక్షల కార్లను ఏడాది పాటు రోడ్లపై నడిపితే వచ్చే కాలుష్యం ఈ యుద్ధం వల్ల వచ్చిందన్నారు. దీనివల్ల యుద్ధం కొనసాగుతున్న ప్రాంతాల్లో యాసిడ్ (ఆమ్ల) వర్షాలు కురిసే అవకాశం కూడా ఉందన్నారు. ఈ గణాంకాలు కేవలం 14 రోజులవేనని.. ముందు రోజుల్లో యుద్ధం తీవ్రమైతే కాలుష్యం మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. హర్మూజ్‌లోని చమురు ట్యాంకర్లపై దాడుల వల్ల సముద్ర జలాలు కూడా విషపూరితమవుతాయని..దాని వల్ల జలచరాలు పెద్ద సంఖ్యలో ప్రాణాలు కోల్పోతాయన్నారు.

# తీవ్రంగా ప్రతిఘటిస్తున్న ఇరాన్




అయితే, అధికారులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. భవన శిథిలాల కింద కొందరు చిక్కుకుపోయి ఉండవచ్చని అధికారులు తెలిపారు. ఇక, ఇజ్రాయెల్‌కు కీలకమైన అణుపరిశోధనా కేంద్రం ఉన్న డిమోనా నగరంలోని ఒక భవనంపై క్షిపణి దాడి జరిగింది. దీంతో ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ ఘటనలో 40 మందికి పైగా గాయపడగా.. వారిలో 10 ఏళ్ల బాలుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అరాద్ నగరంపైకి వచ్చిన క్షిపణిని అడ్డుకోవడంలో ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు విఫలమవడంపై దర్యాప్తు ప్రారంభించినట్లు ఐడీఎఫ్ ప్రతినిధి పేర్కొన్నారు. ఈ తాజా దాడులను ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు తీవ్రంగా ఖండించారు. అరాద్ మేయర్‌తో మాట్లాడానని.. గాయపడిన వారికి వైద్యసహాయం అందించాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ దాడులకు తగిన విధంగా బదులు తీర్చుకుంటామని పేర్కొన్నారు.

**డిమోనా నగరాన్ని తాకిన ఇరాన్ క్షిపణులు**

ఇజ్రాయెల్‌పై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడుతోంది. తాజాగా ఇరాన్ క్షిపణులు అక్కడి డిమోనా నగరాన్ని తాకాయి. ఈ దాడుల్లో 30మంది గాయపడినట్టు తెలుస్తోంది. ఈ ప్రాంతాన్ని 'లిటిల్ ఇండియా'గా పిలుస్తారు. ఇక్కడి జనాభాలో దాదాపు 30శాతం భారత సంతతికి చెందినవారు ఉండడమే కారణం. కొన్ని దశాబ్దాల క్రితమే వారు స్థిరపడ్డారు. టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం.. 1950- 1960లలో భారత్-యూదు కమ్యూనిటీకి చెందిన అనేకమంది ఇజ్రాయెల్‌కు వలస వెళ్లారు. వీరిలో అత్యధికులు మహారాష్ట్రకు చెందినవారు, కాగా కేరళ, కోల్‌కతాకు చెందిన వారూ ఉన్నారు. వారంతా డిమోనా ప్రాంతంలో స్థిరపడ్డారు. దీంతో అది లిటిల్ ఇండియాగా పేరు పొందింది. ఇటీవల మిజోరం, మణిపుర్‌కు చెందిన మరికొంతమంది భారత యూదులు కూడా డిమోనాకు వలస వెళ్లారు. ప్రస్తుతం ఈ నగరంలో దాదాపు 7,500 మంది భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారు. వీరు అనర్గళంగా మరాఠీలో మాట్లాడగలరు. అక్కడక్కడా హిందీ మాటలు కూడా వినిపిస్తాయి. వారు నడిపే దుకాణాల్లో సోన్‌పాప్‌డి, గులాబ్ జామ్, పాప్రి చాట్, భేల్‌పురి వంటి భారతీయ రుచులూ పలకరిస్తాయి. ఇక్కడి భారతీయుల్లో అత్యధికులు వజ్రాల వ్యాపారులుగా, ఐటీ నిపుణులుగా కొనసాగుతున్నారు. ఆహారం మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతీ సంప్రదాయాలనూ పాటిస్తారు. ఓనం, దీపావళి వంటి పండగలను ఘనంగా నిర్వహిస్తారు. 2025లో ఇక్కడ నిర్వహించిన ఇండియన్ ఫిల్మ్ ఫెస్ట్‌లో నెల రోజుల పాటు థియేటర్లు కిక్కిరిసిపోయాయి. కొన్ని నెలల క్రితం ఆ నగరంలో జరిగిన మొట్టమొదటి భారతీయ సంగీత ఉత్సవానికి మంచి స్పందన లభించింది. డిమోనాతో పాటు హైఫా, టెల్ అవీవ్, అరద్, నెతన్యా, అఫులా వంటి నగరాల్లోనూ భారత సంతతి వారు ఉన్నారు.

హర్మూజ్‌కు బ్రిటన్ అణు జలాంతర్గామి!

ఖతార్‌లో కూలిపోయిన హెలికాప్టర్

ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను మేం కాపాడతాం: ఇరాన్

హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్‌ను కట్టడి చేసేందుకు ఇతర దేశాలు కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బ్రిటన్‌కు చెందిన అణు జలాంతర్గామి 'హెచ్ఎంఎస్ ఆన్సన్' హర్మూజ్ జలసంధి వద్దకు చేరుకున్నట్లు సమాచారం. దీనిని ఉత్తర అరేబియన్ సముద్రంలో మోహరించినట్లు బ్రిటిష్ మీడియా పేర్కొంది. ఇందులో తోమహాక్ క్షిపణులు, భారీ టోర్పడోలు, శక్తిమంతమైన ఆయుధ సంపత్తి ఉన్నట్లు తెలిపింది. పశ్చిమాసియాలో ఘర్షణలు మరింత తీవ్రరూపం దాలిస్తే.. ఇరాన్‌పై బ్రిటన్ దళాలు దాడులు చేయవచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఖతార్‌కు చెందిన ఓ హెలికాప్టర్ ప్రమాదానికి గురై పర్షియన్ గల్ఫ్‌లో కూలిపోయింది. ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు మృతి చెందారు. మరో వ్యక్తి గల్లంతు కాగా.. అతడి ఆచూకీ కోసం సహాయక దళాలు గాలింపు చర్యలు చేపట్టాయి. సాంకేతిక లోపంతో హెలికాప్టర్ కూలినట్లు ఖతార్ రక్షణ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అయితే, చనిపోయిన వారి వివరాలను మాత్రం వెల్లడించలేదు.

ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను మేం కాపాడతాం: ఇరాన్

వనరుల పరంగా ఎంతో కీలక దీవి అయిన గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీవ్ర ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఇరాన్ అధికారి తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ నుంచి గ్రీన్‌లాండ్‌ను రక్షించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. 'గ్రీన్‌లాండ్‌ను అప్పగించాలని ట్రంప్ మొదట ఐరోపాను బెదిరించారు. ఆ తర్వాత వారిని బతిమలాడుకున్నారు. ఇప్పుడు ఏకంగా దాన్ని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఐరోపాకు నేను చెప్పేది ఒకటే.. మీరు మీ గ్రీన్‌లాండ్‌ను కాపాడుకోలేకపోతే మా సాయం అడగండి. మేము ఆయన నుంచి దాన్ని కాపాడతాం. అందుకు మేం సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు. అయితే, ఆ దీవికి ఎలా రక్షణ కల్పిస్తారనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను నిర్బంధించిన తర్వాత గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ఈ ఏడాది ప్రారంభంలో ట్రంప్ చేసిన ప్రకటనలు సంచలనం సృష్టించాయి. దీనిపై చర్చలు జరపాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. అయితే, డెన్మార్క్ అందుకు నిరాకరించడంతో దీనిపై ఎలాంటి ఒప్పందం కుదరలేదు. గ్రీన్‌లాండ్ విషయంలో తనకు మద్దతు తెలపని ఈయూ దేశాలపై అదనపు సుంకాలను విధిస్తానని తొలుత బెదిరించిన ఆయన.. తర్వాత వెనక్కి తగ్గారు. ఇరాన్ అధికారి వ్యాఖ్యలతో తాజాగా ఈ అంశం మరోసారి చర్చకు వచ్చింది.

## అధ్యక్షుడి ఆరోగ్యంపై మరోసారి చర్చ

### విమానం దిగుతూ తడబడిన ట్రంప్..



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై మరోసారి చర్చ ప్రారంభమైంది. ఎయిర్‌ఫోర్స్ వన్ నుంచి దిగేటప్పుడు ఆయన కాస్త తడబడుతూ అడుగులు వేయడమే అందుకు కారణం. శనివారం ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో ట్రంప్ ఫ్లోరిడాకు చేరుకున్నారు. ఈ క్రమంలో రెయిలింగ్ పట్టుకుని విమానం దిగుతూ కన్పించారు. మధ్యలో ఆగుతూ, తడబడుతూ, జాగ్రత్తగా నడుస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. కాగా.. దీనికి ముందు రోజు ఓ కార్యక్రమానికి సంబంధించిన వీడియో కూడా తాజాగా వైరల్ అవుతుంది. అందులో ట్రంప్ కుర్చీలో కూర్చునేందుకు ఇబ్బంది పడినట్లుగా కన్పిస్తోంది. దీంతో అధ్యక్షుడి ఆరోగ్యంపై మరోసారి వార్తలు వస్తున్నాయి. ఈ వీడియోలపై కొందరు నెగెటివ్ కామెంట్లు పెడుతుండగా.. మరికొందరు ఇది సాధారణమైన విషయమేనని కొట్టిపారేస్తున్నారు. ఇక, ట్రంప్ ఆరోగ్యంపై గతంలో కూడా చర్చ జరిగింది. వైట్‌హౌస్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది. ట్రంప్ కూడా తాను చాలా ఆరోగ్యంగా ఉన్నానని అనేకసార్లు పేర్కొన్నారు.




## అయోమయంలో తాడిచర్ల భూనిర్వాసితులు

- సర్వేలో అధికారుల మాయజాలం
- ఏండ్లుగా నివాసం ఉంటున్న న్యూ కన్‌స్ట్రక్షన్ పేరుతో సర్వే

**మల్హర్, మార్చి 22(జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచెర్ల గ్రామంలోని ఓసిపీ బ్లాక్-1కు 500 మీటర్ల డేంజర్ జోన్లో ఉన్న ఇండ్ల జాబితాలో తప్పులు తడకగా ఉన్నాయని నిర్వాసితులు ఆందోళనకు గురివుతున్నారు. 2022 డిసెంబర్ 12న జెన్కో అధికారులు 2,817 ఇండ్లకు టిఎస్ జెన్కో నెంబర్లు వేసి పత్రికల్లో ప్రచురించారు. ప్రస్తుతం రెవెన్యూ, పంచాయతీ అధికారులు సర్వే చేస్తున్న నేపథ్యంలో మొదటి విడతలో 1,203, రెండో విడతలో 1,062 ఇండ్లను మాత్రమే సర్వేలు చేస్తున్నారు. అధికారులు లెక్కల్లో చెప్పేవి మాత్రం 2,472 ఇండ్లు. ఇందులో సుమారు 500 పైచిలుకు ఇండ్లు జాబితాలో మాయం అయ్యాయి. ఈ మూడు సంఖ్యల్లో ఏది నిజమో తెలియక నిర్వాసితులు అయోమయానికి గురివుతున్నారు. పైగా కొందరు నిర్వాసితులు అనేక ఏళ్ల నుండి నివాసం ఉంటున్న గృహాలను అధికారుల తప్పుడు సర్వే తో న్యూ కన్స్ట్రక్షన్ గా నమోదు చేసినట్లు ఆవేదన చెందుతున్నారు. అధికారులు చేస్తున్నా ప్రస్తుత సర్వే లో పేర్లు రానివారు ఇందారపు రవిందర్, గుగ్గిళ్ల లచ్చయ్య, కేశారపు కొమురయ్య, ఇందారపు రామయ్య, కేశారపు దుర్గమ్మ తదితర భూనిర్వాసితులు ఇటీవల కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. మరి కొంతమంది నిర్వాసితుల పేర్లు జాబితాలో మొత్తమే లేకపోవడంతో అయోమయానికి గురివుతున్నారు. డేంజర్ జోన్ ఇండ్ల లెక్కల్లో తేడాలు ఉన్నాయని, సర్వేలో తప్పులు ఉన్నాయని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కేసీఆర్ హరితవనంలో ఎగిసిపడుతున్న మంటలు

### ప్రధాన రహదారి పక్కనే అంటుకున్న కార్చిచ్చు



**దస్తూరాబాద్, మార్చి 22 (జనంసాక్షి):** మండలంలోని దేవునిగూడెం- కడెం ప్రధాన రహదారి పక్కనే ఉన్న కేసీర్ హరితవనంలో కార్చిచ్చు అంటుకుంది. తెలంగాణకు హరితహారంలో భాగంగా మొదటి విడతలో నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు 5 జూలై 2015 లో దేవునిగూడెం లో మొక్క నాటి హరితహారం ప్రారంభించారు. ఆనాటి నుండి ఇప్పటి వరకు కాపాడుకుంటూ వచ్చిన పచ్చని వనానికి ఈరోజు మంటలు వ్యాపించడం వల్ల చాలా వరకు నష్టం జరిగిందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంటలతో వన్యప్రాణులకు సైతం ముప్పు ఏర్పడుతుందని జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మంటలను అదుపులోకి తేవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బాసర గోదావరిలో మృతదేహాల కలకలం



**బాసర, మార్చ్ 23 (జనం సాక్షి) :** నిర్మల్ జిల్లా బాసర లోని గోదావరి నదిలో మృతదేహాలు తెలియాడుతూ కళకళ రేపాయి. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహిళ, పురుషుడి మృతదేహాల ను స్థానిక పోలీసులు పరిశీలించారని తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో నిజాంబాద్ జిల్లా గాజులపేట్ కాలనీకి చెందిన ఆకాష్ (35) గా గుర్తించగా, మహిళ (35) మృతదేహం కుళ్ళిపోయి ఉండడంతో ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తుతెలియని మృతదేహంగా పోలీసులు గుర్తించారు. మృతుల ఇద్దరి వయసు 35 ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తుందని ఈ సందర్భంగా పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కిరణ్ కుమార్ తెలిపారు. ఏదేమైనప్పటికీ ఒకదాని తర్వాత మరొక మృతదేహం గోదావరి నదిలో తెలియాడుతూ ఉండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




## పేదింటి ఆడపిల్ల పెళ్లికి పుస్తెమట్టెలు అందజేత

### ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాగోల్‌లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల్ శ్రీనివాస్ గుప్త బీసీ (చారి) కుటుంబానికి చెందిన జవహర్ నగర్ నివాసి ప్రమీల అనే దివ్యాంగురాలు వారి కుమార్తె జ్యోతి, వెంకట్ పెళ్లికి దంపతులకు పూస్తే మట్టెలు చీర అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాం అని దానిలో భాగంగానే పేదింటి ఆడపిల్ల వివాహానికి అండగా నిలవాలని ఎంతో మందికి పూస్తే మట్టెలు చీర అందజేశారని ఆయన అన్నారు. ఈ సందర్భగా వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివ కృష్ణ గారు మాట్లాడుతూ ఎంతోమంది దివ్యాంగులకు పేదవాళ్లకు అండగా నిలుస్తున్న ఉప్పల అందరికీ ఆదర్శమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, ఐవీఎఫ్ నాయకులు పబ్బా చంద్రశేఖర్ గుప్త, కటకం శ్రీనివాస్ గుప్త, రఘు గంగిశెట్టి, మహిళ నాయకురాలు మనిమాల నళిని అమ్మ ఫౌండేషన్ రూపాయి ఫౌండేషన్ అనిల్ మరుగుజ్జు మహిళా అధ్యక్షురాలు భాగ్యక్క పాల్గొన్నారు.

# సిబ్బందిని తనిఖీ చేసే వ్యవస్థ లేదు

- పది పరీక్షల్లో మాస్ కాపీయింగ్ దందా బహిర్గతం
- మాస్ కాపీయింగ్ కు తెరలేపిన మండల విద్యాధికారి
- తన పాఠశాలలోనే సబ్జెక్టు ఉపాధ్యాయులతో జవాబులు రూపొందిస్తున్న వైనం



**మెదక్ జిల్లా బ్యూరో, మార్చి 22 (జనం సాక్షి) :** విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను భావి భారత పౌరులుగా గురుతర బాధ్యతలు కలిగిన ఉపాధ్యాయులు బరితెగిస్తున్నారు... ఉపాధ్యాయులే అక్రమ మార్గంలో ప్రశ్న జవాబులు సిద్ధం చేసి విద్యార్థులకు చేరవేస్తూ మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారు. పర్యవేక్షించాల్సిన జిల్లా అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులను రెచ్చగొట్టి జర్నలిస్టులపైకి పంపుతున్నారు. మెదక్ జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, నియంత్రణ లోపాలు వెలుగులోకి వచ్చాయి. పరీక్షా కేంద్రాల్లో క్రమశిక్షణ పాటించాల్సిన ఉపాధ్యాయులే నిబంధనలు ఉల్లంఘిస్తూ మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఘటనలు సంచలనం సృష్టిస్తున్నాయి. పదవ తరగతి ఫలితాలలో ఎలాగైనా తమ పాఠశాలకు 100% ఉత్తీర్ణత సాధించాలని లక్ష్యంతో కొంతమంది విద్యాధికారులు నిబంధనలను తుంగలో తొక్కి ఉద్దేశపూర్వకంగానే మాస్ కాపీయింగ్ ప్రోత్సహిస్తున్నారు. అలాంటి సంఘటన జిల్లాలోని కొల్చారం మండలంలో పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారం అంతా కొల్చారం మండల విద్యాధికారి కనుసన్నలలో ఆమె ఆదేశాల మేరకే జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పది పరీక్షల జవాబులు రూపొందిస్తున్న ఉపాధ్యాయులు స్థానిక విలేకరులను చూసి గోడలు దూకి పారిపోయిన సంఘటన అయినప్పటికీ జిల్లా విద్యాశాఖఅధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. ఇందుకు ప్రత్యేక నిదర్శనం కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి నిదర్శనంగా పేర్కొనవచ్చు.

### వాట్సప్‌తో ప్రశ్నపత్రాల లీక్:

పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు వచ్చిన వెంటనే ప్రశ్నాపత్ సెల్ఫోన్ ద్వారా ప్రశ్నాపత్రల ఫోటోలనుతీసి వాట్సఅప్ ద్వారా బయట ఉన్న ఉపాధ్యాయులకు పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి . బయట ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయులతో పరీక్ష ప్రారంభమైన పది నిమిషాల్లో వాటికి జవాబులు సిద్ధం చేసి తిరిగి పరీక్షా కేంద్రాలకు చేరవేస్తున్న వ్యవహారం బయటపడింది. ఉపాధ్యాయులే కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో కొందరు ఉపాధ్యాయులు హెడ్మాస్టర్ గదిలో కూర్చొని జవాబులు తయారు చేస్తూ స్థానిక విలేకరులకు చిక్కారు. విలేకరులను గమనించిన వెంటనే గోడలు దూకి పారిపోవడం మరింత అనుమానాలకు తావిస్తోంది. పరీక్షా కేంద్రాల్లో సెల్ ఫోన్లు నిషేధం ఉన్నప్పటికీ, కొందరు ఉపాధ్యాయులు ఉద్దేశపూర్వకంగా ఫోన్లు తీసుకెళ్తున్నారు. ప్రశ్నపత్రం సీల్ తెరిచిన వెంటనే వాటిని బయటకు పంపడం జరుగుతోందని సమాచారం. ప్రశ్నపత్రాల లీక్‌ను అరికట్టేందుకు క్యూఆర్ కోడ్ వ్యవస్థ ఉన్నప్పటికీ, దానిని తప్పించేందుకు వాట్సాప్ ద్వారా వచ్చిన మెసేజ్ ఫోటోలను క్యూఆర్ కోడ్ రాకుండా జిరాక్స్ తీసి పంపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

### ఎంఈఓ పాత్రపై అనుమానాలు

కొల్చారం ఎంఈఓ ఉమారాణి ప్రమేయంతోనే ఈ వ్యవహారం జరుగుతోందని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమె ప్రోత్సాహంతోనే మాస్ కాపీయింగ్ సాగుతోందని స్థానికులు, ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఆమె హెడ్మాస్టర్ గా పనిచేస్తున్న పోతం శెట్టిపల్లి ఉన్నత పాఠశాలలో ఆమె కార్యాలయ గదిలోనే ఉపాధ్యాయులు పది పరీక్షలకు సంబంధించిన జవాబులను స్టడీ మెటీరియల్ నుండి తీసి మినీ బిట్స్ రూపంలో తయారు చేస్తూ పరీక్షా కేంద్రాలకు పంపుతుండడం గమనర్హం. విషయం తెలిసిన స్థానిక విలేకరులు సోమవారం పోతంశెట్టిపల్లి ఉన్నత పాఠశాలకు వెళ్లగా మండల కేంద్రమైన కొల్చారం లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ బోధిస్తున్న ఉపాధ్యాయురాలు, అంసాన్పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన హిందీ ఉపాధ్యాయలు కైరత్ అలీ, వరిగుంతం పాఠశాల ఉపాధ్యాయుడు శివ, ఎనగండ్ల ఉపాధ్యాయుడు అర్జున్ లు హెడ్మాస్టర్ గదిలో జవాబులను రూపొందిస్తూ పట్టుబడ్డారు. వీరు స్థానిక విలేకరులను చూసి గోడలు దూకి పారిపోయారు. దీంతో ఎంఈఓ ఉమారాణి ప్రోత్బలం తోనే కొల్చారం ఉన్నత పాఠశాలలో పది పరీక్షలలో మాస్ కాపీయింగ్ జరుగుతున్న వైనం గుర్తు రట్టయింది.

### అధికారుల వైఫల్యం

పరీక్షా కేంద్రాల్లో సిబ్బందిని తనిఖీ చేసే వ్యవస్థ లేకపోవడం, పోలీసుల పరిమితి ప్రధాన ద్వారం వరకే ఉండటం వంటి కారణాలతో అక్రమాలకు ఆస్కారం కలుగుతోంది. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తొలగించే చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ కూడా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై జిల్లా విద్యాధికారి విజయ కొల్చారం లోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సందర్శించి లోపాలు ఏం లేవన్నట్లు సమర్థించారు.








## ప్రజాసంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

### ఊరు మందమర్రిలో ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు 2 కోట్ల 31 లక్షల రూపాయలతో శంకుస్థాపన

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్



**మంచిర్యాల ప్రతినిధి మార్చి 22 (జనం సాక్షి) :** ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం నాడు జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో ప్రజలకు త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం కింద చర్యలు తీసుకోవడంతో పాటు ఊరు మందమర్రిలో ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు 2 కోట్ల 31 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలో సి సి రహదారులు, మురుగు కాలువల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టి ప్రజా ప్రయోజనకరమైన కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి చర్యలలో భాగంగా డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులను వినియోగించి పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అమృత్ పథకం ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ అందించి శుద్ధమైన త్రాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెరువులు, కుంటలు ఇతర నీటి వనరులను అభివృద్ధి చేసి శుద్ధం చేసిన నీటి కొరత లేకుండా అందించే దిశగా కార్యచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. చెరువుల సుందరీకరణలో భాగంగా వాకింగ్ ట్రాక్, చెరువుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, చెరువులను శుభ్రం చేయడం ద్వారా భూగర్భ జల మట్టాన్ని పెంపొందించి నీటి లభ్యత గా కృషి చేస్తున్నామని తెలిపారు. సి సి రహదారులు, మురుగు కాలువ వ్యవస్థ అభివృద్ధి చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు

- బోధన సిబ్బంది నియామకం నిల్
- అడ్మిషన్ల కోసం మొగ్గు చూపని విద్యార్థులు
- యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలి...
- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్శిటీకి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో అరకొరగా రూ. 45 కోట్లు నిధులు కేటాయించిందని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి. యాకుబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్థాపించిన డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రస్తుతం లక్ష్యాల దిశగా ముందుకు సాగడంలో విఫలమవుతోందని విమర్శించారు. ఈ ఏడాది సుమారు రూ.45 కోట్ల వ్యయం కేటాయించినప్పటికి అవి అరకొరగా మాత్రమే సరిపోతాయన్నారు. యూనివర్సిటీ ప్రగతి, మౌలిక సదుపాయాల అభివృద్ధి పూర్తిస్థాయిలో జరగకపోవడం, బోధనా సిబ్బంది నియామకాలు లేకపోవడం, విద్యార్థుల ప్రవేశాలపై నిరుత్సాహకర పరిస్థితులు నెలకొనడం వంటి అంశాలు ఈ యూనివర్సిటీ భవిష్యత్తుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రత్యేకంగా, బోధన సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడం వల్ల విద్యా ప్రమాణాలపై ప్రభావం పడుతోందన్నారు. యూనివర్సిటీలో 54 మంది సిబ్బంది అవసరం కాగా నేటి వరకు ఒక్కరిని కూడా నియమించకపోవటం విస్మయాన్ని కలిగిస్తుందని, ఇదే సందర్భంలో సరైన ఫ్యాకల్టీ లేకపోవడంతో విద్యార్థులలో నమ్మకాన్ని దెబ్బతీస్తుందన్నారు. గత ఏడాది

బి. ఎస్సీ జియాలజీ, ఎన్విరాన్ మెంటల్ సైన్స్ లలో 120 సీట్లు ఉండగా , కేవలం 51 మంది విద్యార్థులు మాత్రమే ప్రవేశాలు పొందారని, అదేవిధంగా ఎం.ఎస్సీ జియాలజి, ఎం.ఎస్సీ ఎన్విరాన్ మెంటల్ సైన్స్ లలో 80 సీట్లకు గాను కేవలం 11 మంది విద్యార్థులు మాత్రమే అడ్మిషన్లు పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీ వర్గాలు రూ. 300 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపగా కేవలం రూ.45 కోట్లు మంజూరు చెయ్యటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి డా. మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి ఇతర యూనివర్సిటీలకు నిధులు మంజూరు చేసే విధంగా నిధులు పెంచి యూనివర్సిటీ అభివృద్ధికి దోహదపడాలని కోరారు.

## కుక్కల దాడిలో 15 జింకలు మృతి

- నలుగురు అటవీ శాఖ సిబ్బంది సస్పెన్షన్

**రాయ్‌పూర్ (జనంసాక్షి) :** వీధి కుక్కల దాడిలో 15 జింకలు మరణించాయి. దీంతో అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుర్గుజా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అంబికాపూర్‌లోని సంజయ్ వన్ వాటికను అటవీ శాఖ నిర్వహిస్తున్నది. చిన్న జూ మాదిరిగా ఉండే ఈ వనంలో పలు రకాల జింకలు ఉన్నాయి. వీటిని చూసేందుకు సందర్శకులు వస్తుంటారు. కాగా, శనివారం తెల్లవారుజామున జింకల ఎన్‌క్లోజర్‌లోకి ఐదారు వీధి కుక్కలు చొరబడ్డాయి. అక్కడి జింకలపై దాడి చేశాయి. దీంతో మచ్చల జింక, మొరిగే జింక, నాలుగు కొమ్ముల దుప్పిలతో సహా పద్నాలుగు జింకలు శనివారం మరణించాయి. కుక్కలు కరవడంతో తీవ్రంగా గాయపడిన ఒక జింక ఆదివారం చనిపోయింది. మరోవైపు కుక్కల దాడి వల్ల 15 జింకలు చనిపోయినట్లు సుర్గుజా డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో) అభిషేక్ జోగావత్ తెలిపారు. నిబంధనల ప్రకారం వాటికి అంత్యక్రియలు నిర్వహించినట్లు చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఒక డిప్యూటీ రేంజర్, ముగ్గురు ఫారెస్ట్ గార్డులతో సహా నలుగురిని సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. అంబికాపూర్ సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ నేతృత్వంలో ఒక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు అభిషేక్ జోగావత్ తెలిపారు. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## రోప్ వే కేబుల్ తెగి ఒకరు మృతి

### 17 మందికి గాయాలు

**రాయ్‌పూర్ (జనంసాక్షి) :** చత్తీస్‌గఢ్‌లో దారుణం జరిగింది. రోప్ వే కేబుల్ తెగిపోయిన ఘటనలో ఒకరు మరణించగా, 17 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం నవరాత్రి సందర్భంగా, చత్తీస్‌గఢ్ లోని మహాసముంద్ జిల్లాలోని ఖల్లారి మాత ఆలయంలో జరిగింది. ఈ ఆలయం సముద్ర మట్టానికి 3,000 అడుగల ఎత్తులో పర్వత ప్రాంతంలో ఉంటుంది. ప్రత్యేక వేడుకల కోసం చాలామంది భక్తులు వేకువఝాము నుంచే ఆలయానికి చేరుకు న్నారు. ఎత్తైన కొండపై ఈ గుడి ఉండటంతో కొందరు భక్తులు రోప్ వేను వినియోగిస్తారు. దీని ద్వారా ఆలయం ఉన్న కొండపైకి చేరుకుంటారు. దీనిలో భాగంగా కొందరు భక్తులు రోప్‌వే క్యాబిన్‌లో పైకి వెళ్తుండగా, మార్గమధ్యలో కేబుల్ రోప్ తెగిపో యింది. దీంతో రోప్‌ను పట్టుకుని ఉన్న క్యాబి న్లు కిందపడిపోయాయి. ప్రమాదం జరిగిన స్థలంలో బాధితులు సహాయం కోసం అర్థించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 మార్చి 2026

# పాషాణ హృదయాలపై 'పెంబి' ఆదివాసీల గర్జన..!

తెలంగాణ మ్యాప్‌లో ప్రస్తుత నిర్మల్ జిల్లాలోని 'పెంబి" ఒక చిన్న మండలం కావచ్చు, కానీ అక్కడ నివసించే గిరిజనుల పోరాట చరిత్ర హిమాలయమంత సాంద్రత కలిగినదిగానే చూడక తప్పదు. నిర్లక్ష్యానికి గురైన ఒక జాతి, తమ అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం పాలకుల కోటల పునాదులను కదిలించే ఒక "ప్రజా ఉద్యమం" సాగించిన చరిత్రక ఆనవాళ్లతో తమ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని ప్రస్తుతం నినదిస్తున్నారు. నాడు కొమురం భీమ్ సాగించిన జల్ - జంగిల్ - జమీన్ పోరాటం నేటికీ పెంబి అడవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉందనట్లుగా ప్రస్తుత పరిస్థితి తెలుపుతున్నది. అభివృద్ధి అంటే హైవేలు, ఐటీ టవర్లు, కాంక్రీట్ కట్టడాలు అని భావించే వారికి, పెంబిలోని దోత్తివాగు, కడం వాగులు ఒక చేదు నిజాన్ని గుర్తు చేస్తున్నాయి. వర్షాకాలం వస్తే ఈ మండలంలోని పలు ఆవాస గూడేలు ఒక 'బహిరంగ జైలు'గా మారుతోందనటమే ఇందుకు సాక్ష్యం.

'పెంబి' మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా 3 గ్రామపంచాయతీల పరిధిలోని 16 ఆవాస గ్రామాల పరిస్థితి అగమ్యగోచరమే. ఈ 16 ఆదివాసీ ఆవాస గ్రామాలు (గోండు కోలం నాయకపోడు) వర్షకాలంలో ఎక్కడికక్కడ స్థంభించిపోవడం తప్ప మరోమార్గం లేని పరిస్థితి. దొందారి గ్రామపంచాయతీ పరిధిలోని చాకీరేవు గూడెంలో సుమారు 30 కుటుంబాలు ఉండగా ఒకటే బోరింగ్ ఉంది. ఈ లెక్కన కనీసం సరిపడ తాగునీటి వసతి కూడా లేదనేది అర్థం చేసుకోవాల్సిన అంశం. పక్కనే ఉన్న వాగులో అన్నీ రకాల నీటి సౌకర్యం తీర్చుకోవాల్సిందే. కరెంట్ ఉండదు. ఈ గూడెంలో ఫోన్ సిగ్నల్ ఉండదు. ఆ మండలంలో ఆదివాసీ ఆవాసాలకు, గూడెలకు వంతెనల నిర్మాణం లేకపోవడం వల్ల కేవలం రవాణా వ్యవస్థ మాత్రమే ఆగడం లేదు. అక్కడ ఒక తరం విద్యకు, మెరుగైన వైద్యానికి దూరమవుతోందని గ్రహించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్ లేకపోవడం, అంగన్‌వాడీ పోస్టులు కూడా భర్తీ కాకుండా ఖాళీగా ఉండటం అంటే పెంబి మండలంలో పుట్టబోయే తరాన్ని పౌష్టికాహార లోపానికి, మరణానికి దగ్గర చేయడమే అవుతుంది.

పసుపుల - మందపెల్లి - రాజురా వంతెనలు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండటం అనేది ఇంజనీరింగ్ లోపం కాదు, అది ప్రభుత్వ ప్రభుత్వాధికారుల నిర్లక్ష్య లోపం అనడంలో తప్పేమీ లేదేమో..!

ముందే చెప్పినట్లుగా అభివృద్ధి అంటే కేవలం కాంక్రీటు కట్టడాలు మాత్రమే కాదు. అడవి బిడ్డల కన్నీళ్లు కూడా తుడవడమని పాలకులు ఎప్పుడు గుర్తిస్తారు..? అభివృద్ధి నినాదాలు ఆకాశాన్ని తాకుతున్నా, పెంబి గడ్డపై ఆదివాసీల జీవితాలు మాత్రం ఇంకా వాగుల మధ్య, అడవి కంచెల మధ్య బందీ అయి ఉన్నాయంటే ఎలా అర్థం చేసుకోవాలి..?. ఇలాంటి పరిస్థితిలో తాజాగా సీపీఎం పార్టీ నేతృత్వంలో (మార్చి 21, 2026న) యాపలగూడ నుంచి ప్రారంభమైన పాదయాత్రను పెంబి గిరిజనులు ప్రారంభించారు.

దీనికి ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఉడుత రవీందర్, నిర్మల్ జిల్లా కార్యదర్శి గౌతం కృష్ణ, కార్యదర్శి వర్గ సభ్యులు సురేష్, స్థానిక నాయకులు శంభు, నిర్మలాభాయ్, ధర్మరాజు, పగ్గు తదితరులు నాయకత్వం వహిస్తున్నారు. పెంబి మండల అభివృద్ధిని కాంక్షిస్తూ తలపెట్టిన ఈ పాదయాత్రను రాజకీయ అభిప్రాయాలకు అతీతంగా స్వాగతించాలి. ఇది కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు. ఒక రకంగా ఇది పెంబి గిరిజన గుండె రగిలించిన నిప్పుకణికగా భావించాల్సి వస్తున్నది.

ఎందుకంటే దోత్తివాగు, కడం వాగులు నేటికీ ఆదివాసీలకు శాపంగా మారాయి. మరోవైపు అత్యవసర వైద్యం అందక గర్భిణులు, రోగులు వాగుల ఒడ్డునే ప్రాణాలు వదిలేస్తున్న సందర్భాలు ఉన్నాయని ఆ ప్రాంతవాసులు ఆవేదన చెందుతున్నారు. ఈ స్థితిని చూసి పాలకులు, ప్రభుత్వాధికారుల గుండె కరగకపోవడం శోచనీయమే అవుతుంది. మరోవైపు పసుపుల,



మందపెల్లి, రాజురా వంతెనల నిర్మాణం దశాబ్దాలుగా ఎందుకు అసంపూర్తిగా ఉందో సమాధానం చెప్పే నాథుడే లేడు. ఇంకోవైపు పోడు భూములే గిరిజనుడి జీవనాధారం. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పట్టాలు ఇవ్వకుండా అటవీ శాఖ అడ్డంకులు సృష్టించడం అన్యాయమే అవుతుంది. "అడవి మాది.. అడవిలో పుట్టిన చెట్టు, పుట్ట మావి.. కానీ మా భూమి మాది కాదా..?" అని పెంబి ప్రాంత గిరిజనులు పడుతున్న ఆవేదన నేడు అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఒకరకంగా "అడవిని నమ్ముకున్న వాడికి అడవిపై హక్కు లేకపోవడం" ఈ శతాబ్దపు అతిపెద్ద విషాదం. పోడు భూములకు హక్కు పట్టాలు ఇవ్వకపోవడం ద్వారా ప్రభుత్వం గిరిజనులను వారి సొంత గడ్డపైనే 'అక్రమణదారులు'గా చిత్రీకరిస్తోంది. అటవీ శాఖ ఆంక్షల పేరుతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవడం జరుగుతున్న పరిస్థితి ఉందంటే గిరిజనుడికి ఆకాశమే కప్పుగా ఉండాలని శాసించడం కాక ఏమవుతుంది..?. ఆ మండలంలో త్రీ-ఫేజ్ విద్యుత్ లేక రైతులు పడుతున్న ఇబ్బందులు పారిశ్రామికీకరణ మాటల వెనుక ఉన్న డొల్లతనాన్ని బయటపెడుతున్నాయి. అడవి అంటే చెట్లు మాత్రమే కాదు, ఆ చెట్ల నీడన బతికే మనుషులు కూడా అని ఈ వ్యవస్థ గుర్తించకపోవటం దృరదృష్టకరమైన అంశం. ఇలాంటి అనేక సమస్యలన్నీ పెంబి మండలాన్ని వెనుకబాటుతనానికి సాక్ష్యంగా నిలుపుతున్నది. ఈ పరిస్థితుల్లో సిరిచల్మా నుంచి పులగంపండ్రి వరకు రహదారులు పడాలన్నా, ప్రతి గిరిజనుడికి పట్టా అందాలన్నా, కరెంటు వెలుగులు వికసించాలన్నా ఐక్యతతోనే సాధ్యం. ఆ ఐక్యతను చాటిచెప్పాల్సిన అవసరం ఉంది. పెంబి గడ్డపై జరుగుతున్న ప్రస్తుత పాదయాత్ర కేవలం నడక మాత్రమే కాదు, అభివృద్ధిని నిలదీసే నడక. హక్కులను సాధించుకునే వరకు విశ్రమించని పోరాటంగా చూడక తప్పదు. అడవి బిడ్డల ఆత్మగౌరవం చాటడానికి, రాబోయే తరాల బంగారు భవిష్యత్తు కోసం ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

"పాలకులారా.. మాకు కావాల్సింది ఓట్ల పండగలో ఇచ్చే హామీలు కావు, మా వాగులపై వంతెనలు, మా భూములపై హక్కులు, మా గూడెంలో విద్యా, వైద్యం!" సొంతగూడు కావాలని ఈ పాదయాత్రలో వినిపించే ప్రతి అడుగు చప్పుడు పాలకుల నిద్రను చెడగొట్టేలా ఉండాలి. ఇది కేవలం సీపీఐ(ఎం) పిలుపు మాత్రమే కాదు, పెంబి గడ్డపై దశాబ్దాలుగా అణచివేయబడిన ఆవేదనకు ప్రతినిధిగా నిలువాల్సి ఉంది. కేవలం తమ పార్టీ కార్యక్రమంలాగా కాకుండా పెంబి మండల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే యుద్ధభేరి కావాల్సిన అవసరం ఉంది.



రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్

# ఇంతకంటే ఏంచేస్తాం!




ఎవరి పనులువారివి
ఎవరిస్థానాల్లోవారు
ఎవరికులాలు వారివి
ఎవరిమతాలు వారివి
ఎవడికివాడు మేధావి!
నీతులుచెప్పేవాళ్ళేకాని
వినేవాళ్ళులేరు!
దిక్కులేని వాళ్ళకు
దేవుడొకడున్నాడు
దీనినిబాగానమ్మారు!
దేవుడొక్కడుచాలు!
మానవ మాత్రులు
ఏం చెయ్యగలరు?
ప్రజల మనోభావాలు
ఇలాగే ఉంటాయి!
ఎవ్వరూ మారరు!
రాసేవాళ్ళు రాస్తారు
పాడేవాళ్ళుపాడతారు
కీర్తి కండూతి
వేదికలు! శాలువాలు!
నేనుచెప్పాలనుకున్నది
ఇది కాదు!
ఎవరి అలవాట్లలోవాళ్లు
ఎవరిదరిద్రంలో వాళ్లు
ఉంటే ఉండనీయండి!
ఓదశాబ్దకాలంపైగా
ఃట్రెండ్ః మారింది!
ఆర్యదేవతలొచ్చారు!
కులపిచ్చి మతోన్మాదం
రెచ్చగొట్టేస్తున్నారు!
పాతబడ్డ పడిపోయిన
గుళ్ళ జీర్ణోద్ధరణ!
కాలుష్య నదుల్లో
పవిత్రస్నానాలు
ప్రత్యక్ష స్వర్గం(నరకం)
దేశం అల్లకల్లోలం!
మేమే గొప్ప!
మామతమే గొప్ప!
మా కులమే గొప్ప!
మిగిలినవాళ్లు పాండి!
భూతవైద్యంజ్యోతిషం
ఇవి చదవండి!
రోజూ సైన్స్ వెలుగుల్లో
జీవిస్తున్నప్పటికి
సైన్స్ మనకు వద్దు!
స్వామీజీలు బాబాలు
పీఠాలు మఠాలు!
సెక్స్ కు నెలవులు!
హత్యలు చేస్తున్నా
వాళ్ళకే సాష్టాంగం!
ఒకప్రక్కసామ్రాజ్యవాదం
మరోప్రక్క మత తత్వం
పీక్కు తినేస్తా ఉంటే
ఇలాగే బ్రతికేద్దాం!
ఇంతకంటే ఏంచేస్తాం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్



సాంప్రదాయాలను కాపాడుకోవటం కోసం పండుగలు చేస్తాము. సమాజాని కి ఒక నిర్దిష్టమైన సందేశం ఇవ్వడానికి దినోత్సవాలు చేస్తుంటాం. జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాల సందర్భంగా మన బాధ్యతను గుర్తు చేసుకుం టాం. ఏది చేసినా ప్రపంచ మానవాళి ఆరోగ్యం, శ్రేయస్సు కోసం చేసే ఆరోగ్య అవగాహనా కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగినది. సూక్ష్మజీవులు మనుషులను చంప గలగడం ప్రకృతి విచిత్రం. మానవ శరీరము బ్యాక్టీరి యాలు, వైరస్‌లు అనబడే ఎన్నో రకాల సూక్ష్మ క్రిములతో పోరాడుతూ ఒక్కోసారి క్రిముల దాడికి తట్టుకోలేక వ్యాధుల బారిన పడుతుంది. మార్చి 24 ప్రత్యేకత: ప్రతి ఏటా మార్చి 24న టిబి గురించి ఆలోచించి, అవగాహన పెంచడానికి మన బాధ్యతలేమిటో తెలుసుకోడానికి ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం (వరల్డ్ టీబీ కంట్రోల్ డే) జరుపుకుంటాము. బ్యాక్టీరియా వల్ల వచ్చే క్షయ తీవ్రమైన అంటువ్యాధి. క్షయ వ్యాధి రావడానికి కారణమైనది మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియా. ఈ సూక్ష్మక్రిమిని 24 మార్చి 1882 లో జర్మనీ దేశానికి చెందిన రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త మొదటిసారి కనుగొన్నాడు. అందువల్ల ఇదే రోజున ప్రతి ఏడాది ప్రపంచ క్షయ నివారణ దినంగా జరుపుకుంటున్నాము. క్షయ క్రిమిని కనుగొన్నందుకు రాబర్ట్ కోచ్‌కు 1905లో నోబెల్ పురస్కారం కూడా లభించింది.

# భారత్ గెలుస్తుంది - క్షయ(టీబీ) ఓడిపోతుంది

**(24 మార్చి, ప్రపంచ టీబీ. నివారణ దినోత్సవం)**

క్షయ అనగా : మన దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద ప్రజారోగ్య ప్రాణాంతక సమస్య క్షయ. ఇది స్త్రీ పురుషులకు ఎవరికైనా, ఏ వయసులోనైనా, శరీరంలో రక్త ప్రసరణ ఉన్న ఏ భాగానికైనా (తల వెంట్రుకలు, గోళ్లు తప్ప) రావచ్చును. క్షయ క్రిమికి ఆక్సిజన్ అవసరం కాబట్టి సాధారణంగా ఇది ఆక్సిజన్ ఎక్కువగా లభించే ఊపిరితిత్తులకు సోకుతుంది. దీన్ని శ్వాసకోస క్షయ (పల్మనరీ టీబీ) అంటారు. ఊపిరితిత్తులకు కాకుండా ఇతర శరీర భాగాలకు సోకే క్షయను ఎక్స్ట్రా పల్మోనరీ టీబీ అంటారు. ఇతర శరీర భాగాలు అనగా ఎముకలు, శోషరస కణుపులు, ప్లూరా, కీళ్ళు, కాలేయం, క్లోమం మొదలైన అన్ని అవయవాలకు సోకుతుంది. క్షయ అనగా క్షీణించుట ఈ వ్యాధి వల్ల శరీరం క్రమంగా క్షీణించిపోతుంది. క్షయ వ్యాది అనాది కాలం నుంచి అనేక సామాజిక , ఆర్థిక ఇబ్బందులకు మరియు మరణాలకు ప్రధాన కారణమవుతుంది. మధుమేహ (షుగర్) వ్యాధిగ్రస్తులకు క్షయ వ్యాధి వచ్చే ప్రమాదం 2 నుంచి 8 రెట్లు ఎక్కువగ్గా ఉంటుంది. ప్రపంచ క్షయ వ్యాది గ్రస్తుల్లో దాదాపు 15 శాతం మధుమేహం కలిగి ఉన్నారు. క్షయ వ్యాధి కేసుల్లో మద్యపానం, ధూమపానం చేసేవారిలో ఈ క్షయవ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఎయిడ్స్(హెచ్ఐవి), పోషకాహార లోపం ఉన్న వారు ఈ జబ్బు బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

క్షయ వ్యాధి తీవ్రత: భారతదేశంలో ప్రతి 5నిమిషాలకు ఇద్దరు సగటున రోజుకి సుమారు 600 మంది, సంవత్సరానికి 2 లక్షల మందికి పైగా క్షయ వ్యాధితో మరణిస్తున్నారు. ప్రపంచంలోని ఐదో వంతు క్షయ కేసులు మన భారత్ లోనే ఉన్నాయి. ప్రతిరోజు దాదాపు 6000 మంది, ఏడాదికి 20 లక్షలకు పైగా క్షయ వ్యాధి బారిన పడుతున్నారు. ఒక నయంకాని క్షయ రోగి ద్వారా ఏడాదికి10 నుండి15మందికి ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది.

టీబీ.ఎలా సోకుతుంది?: క్షయవ్యాధి అత్యధిక జనసమ్మర్థం ఉన్న చోట్లలో, మురికివాడల్లో నివసించే వారిలో అధికంగా ఉంటుంది. క్షయ రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు టీబీ.క్రిములు సన్నని తుంపర్ల ద్వారా గాలిలోనికి వ్యాపిస్తాయి. ఈ తుంపర్లను ఆరోగ్యవంతులు పీల్చినప్పుడు వారికి క్షయ వచ్చే అవకాశం ఉంది.

క్షయ వ్యాధి లక్షణాలను గుర్తించడం ఎలా?: కేవలం దగ్గు ఒక్కటే టీబి లక్షణం కాదు. ఈ వ్యాధి ఉన్నవారికి రెండు వారాలకు మించి ఎడ తెరిపిలేని దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి మరియు బరువు తగ్గడం, ఉమ్మిలో తెమడ (కఫం) పడటం లేదా రక్తం పడటం, అలసట లేదా నీరసం ఛాతిలో నొప్పి, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పు వీటిలో ఏవైనా లక్షణాలు కనిపించినట్లయితే క్షయగా అనుమానించవచ్చు.

టీబీ జబ్బుని నిర్ధారించడం ఎలా?: టీబి. సోకిందేమోనన్న అనుమానం ఉన్న వారు దగ్గరలోని డిఎంసి.(డిసిగ్నేటెడ్ మైక్రోస్కోప్ సెంటర్) పరీక్షా కేంద్రాల ద్వారా మన రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోనూ తెమడ (కళ్ళె) పరీక్షలు రెండుసార్లు (ఉదయాన్నే, అప్పటికప్పు డు) పరీక్షలుచేసి వ్యాధిని నిర్ధారిస్తారు. ఒకవేళ రెండుసార్లు పరీక్షలు నెగిటివ్ అయితే ఎక్స్ రే తీస్తారు. ఈ పరీక్షలన్నీ ఉచితంగా చేస్తారు. సిబి నాట్ పరీక్ష ద్వారా రెండు గంటల్లోనే క్షయ వ్యాధి తీవ్రతను నిర్ధారించవచ్చు .

క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందా? : మనదేశంలో 1962లో జాతీయ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమం (ఎన్‌టిసిపి) ప్రారంభమైనప్పటికీ అనుకున్న ప్రగతి సాధించలేక పోయింది. తర్వాత ప్రపంచ ఆరోగ్య సంస్థ 1997లో "ప్రత్యక్ష పర్యవేక్షణ స్వల్పకాలిక చికిత్స (ఋఋ)" విధానాన్ని రూపొందించింది. దీన్నే డాట్స్ పద్ధతి అంటారు. ఈ డాట్స్ పద్ధతిలో శిక్షణ పొందిన ఆశా కార్యకర్తలు మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న క్షయ రోగులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ వ్యాధి దశను బట్టి ఆరు నెలలు లేదా ఎనిమిది నెలలు చికిత్సకు అవసరమైన మందులను తమ సమక్షంలోనే దగ్గర ఉండి మాత్రలను మింగించడం, వ్యాధి పూర్తిగా నయమయ్యేలా చూడటం ఈ విధానం ప్రత్యేకత. ఈ విధానం వల్ల క్షయ రోగులు తప్పకుండా సరైన మోతాదులో, సకాలంలో డాట్ ప్రొవైడర్స్ పర్యవేక్షణలో పూర్తికాలం మందులు వాడినట్లయితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. వీరు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. మద్యం సేవించడం, పొగతాగడం మానాలి.

ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ : ప్రపంచలక్ష్యం 2030 కంటే ముందుగా భారత్ లో టిబి ని నిర్మూలించడం. టిబి కేసులను త్వరగా గుర్తించి, పూర్తిగా నయం చేసి,వ్యాప్తిని తగ్గించడం, నిక్షయ్ పోర్టల్ ద్వారా రోగుల ట్రాకింగ్ పోషకాహారం కోసం ప్రభుత్వ సహాయం అందించడం వంటి లక్ష్యంతో ఈ కార్యక్రమం పనిచేస్తుంది.

క్షయ రోగి- కొన్ని జాగ్రత్తలు: క్షయ తీవ్రమైన అంటువ్యాధి. రోగి ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేయరాదు. దగ్గు వచ్చినప్పుడు గుడ్డ నోటికి అడ్డం పెట్టుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. మందులు వాడే సమయంలో రియాక్షన్ లాంటి వస్తే భయపడకుండా డాక్టర్ని సంప్రదించాలి. మందులు క్రమంగా వాడటం అతిముఖ్యం. వ్యాధి లక్షణాలు తగ్గినప్పటికీ మందులు మధ్యలో మానెయ్య కూడదు. వ్యాధిగ్రస్తులు ఉన్న ఇంట్లోనే 6 యేళ్ళ లోపు పిల్లలకు మందులు ఇప్పించాలి. కొత్తగా గుర్తించిన రోగుల చికిత్స కాలం ఆరు నెలలు (క్యాట్ 1). సరిగ్గా మందులు వాడకపోవడం వల్ల వ్యాధి ముదిరిన వారికి, ఒకసారి నయమై మళ్లీ వ్యాధి తిరగ బెట్టిన వారికి చికిత్స కాలం 8 నెలలు (క్యాట్2). మొండి ఎం.డి.ఆర్.టీబీ. (మల్టిపుల్ డ్రగ్ రెసిస్టెంట్ ట్యూబర్క్యులోసిస్) కి రెండేళ్ల చికిత్స అవసరమవుతుంది. ఈ మొండి ఎం.డి.ఆర్.టీబీ.కి కూడా పూర్తికాలం (రెండేళ్లు) మందులు వాడనట్లయితే వ్యాధి తీవ్రమై ఎక్స్.డి.ఆర్. టీబీ.గా మారి మరణానికి దారి తీస్తుంది. సాధారణంగా క్షయకు ఆరు నెలలు చికిత్స అవసరమైతే ఈ మొండి క్షయకు చికిత్స దీర్ఘకాలం పడుతుంది. క్షయ వ్యాధి రాకుండా నివారించడానికి పుట్టిన పిల్లలకు వెంటనే బి.సి.జి. టీకా వేయించాలి. క్షయరహిత ప్రపంచానికై చేతులు కలిపే నేతలు కావాలి. టీబీ.ని అంతం చేసే చరిత్ర సృష్టించాలి. వీలైనంత త్వరగా టీబీ.ని గుర్తించి క్రమం తప్పక డాట్స్ చికిత్సతో అనారోగ్య క్షయని మొగ్గలోనే తుంచివేయాలి. అప్పుడే టీబీ. ఓడిపోతుంది, భారత్ గెలుస్తుంది.



-నాశబోయిన
నరసింహ (నానకవి),
కవి,రచయిత, ఆరోగ్య విస్తరణ అధికారి,
8555010108.

# భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే..

భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే.. అయ్యుంటే... ఇలా ఆలోచించడం విచిత్రంగా అనిపించవచ్చు కానీ ఊహించవచ్చు కదా.. ఒక వేళ జరిగితే. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లను 1931 మార్చ్ 23న ఉరి తీసి, తల్లి తండ్రులకు యివ్వకుండా యమునా నదిలో రాత్రికి రాత్రే పడేసారు. ఇస్తే ఎట్లుంటదోనని ప్రపంచాన్ని ఏలుతున్న బ్రిటీష్ ప్రభుత్వం కూడా భగత్ సింగ్ కి వచ్చిన పేరుకు బయపడింది. తన చావును భగత్ సింగ్ ఊహించనిది కాదు. తెలిసే చావు నోట్లోకి తల పెట్టీ మరీ చివరి వరకు పోరాడాడు. అట్లా చరిత్రలో వలస వ్యతిరేక దేశాల్లో ఇంతటి త్యాగము చేసిన వాళ్ళలో భగత్ సింగ్ ముందుంటాడు. అంతటి త్యాగ ధనుడు, పోరాట యోధుడు మరణించక పోయుంటే, ఆయనే ప్రధాన మంత్రి అయ్యుంటే ఏమి జరిగేది. అయ్యుండే వాడా అనే సందేహం అక్కరలేదు. అప్పటికే స్వాతంత్ర పోరాటంలో నెహ్రూ కంటే అత్యంత ఫేమస్ అయిన వ్యక్తి భగత్ సింగ్. ఒక్కో సందర్భంలో గాంధీ కంటే ఈ దేశంలో భగత్ సింగ్ పేరే వినిపించింది అని కాంగ్రెస్ నేత పట్టాభి సీతారామయ్య చేసిన వ్యాఖ్యలు గుర్తుపెట్టుకుంటే అది అతిశయోక్తి అస్సలు కాదు. అందుకే భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయ్యే అవకాశం తప్పక ఉండిందనేది మన ఊహా తప్పుకాదు.

ఒకవేళ అయ్యుంటే ఎలా ఉండేది. ఆయన ఆచరణలో అత్యంత వీరుడిగానే కాదు ఆయన ఆలోచనలను బట్టి చూస్తే ఈ దేశంలో అతిగొప్ప మేధావులకు ఈ మాత్రం తీసిపోని వ్యక్తి అనేది సందేహమే లేదు. అప్పటికే హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ కి రాసిన కరపత్రం కానీ, " వై అయామ్ యాన్ ఎతీస్ట్ " అనే వ్యాసం గానీ, లేకపోతే ఆయన వివిధ సందర్భాల్లో రాసిన లేఖలు గానీ చదివితే మనకు భగత్ సింగ్ థింకింగ్ పవర్ ఏంటో అర్థం అవుతది. అలాంటి ఉడుకునెత్తురు ఉన్న యువ హీరో, హైలెవల్ థింకర్, ఎంతో దూర దృష్టి ఉన్న నేత అప్పటికాలంలో ఇంకెవరూ లేరనే చెప్పాలి. ఫ్యూచర్ మీద అత్యంత క్లారిటీ ఉన్న లీడర్ మొత్తం స్వాతంత్ర్యోద్యమంలో ఒకరిద్దరు తప్పితే ఎవరూ కనిపించరు. నిజానికి భగత్ సింగ్ లా దేశం మొత్తం పాపులర్ అయిన వ్యక్తులను బ్రిటీష్ ప్రభుత్వం ఎవరినీ చంపలేదు. కేవలం భగత్ సింగ్ నే చంపింది. ఎందుకంటే ఆయన ఆలోచన ధోరణి మాత్రమే వారు అత్యంత ప్రమాదంగా భావించారు. ఆ భావన, థాట్ ప్రాసెస్ కే బ్రిటీష్ వాడు భయపడ్డాడు. ఈ నేపథ్యంలో నుంచే ఈ దేశానికి ప్రైమ్ మినిస్టర్ అయితే ఈ దేశ రూపు రేఖలు ఎలా ఉండేవి, ఏమి జరిగుండేది.

భగత్ సింగ్ గురించి మాట్లాడుతూ అనేకులు చెబుతున్న విషయాలను బట్టి చూసినా ప్రైమ్ మినిస్టర్ భగత్ సింగ్ తప్పక ఈ దేశ భవిష్యత్ ను అత్యంత సుందరంగా తీర్చి దిద్దేవాడు. ఇన్నేళ్లకాలంలో ఈ దేశం ప్రపంచ పటంలో నెంబర్ వన్ గా నిలిచేది. లేకుంటే ప్రపంచ సంపన్న దేశాలలో రెండు మూడు స్థానాల్లో తప్పక ఉండేది. ఎందుకంటే ఏ పనులు చేస్తే ఈ దేశం అభివృద్ధి చెందేదో ఆయనకు క్లారిటీ ఉంది కాబట్టి.



భగత్ సింగ్ బాధ్యతలోకి ఆయన తన చివరి గడియల్లో ఉరి ముంగిట కోరిన కోరిక మేరకు, తన మొదటి అడుగు పెద్ద దళిత తల్లి ఇంట్లో పడేది. ఆ తల్లి చేతి ముద్ద తిని అక్కడే ఇంకెవరూ ఈ దేశంలో అంటరాని వారుగా ఉండడానికి లేదని, వివక్ష కొనసాగడానికి వీలు లేదనీ తీర్మానం ప్రకటించేవాడు. అసలు కుల వ్యవస్థ రద్దు అనే ప్రక్రియ మొదలెట్టేవాడు. కులాన్ని పాటించడం అత్యంత నేరమని ప్రకటించేవాడు. కుల, మత సర్టిఫికెట్ లేని స్థితి ఉండేది. దేశ నిర్మాణానికి అత్యంత ముఖ్యమైన ఈ దేశ రాజ్యాంగం ఎంతో ఉన్నతంగా ఉండేది. అంబేద్కర్ రాసి, చేర్చలేని ఇంకా ఎన్నో అందులో చేరేవి. పేదలకు చుట్టాలుగా భావించే అద్భుతమైన చట్టాలు రాజ్యాంగంలో భాగం అయ్యేవి. గుంటెడు జాగలేని పేదోడికి ఇల్లోచ్చేది. శ్రమ చేసే శక్తి ఉన్న జనానికందరికీ ఈ దేశ భూమి పంచపడటం అత్యంత పకడ్బందీగా మొదటి రెవల్యూషనరీ పనిగా చేస్తుండేవాడు. బువ్వలేక సతమత మయ్యే బక్కోడి నోట్లోకి నాలుగు ముద్దలు చేరే ముందటి కర్తవ్యంగా ఉండేది. ఈ దేశంలో సగభాగమైన మహిళల కోసం అంబేద్కర్ తలపెట్టిన హిందూ కోడ్ బిల్లు చట్టంగా రూపొందేది. అంబేద్కర్ సహచర్యంతో ఆయన ముందుకెళ్ళేవాడు. చట్టసభల్లోనే కాదు యావత్ దేశ అన్ని విభాగాల్లో మహిళలకు ముప్పై మూడు శాతం డిమాండ్ కంటే ఇంకా ముందడుగు వేసి యాభై శాతం మహిళల హక్కు అనేదానినీ నిజం చేసేవాడు. ఆయన ఉద్యమంలో మహిళకు ఇచ్చిన గౌరవం ఇచ్చిన దానికి నిదర్శనంగా ఉండేది. ఆరుగాలం కష్టపడే రైతు కన్నీళ్లు తుడిచే పంటకు మద్దతు ధర ఇవ్వడమే కాదు ప్రభుత్వమే పంటలనుకొని ప్రతి కుటుంబానికి అందించేది. దళారీ, కార్పోరేట్ మోసంను దయలేకుండా అణిచేసే వాడు. పంటకు విత్తనాలు కూడా ప్రభుత్వమే అందించేది. రైతు ఆత్మహత్యలు జరగని సమాజానికి దారులు పరిచేవాడు. అంతే కాదు ఈ దేశ ప్రజలు అవసరాలు తీర్చే పరిశ్రమలు పద్ధతిగా ప్రభుత్వ పరిధిలోనే నడిచేవి. ఉన్నోళ్లు పరిశ్రమ పెట్టీ దోచుకునే వ్యవస్థ రద్దయ్యి ప్రతిభ జనం సహకారంతో ప్రభుత్వం నడిపే పరిశ్రమలు ఉండేవి. కార్మికులకు సరిపోయే వేతనాలు, సెక్యూరిటీ ఉండేవి. ఏ రంగాల్లో ఎంత ఉత్పత్తి అవసరం, ఇతర దేశాలకు ఎంత ఎగుమతి అనే ప్రాతిపదికతో ప్రణాళిక బద్దమైన పరిశ్రామిభివృద్ధి ఈ దేశ విధానంగా ఉండేది. అన్ని రంగాల ఉద్పాదకతలో దూసుకుపోయేది.

ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డ చదువు బాధ్యత ప్రభుత్వందేననే భగత్ సింగ్ ప్రభుత్వ విధానంగా ఉండేది. గూడెం గుడిసె తండాలో చీకటి బతుకుల్లో చదువు వెలుగులు వెలిగించేవాడు. ఆ చదువు అత్యంత సైంటిఫిక్ గా ఉండేది. అదో జీవన విధానం అయ్యేది. చైనా లాగా, నాటి సోవియట్ లాగా ప్రాక్టికల్ ఎడ్యుకేషన్ హై క్వాలిటీగా ఉండేది. న్యూ ఇన్నోవేషన్ కు క్లాస్ రూమే బేస్ అయ్యేది. అంతేకాదు నెహ్రూ స్థాపించిన రీసెర్చ్ సెంటర్స్ కంటే ముందుకెళ్ళి ప్రపంచంలో అత్యంత టెక్నాలజీ కింగ్ గా భారత్ అవతరించేలా సైంటిస్ట్ లకు ప్రోత్సాహం ఉండేది. అంతరిక్షం అత్యంత చవకగా వెళ్లొచ్చే మార్గం అయ్యేది. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ఎగిరే వ్యవస్థ ఇప్పటికే వచ్చేది. చంద్ర మండలంలో అడుగు పెట్టడమే కాక మార్స్ పైకి ఫస్ట్ చేరే దేశం అయ్యేదేమో.

వైద్యం అందక మలేరియాతో చచ్చే అవస్థ అంతం ఎప్పుడో అయ్యేది. ఉచిత వైద్యం ప్రతి ఒక్కరి హక్కు అయ్యేది. మన దేశంలో కేరళ, ప్రపంచంలో క్యూబా లాగా ప్రతి ఊరికి వీదీదీ డాక్టర్ లు ఉండేవారు. ఇంటివద్దకే వైద్యం వచ్చేది. ఏ రోగానికైనా మందు కనుగొనే మొదటి దేశాల చెంతన ఇండియా ఉండేది. కూడు, గుడ్డతో పాటు వైద్యం గ్యారంటీ కాబడేది.

చదువుకున్న ప్రతిఒక్క యువకునికి పని కల్పించబడటం ఈ దేశాభివృద్ధికి అత్యంత ముఖ్యమైన బాధ్యతగా ఉండేది అది భగత్ సింగ్ నినాదంలా ఉండేది. ప్రతిభ ఉన్న యువతకు ఉమ్మడి పరిశ్రమ స్థాపించడానికి రాయితీ ఇచ్చి ప్రోత్సాహంచే వ్యవస్థ ఉండేది. బ్యాంకులు ఎట్లాగూ జాతీయం కాబడేవి. వృత్తి పరిశ్రమలు కూడా ప్రతిభ ఆధారంగా ప్రోత్సాహం ఇచ్చి, కుల ఆధారిత వృత్తి పనులు ఆగి ఆధునికతలో వారిని భాగస్వామ్యం చేసేలా ఉండేది. స్పోర్ట్స్ ప్రతి పిల్లాడికి తప్పని సరి విద్యా వ్యవస్థలో చేసి ఉండటమే కాదు. ఒలింపిక్స్ లో నెంబర్ వన్ లేదా టూ లో ఉండే స్థితి వచ్చేది.

ప్రపంచానికి దూరంగా ఉన్న గిరిజనులకు అడవితో ఉన్న పేగుబంధాన్ని తెంపకుండా అడవి వారి బతుకు హక్కుగా ఇచ్చి, తల్లిలా అడవిని కాపాడుకొనే బాధ్యత వారి చేతుల్లోకే చేరేది. అడవి కొట్టకుండా అభివృద్ధి ప్రణాళికలు ఉండేవి. పట్టణాలను పకడ్బందీ ప్రణాళికతో నిర్మాణం గావించబడేవి. రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ వందేళ్ల ముందుచూపుతో వేయబడేవి. చెరువులు, కుంటలు, నదులు చెడిపోకుండా ఆనకట్టలు కట్టి అందరికీ త్రాగునీరు, సాగునీరు ఇచ్చేవారు. కాలుష్యం కానరాని స్వచ్ఛమైన నీరు వాగ్దానం చేయబడేది. అందుకే ఆకలితో అలమటించని పచ్చని పైరులతో సస్య శ్యామలమైన సువిశాల దేశంగా ఇండియా ఉండేది.

ఎన్నుకొనే విధానం, ఓటు హక్కు అందరికీ ఉండటమే కాదు ప్రాతినిధ్య ఎన్నిక విధానం ఉండేది. ఎంత శాతం అనే దాన్ని బట్టి వారికి అన్ని సీట్లు అనే సిస్టమ్ ఉండేది. ఎన్నికయిన వారు తప్పుచేస్తే మధ్యలోనే తీసేసే రిఫరెండం అడిగే హక్కు ప్రజలకు ఉండేది. బడ్జెట్ బడాబాబుకోసం, అంబానీ, అదానీల కోసం కాకుండా సామాన్యుడికి చేరే అనుసంధాన కర్తగా ప్రభుత్వం ఉండేది. ప్రజా ప్రతినిధులు పక్కగా ప్రజా సేవకులుగానే ఉండే పద్ధతే భగత్ సింగ్ ఏర్పాటు చేయించేవాడు. రాజ్యంలో మతం స్థానం లేదని ఇంట్లో వరకే మతం, బయట ప్రేమించే మనుషులం ఉండేలా అన్నదమ్ముల్లా జీవించే మానవత్వం మన మతం అనే ప్రభుత్వ పద్ధతి తప్పక ఉండేది. మత కొట్లాటలు లేని దేశం వాగ్దానం కాబడేది.

భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే ప్రపంచ దేశాలతో సహకారంగా భారత్ ఉండేది. పక్క దేశాలు పక్కాగా మనకు దోస్తీ చేసేవి. ఆపద వస్తే వాటికి అండగా మన దేశం నిలబడేది. యుద్ధం ప్రపంచ ప్రజల వినాశనానికే అనే విధానంతో ఇండియా ఉండేది. భగత్ సింగ్ ఉంటే అమెరికా సామ్రాజ్య వాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవాడు. బాధిత దేశాలకు తప్పక అండగా ఉంటామని ప్రకటించేవాడు. అంతేకాదు. ప్రపంచంలో అన్ని దేశాలకు దిక్కు ఇండియా అయ్యేది. ఐక్యరాజ్య సమితిలో ఇండియా ఎప్పుడో శాశ్వత దేశం అయ్యేది. భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే భారత్, చైనా, రష్యా ప్రపంచానికి భరోసా నిచ్చేవి. అమెరికా ఏ దేశంపైనా యుద్ధం చేయడానికే జంకే స్థితి ప్రపంచ యవనికమీద ఏర్పడేది. జగతికి వెలుగులా ఇండియా అయ్యేది. భగత్ సింగ్ ప్రైమ్ మినిస్టర్ అయితే సామ్రాజ్యవాదం మూర్ధాబాద్ అనే నినాదం దేశ ప్రతి మూలన వినబడుతూనే ఉండేది.

ఇది ఊహాత్మకమే అయినా అప్పటి రష్యా, ఇప్పటి చైనా కమ్యూనిస్టు దేశాలతో పోల్చి చూస్తే సాధ్యమేనని చెప్పొచ్చు. ఎందుకంటే ప్రపంచ మానవాళి విముక్తి సిద్ధాంతం నమ్మిన వాడు భగత్ సింగ్ కాబట్టి ఇవన్నీ జరిగేవి అనే దానిలో ఎటువంటి సందేహం అక్కరలేదు. ఇంక్విలాబ్ జిందాబాద్, సామ్రాజ్యవాద్ మూర్ధాబాద్, భగత్ సింగ్ జిందాబాద్.



ఏ. విజయ్ కుమార్
రచయిత
9573715656.

# మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టి బడ్జెట్‌లో మోసం

- నిరుద్యోగ యువతను నయవంచన చేయడమే..?
- నిరుద్యోగ భృతి నిధులు ఎక్కడ..?
- సీనియర్ నాయకులు కే. వేణుగోపాల్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పి.శ్రీకాంత్ రెడ్డి

**ధారూర్, మార్చి 22 (జనంసాక్షి) :** 6 గ్యారంటీలు 420 హామీలు 600 ఫీట్ల గొయ్యిలో పాతి పెట్టారని మూడుసార్లు రైతుబంధు రైతులను మోసం చేశారని నిరుద్యోగ యువతను నయవంచన చేయడమే కాకుండా నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించకుండా సబ్బండ వర్గాలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మండల బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ అధ్యక్షులు కే.వేణుగోపాల్ రెడ్డి.మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి.అన్నారు. ఆదివారం నాడు మండల కేంద్రంలో స్టార్ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 28 నెలలు కావస్తుంది.28 నెలలో ప్రజలకు ఎన్నికల కంటే ముందు ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీ ల పేరుతో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన 100 రోజులలోనే హామీలన్నీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి మీటింగ్ లో చెప్పడం జరిగిందని గతంలో పీసీసీ అధ్యక్షులుగా ఉండి ముఖ్యమంత్రి అయిన వెంబడే హామీలు హామీలు చేస్తామని చెప్పడంతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితి లేకున్నా కూడా ప్రియాంక గాంధీ రాహుల్ గాంధీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే సభలు పెట్టి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో దళిత డిక్లరేషన్. అదేవిధంగా కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేశారు. అన్ని డిక్లరేషన్ల పేర్లతో ఢిల్లీ నుంచి నాయకులు వచ్చి రాహుల్ గాంధీ యువత గురించి మాట్లాడడం జరిగిందని రాహుల్ గాంధీని కాంగ్రెస్ నాయకులను ఒకటే అడగదల్చుకున్నాము. మొన్న వికారాబాద్ వచ్చిన రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చే ముందు తెలంగాణ రాష్ట్రానికి తమరు ఏం డిక్లరేషన్ లు ఇస్తామని చెప్పారు ఒక్కసారి ఆలోచన చేయాలని అన్నారు.కెసిఆర్ యువతకు ఏం చేయలేదు. నిరుద్యోగులకు ఏం చేయలేదు.మహిళలకు ఏం చేయలేదు.రైతులకు కేసీఆర్ ప్రభుత్వంలో రెండు పంటలకే రైతుబంధు ఇస్తుండు మూడు పంటలకు ఎందుకు ఇవ్వలేదని మాట్లాడారని ఆరోజు యావత్ తెలంగాణ ప్రజలు మీ మాటలు



విన్నారని ఈ సన్యాసి మూడు పంటలకు ఎందుకు ఇవ్వడం లేదు అని అంటారు కదా ప్రస్తుతం మీ ప్రభుత్వ హాయంలో రైతులకు రెండు పంటలకు కూడా ఇవ్వకుండా రైతులకు రైతుబంధు డబ్బులను మూడుసార్లు ఎగ్గొట్టిన సన్యాసి ఎవరో తెలంగాణ రాష్ట్ర ప్రజలు అందరూ గమనిస్తున్నారని అన్నారు.గతంలో కాంగ్రెస్ పార్టీ పది సంవత్సరాలు పరిపాలిస్తే అంతకుముందు 60 సంవత్సరాలు దేశాన్ని పరిపాలిస్తే రైతు చనిపోయాడని కుటుంబానికి ఒక లక్ష రూపాయలు ఇవ్వాలని రోడ్లపై శవాన్ని పెట్టి ధర్నా చేస్తే కూడా ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితి కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.కెసిఆర్ 10 సంవత్సరాలు ఎలక్షన్ ఎన్నికలలో హామీ ఇవ్వకున్నా రైతు బంధు.రైతు బీమా.24 గంటల కరెంటు రైతులకు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.రైతు ఏ విధంగా చనిపోయిన కూడా రైతు కుటుంబంలో వెలుగులు నింపాలని రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో 5 లక్షల రూపాయలు బీమా పథకం పెట్టి రైతుల కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం అందక సెట్ల దగ్గర షావుకారుల దగ్గర అప్పులు తెచ్చుకునే పరిస్థితి ఉందని అన్నారు.గత ప్రభుత్వ హాయంలో రైతులకు నేరుగా అకౌంట్లోకి రైతుబంధు డబ్బులు వేసిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందని అన్నారు.కెసిఆర్ ప్రభుత్వ హాయంలో రైతులను రాజులుగా చేశారని అన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన హామీలకు దిక్కులేవు. లగ్న పత్రిక తీసుకొని వచ్చి కళ్యాణ లక్ష్మి చెక్కుతో పాటు తులం బంగారం పెండ్లిలోనే ఇస్తా అంటివి ఏమాయే రేవంత్ రెడ్డి చెప్పిన హామీలు ఏమి అమలు చేయడం లేదని ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ నైజం అని మోసానికి మారుపేరే కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలో అధికారంలో ఉంటుందో అక్కడ సంక్షేమం అభివృద్ధి చేస్తామని అడ్డమైన హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి మోసం చేస్తారని అన్నారు. కేసీఆర్ మిషన్ భగీరథ నీళు ప్రజలకు అందిస్తే కనీసం మిషన్ భగీరథ నీళ్లను కూడా ప్రజలకు అందించకుండా ప్రజలను కష్టాలపాలు చేస్తున్నారని 10 రోజుల నుండి గ్రామాలలో నీళ్లు రావడంలేదని అన్నారు. ప్రజలకు చైతన్యం కల్పించవలసిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అభివృద్ధిని మరిచిపోయి ప్రతిపక్ష పార్టీని తిట్టడం తప్ప కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీ లేదని ప్రశ్నిస్తే కేసులు పెట్టడం జైలుకు పంపించడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదు. హామీలు అమలు చేయాలని వికారాబాద్ జిల్లా పరిస్థితి చూస్తే ఏం బాగాలేదని కొడంగల్ పై ఉన్న ప్రేమ ముఖ్యమంత్రి కి వికారాబాద్ పై ఎందుకు లేదని స్పీకర్ అంటే చిన్న చూపా...? వికారాబాద్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఏం అభివృద్ధి చేశారు చెప్పాలని అన్నారు. కెసిఆర్ హయంలో వికారాబాద్ జిల్లా ఏర్పాటు. మెడికల్ కాలేజ్ ఏర్పాటు. ఆయుష్ హాస్పిటల్.100 పడకల ఆసుపత్రి.కలెక్టర్ కార్యాలయం. పరిపాలనను వికారాబాద్‌కు తీసుకువచ్చారని ప్రస్తుత ముఖ్యమంత్రివర్యులు వికారాబాద్ అభివృద్ధిని విస్మరించడం జరిగిందని అభివృద్ధి మీద దృష్టి పెట్టి రోడ్లు బాగు చేయాలని స్పీకర్ ను కోరుతున్నాం వికారాబాద్ అభివృద్ధి చేయండి హామీల మీద దృష్టి పెట్టండి మహిళలకు 2500 ఎప్పుడు ఇస్తారు ప్రభుత్వం సమాధానం చెప్పాలని రైతులకు పెట్టుబడి సాయం కింద 7500 రెండు పంటలకు కలిపి ఎప్పుడు ఇస్తారు సమాధానం చెప్పాలని అంబేద్కర్ అభయహస్తం కింద దళితులకు 12 లక్షలు ఎప్పుడు ఇస్తారు చెప్పాలని యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 20 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారని తులం బంగారం ఎప్పుడు ఇస్తారు. 6 గ్యారంటీలు 420 హామీలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారని హామీలు అమలు అయ్యేవరకు పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని మండల బిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ ఒక్క వర్గాన్ని కి సంతృప్తికరంగా లేదని బి ఆర్ఎస్ పార్టీ హాయంలో బడ్జెట్ కు కాంగ్రెస్ పార్టీ బడ్జెట్ కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందని ఎద్దేవ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాంగిర్.ధారూర్ మాజీ సర్పంచ్ చంద్రమౌళి. పార్టీ అధ్యక్షులు మహేష్. సీనియర్ నాయకులు రహమతుల్లా ఖాన్. భీమ్సేన్ చారి.చాన్.నజీమ్. లక్ష్మయ్య. అశోక్.గోపాల్.మహేష్. వెంకట్.పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



**శామీర్‌పేట్, మార్చి 22 (జనం సాక్షి) :** శామీర్ పేట్ డివిజన్ లోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం మహిళ శక్తి మై వాయిస్ సంఘం కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షురా లు హైమారెడ్డి అన్నారు.ఆదివారం మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో 'మీ సమస్య మా పరిష్కారం అను కార్యక్రమంను మేడ్చల్ నియోజకవర్గం, శామీర్పేట్ డివిజన్ శామీర్ పేట్ గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆఫీస్ వద్ద నిర్వహించి గ్రామ ప్రజల సమస్యల పై వినతులు తీసుకున్నారు. ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజన పథకంను మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజల అందరికి ఉచితంగా అందిస్తున్నట్లు మహిళా శక్తి మై వాయిస్ సంఘం హైమారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్. హైమా రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షురాలు మహిళా శక్తి మై వాయిస్ సంఘం, రమేష్ అంబటి మహిళా శక్తి ట్రెజరర్, సుదర్శన్ బిజెపి జిల్లా కార్యదర్శి, బి. సాయి కుమారి, పావని, జి. విజయ లక్ష్మి, జై బూన్ లు పాల్గొన్నారు.

## గ్రామంలో మౌలిక సదుపాయాల ప్రాధాన్యతే లక్ష్యం

**వెల్దండ, మార్చి 22 (జనంసాక్షి) :** బైరాపూర్ గ్రామంలో గల మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని సర్పంచ్ తిరుగుడు మంజుల రాజు యాదవ్ అన్నారు. ఆదివారం బైరాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన రూ. 9 లక్షల రూపాయలతో చేపట్టిన అంతర్గత సిమెంట్ రహదారుల నిర్మాణ పనులను ఆమె భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో త్రాగునీరు, వీధి దీపాలు, మురుగు కాలువలు, రహదారి నిర్మాణాల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తలారి లక్ష్మీదేవి జంగయ్య, నాయకులు భరత్, శ్రీను , నరసింహ, జగన్, వెంకటేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ విధేయులకే అధిష్టానం పట్టం కట్టింది

- బాధ్యతలు చేపట్టిన జిల్లా కమిటీ కార్యవర్గం




**వనపర్తి బ్యూరో, మార్చి 22 (జనం సాక్షి) :** ప్రజలకు ఏ కష్టం వచ్చినా ప్రజలకు, కార్యకర్తలకు వెన్నంటూ ఉంటూ పట్టు వీడని విక్రమార్కుల్లాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి సూచించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పూర్తిస్థాయి కమిటీతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి హాజరై పాల్గొన్నారు. నూతనంగా నియమించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గాని నియామక పత్రాలు ఇచ్చి, శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధిష్టానం మేరకు వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో నియమించిందని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి, గ్రామ కమిటీలను మండల కమిటీలను నియమించాలని సూచించడం జరిగింది అన్నారు.నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ ఆరు అంశాలపై సమీక్షించడం జరిగిందన్నారు. మొదటగా జిల్లా పార్టీ కార్యాలయాన్ని త్వరలోనే నిర్మాణం చేపట్టాలని, స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి ప్రతిపాదించగా కమిటీ సభ్యులందరూ ఆమోదించడం జరిగిందని అన్నారు. కొత్తగా నియమించిన జిల్లా కమిటీ సభ్యులు ప్రజల కోసం, కార్యకర్తల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. లేనియెడల వారి పనితీరును బట్టి సమలోచనచేసి మార్పులు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. పదవులను అలంకరణప్రాయంగా చూడొద్దని క్షేత్రస్థాయిలో పనిచేసి ప్రజల మనసు గెలవాలన్నారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ డెలికేట్ శంకర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, బ్రహ్మాచారి, సాయి చరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, చిర్ల జనార్దన్ సాగర్,కాంగ్రెస్ యువజన జిల్లా అధ్యక్షులు ఆదిత్య, పాండు సాగర్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు యాదగిరి, పర్వతాలు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం



**కాప్రా, మార్చి 22 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ లో బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ ఉద్యమకారుడు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్దాపురం కుమారస్వామి అన్నారు. ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు ఏ ఎస్ రావు నగర్ లోని ఉప్పల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026 సంవత్సరానికి సంబంధించిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ మొత్తంగా సుమారు రూ. 3.25 లక్షల కోట్లు అయినప్పటికీ, రాష్ట్రంలో 56% జనాభా కలిగిన బీసీ వర్గాలకు కేవలం రూ. 12,511 కోట్లు మాత్రమే కేటాయించడం తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇది మొత్తం బడ్జెట్‌లో సుమారు 3.8% మాత్రమే ఉండడం గమనార్హం. బీసీల అభివృద్ధికి తగిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడమే కాకుండా, అత్యంత కీలకమైన బీసీ సబ్ ప్లాన్‌ను ఈ బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం తీవ్ర ఆక్షేపణీయ విషయం. ఇది బీసీ వర్గాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపుతోంది. నిరుద్యోగ యువతకు ఎంతో ఆశాజనకంగా భావించిన జాబ్ క్యాలెండర్‌ను కూడా ఈ బడ్జెట్‌లో ప్రకటించకపోవడం యువతలో తీవ్ర నిరాశను కలిగించింది. ఎన్నికల సమయంలో 42% బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఆ అంశాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. గురుకుల పాఠశాలల్లో కనీస వసతులు కూడా లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ బడ్జెట్‌లో స్పష్టమైన చర్యలు లేకపోవడం విద్యా రంగానికి దెబ్బతీస్తోంది. రైతు కూలీలు, చిన్న మరియు మధ్య తరగతి రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించినట్లు ఈ బడ్జెట్ కనిపిస్తోంది. అలాగే, దళిత బంధు పథకంలో రూ. 10 లక్షల బదులు రూ. 12 లక్షలు ఇస్తామని చెప్పి ఆ హామీని అమలు చేయకపోవడం కూడా ప్రభుత్వంపై విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. ఈ నేపథ్యంలో, ఈ బడ్జెట్‌ను బీసీ వ్యతిరేక బడ్జెట్‌గా బీసీ సమాజం అభివర్ణిస్తోంది. తెలంగాణలో ఉన్న సుమారు రెండున్నర కోట్ల బీసీలు, ఉద్యోగస్తులు, మేధావులు, విద్యార్థులు ఈ బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జరిపోతుల ప్రభుదాస్, బీసీ నాయకులు వంజరి ప్రవీణ్, భాస్కర్, సాయి జన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ గొల్లూరి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రీమియం లీగ్ క్రికెట్ సీజన్-2 పోటీ విజేతలకు బహుమతులు అందజేత

**కొడంగల్, మార్చి 22 (జనం సాక్షి) :** క్రీడల ద్వారా యువకుల్లో మానసిక ఉల్లాసంతో పాటుగా పోటీ తత్వం పెరుగుతుందని అంగడి రాయిచూరు గ్రామ సర్పంచ్ కుమ్మరి సౌభాగ్య లక్ష్మి నాగప్ప అన్నారు. కొడంగల్ మండలం అంగడి రాయిచూరు గ్రామంలో ఉగాది , రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2 పోటీలు నిర్వహించారు.పోటీలో విజేతగా రైసింగ్ చాలెంజర్స్ ఎఆర్ విన్నర్ కు సర్పంచ్ కుమ్మరి సౌభాగ్య లక్ష్మి నాగప్ప 15000 ఎఆర్ ఛాంపియన్ చసర్స్ రన్నర్ కు ఉప సర్పంచ్ కూర్వ శ్యామమ్మ బాలప్ప 7500 లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.రాములు,ప్రతాప్ రెడ్డి,శేఖర్ గౌడ్, పకిరప్ప, చిన్నయ్య, గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం



**మిడ్జిల్, మార్చి 22 (జనం సాక్షి) :** జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని సీనియర్ పాతికేయులు బరిగెల వెంకటయ్య, మేడిపల్లి బాల్ రెడ్డి అన్నారు. ఆదివారం మిడ్జిల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాజేష్ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమస్యలు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డ్స్, మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ నిర్మాణం, ఆర్థిక ఇబ్బందుల్లో, ఆపద సమయంలో ఉన్నప్పుడు జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేసుకుంటే తోటి మిత్రులను ఆదుకోవచ్చని అన్నారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సహకారంతో విలేకరుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్లు బేస్మెంట్, పిల్లర్లు నిర్మాణం మధ్యలో ఆగిపోయిన వారికి ఇల్లు వచ్చేలా ప్రభుత్వం రెండో విడతలో చర్యలు తీసుకుంటుందని అన్నారు. తదితర అంశాలపై చర్చించారు. ప్రతి ఒక్కరూ పోస్ట్ ఆఫీస్ లేదా సంబంధిత బ్యాంకులో ప్రమాద బీమా చేయించుకుంటే మంచిదని సూచించారు. మండల విలేకరులు వాస్తవాలను తెలుసుకొని వార్తలు రాయాలని సూచించారు. సోషల్ మీడియాలలో విలేకరులు చాటింగ్ చేయడం మంచిది కాదన్నారు. త్వరలో మండల ప్రెస్ క్లబ్ తరఫునుండి ఎమ్మెల్యే గారిని కలిసి సమస్యలను తెలియజేద్దామని నిర్ణయించారు. సమావేశంలో మండల ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## కాలం మారుతున్నా దళితులపై వివక్ష ధోరణి మారడం లేదు



**తాండూరు, మార్చి 22 (జనంసాక్షి) :** తాండూరు పట్టణంలో మంజూరైన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్ళించడం సరైనది కాదని స్వేరో జిల్లా నాయకులు శివ కుమార్, జైభీమ్ ఆర్గనైజేషన్ జిల్లా సెక్రెటరీ అంజి పేర్కొన్నారు. తాండూర్ పట్టణంలో నూతనంగా ప్రారంభమయ్యే పనులు వార్డ్ నెంబర్ 22 లో ఉన్న ఈద్గా దగ్గర పాఠశాల భవన్ నిర్మాణం అలాగే విలియం మూన్ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం మరియు పాత తాండూర్ లో బోనమ్మ గుడి దగ్గర ఉన్న బీసీ స్మశాన వాటిక అభివృద్ధి నిధులు ఈ మూడు పనులకు కేటాయించిన నిధులు మొత్తం ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల అని వెల్లడించారు. ఎస్సీ డెవలప్మెంట్ కే కాకుండా ఈ నిధులు దారి మళ్ళించడం సరైనది కాదని అన్నారు. ఎన్నో రోజులుగా తాండూరు పట్టణంలో ఉన్న ఎస్సీ వార్డులు ఏవి కూడా అభివృద్ధి చెందలేదు. ఇప్పుడు కూడా ఈ నిధులు దారి మలిస్తే మా వాడలు ఇంకెప్పుడు అభివృద్ధి చెందుతాయని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులు ముందుగా మా వాడలకు వచ్చి మా సమస్యలు అడిగి తెలుసుకుని ముందు మా సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎస్సీ కాలనీలో చాలా సమస్యలు ఉన్నాయని ముందు మా నిధులతో మా వాడల అభివృద్ధి చేసిన తర్వాత మీకు అంతగా కావాలంటే ఇంకా వేరే నిధులు ఏమైనా ఉంటే ఏదైనా అభివృద్ధి చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఈ విషయం పైన ప్రజాప్రతినిధులు పునరలోచించి నిధులు సరైన దారిలో వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరేష్ ,కేతేశ్వర్ ,మహేష్, సురేష్, రమేష్, బాలు, రాజు, సుధాకర్, సాయి, శ్రీనివాస్, నీరటి హనుమంతు, బాలకృష్ణ, రమేష్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి వద్ద ఉన్న విద్యాశాఖకు బడ్జెట్‌లో అన్యాయం

- విద్యాశాఖకు నిధులేవీ రేవంత్ రెడ్డి..?
- ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్

**బోడుప్పల్, మార్చి 22 (జనంసాక్షి) :** ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో ధర్నా చౌక్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని, సీఎం రేవంత్ వద్ద విద్యాశాఖ ఉన్న బడ్జెట్ లో ఎన్నికల హామీ ప్రకారం నిధులు కేటాయించకుండా రేవంత్ రెడ్డి ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ విద్యా వ్యవస్థని నిర్వీర్యం చేస్తున్నారని, 3,24,234లక్షల కోట్లతో మొత్తం బడ్జెట్ ప్రవేశపెట్టగా విద్యారంగానికి కేవలం 26,674 కోట్లు మాత్రమే కేటాయించారు. 8.22% నిధులు మాత్రమే. ఈ నిధులు విద్యారంగ అభివృద్ధికి ఏమేరకు సరిపోవు.గత బడ్జెట్ కంటే కేవలం 1.18% నిధులు 3566కోట్లు మాత్రమే పెంచారని, పెంచిన నిధులు విద్యారంగ అభివృద్ధికి సరిపోవని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో విద్యకు 15%నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.మూడవ బడ్జెట్ కేటాయింపులో కూడా ఇచ్చిన హామీ మేరకు అయిన నిధులు కేటాయించకుండా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని, బడ్జెట్ ప్రసంగం లో ప్రాథమిక, ఉన్నత విద్య బలోపేతం, ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి ఊసే లేదని, ఇచ్చిన మాట మేరకు ఉస్మానియా యూనివర్సిటీ కి1000కోట్లు




ఇచ్చారు. తప్ప బడ్జెట్ లో అన్ని యూనివర్సిటీలకు అరకొర నిధులు కేటాయించారని,ఖమ్మం మరియు ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ యూనివర్సిటీల ఏర్పాటు ప్రకటన లేదని, ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు ప్రతిష్టాత్మకంగా చేస్తున్నామని రాష్ట్ర వ్యాప్తంగా 105 నిర్మిస్తున్నామని ప్రకటించారు ,అదే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు కానీ ఒక్కో పాఠశాల నిర్మాణానికి ఎన్ని కోట్లు అవసరమో తెలుపలేదు, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవి,గురుకులాలు మోడల్ స్కూల్,మైనార్టీ స్కూళ్ళ ప్రభుత్వ పాఠశాలలు,జూనియర్ డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు ఊసే ఎత్తకుండా,సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు,అద్దె భవనాల్లో నిర్వహణలో ఉన్న వాటికి కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయింపు పై నిధుల చేయకపోవడం సరికాదని, బ్రేక్ ఫాస్ట్ స్కీం ఏర్పాటు,జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం మంచిదే అయిన హామీ అమలు ఆచరణ సాధ్యం కావాలని, పెండింగ్ లో ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలే 9300కోట్లు పెండింగ్ లో ఉన్నాయని మరి బడ్జెట్ లో స్కాలర్షిప్ లకు 4343 కోట్లు మాత్రమే కేటాయించారని మరి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల ఊసే లేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యార్థులకు ల్యాప్ టాప్ లు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు,విద్యార్థులకు 5 లక్షల విద్య భరోసా కార్డు, విద్యార్థులకు ఇంటింటికి ఉచిత ఇంటర్నెట్, విశ్వవిద్యాలయంలో ప్రతి రీసెర్చ్ స్కాలర్ విద్యార్థికి 10వేల రూపాయల ఫెలోషిప్ ఇస్తామని చెప్పారని వాటి గురించి బడ్జెట్ లో ప్రస్తావన లేదని, మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుపై ప్రకటన దానికి నిధుల కేటాయింపు పై బడ్జెట్ లో మాట కూడా లేదని, బిఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం అయిందని నిధుల కేటాయింపు లేదని కాంగ్రెస్ ప్రజా పాలనలో విద్యాశాఖ రేవంత్ రెడ్డి వద్ద ఉంది కాబట్టి నిధులు అధికంగా విద్య శాఖకు వస్తాయని ఆశిస్తే కాంగ్రెస్ కూడా విద్యను నిర్వీర్యం చేసే విధంగా నిధుల కేటాయింపు చేసిందని వెంటనే బడ్జెట్ లో విద్యారంగానికి కేటాయించిన నిధులను సవరించి విద్యారంగానికి అధిక శాతం నిధులు కేటాయించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు హరీష్ , అరవింద్, ఆకాష్, సాయి కిషోర్, సురేష్ వంశీ,నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
సోమవారం
23 మార్చి 2026

# ఏప్రిల్ నెలను మహనీయుల మాసంగా పాటించాలి

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు



**సంగారెడ్డి టౌన్, మార్చి 22 (జనం సాక్షి) :** 78 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రజల మధ్య కులమత వైశమ్యాలు కొనసాగడం విచారకరమని, సాటి మనుషులంతా నాతో సమానమనే సమానత్వ భావనను పెంపొదించడానికి ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా పాటిస్తూ కులరహిత సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం సంగారెడ్డి సుందరయ్య భవన్ లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో కులరహిత సాంస్కృతిక ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పి అశోక్ అధ్యక్షత వహించారు ముఖ్యఅతిథిగా హాజరైన కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ ఏప్రిల్ 11 జ్యోతిబాపూలే జయంతి ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతులను పురస్కరించుకొని ఏప్రిల్ నెల మొత్తాన్ని మహనీయుల మాసంగా పాటించాలని, రాష్ట్రంలో కొనసాగుతున్న కుల వివక్ష అంటరానితనాన్ని రూపుమాపాలని కులరహిత సాంస్కృతిక ఉత్సవాల ద్వారా ప్రజలలో చైతన్యాన్ని తీసుకురావాలని అయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో 200 గ్రామాలలో వీడీసీల పేరిట అట్టడుగు తరగతులపై దౌర్జన్యాల కొనసాగుతున్నాయని తక్షణమే ప్రభుత్వం విడిసి లను నిషేదించాలని డిమాండ్ చేశారు. గత పదేండ్ల కాలంలో 143 కుల దురహంకార హత్యలు జరిగాయని దళితులు పేదలపైన రోజురోజుకి దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని చెప్పారు కులరహిత సాంస్కృతిక ఉత్సవాలలో జానపద కళాకారులు డప్పు కళాకారులు వివిధ సాంస్కృతిక రూపాలు హాజరుకావాలని కోరారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ గణాంకాల ప్రకారమే దేశవ్యాప్తంగా నెలకు 10000చొప్పున దళితులపై దౌర్జన్యాలు జరుగుతున్నాయని చెప్పారు ఈ దౌర్జన్యాలను అరికట్టడంలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు పైగా వాటిని ప్రోత్సహించే విధంగా బిజెపి విధానాలు ఉన్నాయని చెప్పారు. కేంద్ర బిజెపి సర్కార్ వైఫల్యం వల్ల సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు గ్యాస్ కొరత ఏర్పడిందని తద్వారా విద్యార్థులకు భోజనం వడ్డనా ఇబ్బందిగా మారిందన్నారు ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకాలు కూడా మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నాయని చెప్పారు గ్యాస్ కొరతకు నరేంద్ర మోడీ ప్రభుత్వం అమెరికాతో అంటకాగుతున్న లొంగుబాటు వైఖరి కారణమని చెప్పారు కులరహిత సాంస్కృతిక ఉద్యమాలలో కుల వివక్ష అంటరానితనాన్ని వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కవులు కళాకారులు మేధావులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సారధి కళాకారులు ఏప్రిల్ మొత్తం కుల వివక్ష అంటరానితనంపై ప్రజల్లో చైతన్యం చేయడానికి ప్రభుత్వమే విస్తృత ప్రచార కార్యక్రమం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు గరికపాటి నరసింహారావు అనే ప్రవచనకర్త పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోడిగుడ్డు పెట్టడంపై అహంకారపూరిత అవమానకరమైన వ్యాఖ్యానాలు చేశారని తక్షణమే తన వ్యాఖ్యాలను ఉపసంహరించి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ప్రభుత్వ పథకాన్ని కించపరుస్తూ మాట్లాడిన ఆయనకు పద్మశ్రీ అవార్డును రద్దు చేయాలని డిమాండ్ చేశారు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు మార్చి 20న మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ లో దళితులను భారీ ద్రోహానికి గురి చేసిందని, గత బడ్జెట్లో 40,000 కోట్ల రూపాయల కేటాయిస్తే ఈ బడ్జెట్లో కేవలం 11784 కోట్లు మాత్రమే కేటాయించి 70% నిధులు భారీ కోత విధించి దళితులకు తీరని ద్రోహం చేశారని విమర్శించారు గత బడ్జెట్లో కేటాయించిన వాటిలో 3200 కోట్ల రూపాయలు దారి మళ్లించారని విమర్శించారు. ప్రభుత్వ కేటాయింపులు విడుదల ఖర్చులకు మధ్యల ఎక్కడ పొంతన ఉండటం లేదని అన్నారు సీఎం ఆపేక్స్ బాడీ సమావేశం నిర్వహించి మొత్తం బడ్జెట్ కేటాయింపులు విడుదల ఖర్చు పైన శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్, టిజిఓ అధ్యక్షులు వైద్యనాథ్,సామాజిక ఉద్యమ సీనియర్ నాయకులు నాగయ్య, మల్లయ్య, విజయరావు,బక్కయ్య, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సాయిలు, వృత్తి సంఘాల జిల్లా నాయకులు రమేష్ గౌడ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సతీష్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు బాలరాజు, సామాజిక ఉద్యమ నాయకులు నాగరాజు, కుమార్,కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం.శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు న్యాయవాది సుభాష్,జిల్లా సహాయ కార్యదర్శి గణపతి, ప్రవీణ్,జిల్లా నాయకులు దత్తు,మహేష్ కుమార్, రాజేష్, గంగారాం, నరేష్,పౌలు, వెంకట్,లక్ష్మణ్, అర్జున్, యాద గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి దయతో అంత సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



**శివ్వంపేట, మార్చి 22 (జనంసాక్షి) :** ఎల్లమ్మ తల్లి దయతో ఈ ప్రాంతం పాడి పంటలతో సస్యశ్యామలంగా ఉండాలని అమ్మవారిని కోరుకోవడం జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శివంపేట మండలం లింగోజిగూడ గ్రామంలో గత రెండు రోజులుగా జరుగుతున్న రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు ఆదివారం జరిగిన అమ్మవారి కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే, పార్టీ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు పనివారు, ఒగ్గు వారు ఆలయ నిర్వాహకులతో కలిసి రేణుక ఎల్లమ్మ కు గంపాల ఎదుర్కొల్లు చేపట్టి, కొట్నం పెట్టారు, ఆలయం ముందు పటం వేసి, అమ్మవారి కళ్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామస్తులందరూ, మహిళలు అమ్మవారికి బోనాల ఊరేగింపు కార్యక్రమం చేపట్టి, బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, నాయకులు తాటికొండ రాజశేఖర్ గౌడ్, సత్యం, లాయక్, నాగేశ్వర్ రావు, కన్నారం దుర్గేష్, యాదగౌడ్, సర్పంచ్ అమృత అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ గన్యా, మాజీ సర్పంచ్ మెగావత్ రవి, అరవింద్ గౌడ్, నాగ్యారి యాదగిరి, కిష్టా గౌడ్, వెంకటేష్ గౌడ్, కొమ్రే గారి రాజు, ఒగ్గువారు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 27 మందికి 7 లక్షల 63 వేల చెక్కుల పంపిణీ



**శివ్వంపేట, మార్చి 22 (జనంసాక్షి) :** సీఎంఆర్ఎఫ్ చెక్కులు బాధిత కుటుంబాలకు ఒక వరంలా మారాయని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శివ్వంపేట మండలంలోని వివిధ గ్రామాల చెందిన 27 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు, అలాగే ఎల్ఓసిలు కలిపి మొత్తం 7 లక్షల 63 వేల రూపాయల చెక్కులను ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దావఖానాల వెంట తిరిగి అన్నీ విధాల నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులతో బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఆపదలో ఉండే బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అపన్న హస్తంల మారిందని, బాధితులకు అత్యవసర సమయంలో ఎల్వోసీలు సైతం అండగా నిలుస్తాయని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, నాయకులు తాటికొండ రాజశేఖర్ గౌడ్, సత్యం, లాయక్, నాగేశ్వర్ రావు, కన్నారం దుర్గేష్, సర్పంచ్ అమృత అశోక్ గౌడ్, మాజీ సర్పంచ్ మెగావత్ రవి, అరవింద్ గౌడ్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఖలీల్‌పూర్‌లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



**న్యాల్‌కల్, మార్చి 2 (జనం సాక్షి) :** మండలంలోని ఖలీల్ పూర్ గ్రామంలో నెలకొన్న త్రాగునీటి ఎద్దడిని తీర్చేందుకు స్థానిక సర్పంచ్, పంచాయతీ రాజ్ అధికారులు, వార్డు సభ్యులు దృష్టి సారించారు. గత ఐదారు నెలలుగా గ్రామంలోని బీసీ, తదితర కాలనీ వాసులు త్రాగునీటి ఎద్దడిని ఎదుర్కొన్నారు. తాజాగా ఆదివారం స్థానిక సర్పంచ్ వెంకటేశం, గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్, వార్డు సభ్యుల చొరవతో వృధాగా ఉన్న ఓ మోటార్ బావిలో ప్రత్యేకంగా నూతన బోరు మోటార్ ను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ నిధులను వెచ్చించి సమస్యను పరిష్కరించారు. ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టడం పట్ల పలువురు కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, రాజేంద్ర సాగర్, యోహాన్, మోహన్ రెడ్డి, సంగన్న, మారుతి, రవి, మల్లేష్, విజయ్ కుమార్, రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీపీని జనవాసాలకు దూరంగా నిర్మించాలి



**అమీన్‌పూర్, మార్చి 22 (జనం సాక్షి) :** అమీన్పూర్‌లో ఏర్పాటు చేయనున్న ఎస్టిపిని జనవాసాలకు దూరంగా నిర్మించాలని అమీన్పూర్ పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల తిరుమలరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికులతో కలిసి పటాన్చెరు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. జనవాసాల మధ్యలో ఎస్టిపి నిర్మిస్తే స్థానికంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే జనవాసాల మధ్య నిర్మించే ఆలోచన మానుకొని జనవాసాలకు దూరంగా నిర్మించాలని కోరారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేను కలిసిన వారిలో రమేష్, అరుణ్ విష్ణు, రవి, జయరాం, వెంకట్రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- పోతారంలో జల మహోత్సవం



**తూప్రాన్, మార్చి 22 (జనం సాక్షి) :** నీరును వృధా చేయవద్దని పొదుపుగా వాడుకోవాలని నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఈ ప్రవీణ్ కుమార్ తెలిపారు మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో జలమోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు భవిష్యత్తులో తాగునీటికి ఇబ్బంది కలగకుండా ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జల మహోత్సవ కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు గతంలో తాగునీటికి ఎన్ని ఇబ్బందులు పడ్డాము అందరికీ తెలుదని దానిని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో తాగునీటి ఇబ్బంది లేకుండా ఉద్దేశంతో ఇప్పటినుండి నీటిని పొదుపుగా వాడుకోవాలని అన్నారు. పోతారం గ్రామంలో 32 8 ఇండ్లకు ప్రతి రోజూ త్రాగునీరు సరఫరా చేస్తున్నామని అన్నారు. ఏ ఈ దివ్య మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న త్రాగునీటి వ్యవస్థను గ్రామానికి అప్పజెప్తున్నామని ఎవరైనా బాధ్యత అంతా వార్దేవని ఇకనుంచి పూర్తి బాధ్యత వారిదేనని అన్నారు నీరు వృధా కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వాటర్ కమిటీ దేనిని అన్నారు కమిటీ లు ప్రతిరోజు సమీక్ష చేసిన పర్యవేక్షిస్తుండాలని అన్నారు. ప్రపంచ జల దినోత్సవం పురస్కరించుకొని మనోహరాబాద్ మండలం పోతారం గ్రామంలో జల మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పుట్ట వినోద మహేందర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమం లో మిషన్ భగీరథ ఈఈ కిరణ్, డిఈ శ్రీనివాస్, ఏఈ దివ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి నీటి విలువ, భగీరథ నీటి పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో మిషన్ భగీరథ కొళాయి ని ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మిషన్ భగీరథ నీటి ఉపయోగం దాని లాభాలు ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ మిషన్ భగీరథ నీరు తాగాలని సూచించారు. జల్ జీవన్ మిషన్ పథకంలో పోతారం ను చేర్చినట్లు ఏఈ తెలిపారు. అదే విదంగా మిషన్ భగీరథ నిర్వహణ బాధ్యతను సర్పంచ్ చైర్మన్ గా గ్రామ నీటి కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఇకనుండి మిషన్ భగీరథ యొక్క నిర్వహణ బాధ్యత నీటి కమిటీ పరిధిలో ఉంటాయని అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రజలతో నీటి అవశ్యకత పై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ ఇమ్మడి దుర్గమ్మ, పాలకవర్గం సభ్యులు, కార్యదర్శి రజిత,మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నరేందర్, హరిగోపాల్, కుమార్ గ్రామస్తులు, విద్యార్థులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కంకరకే పరిమితమైన బుర్వానికుంట తండా రోడ్డు

- రోడ్డును కాంట్రాక్టర్ వెంటనే పూర్తి చేయాలి
- బీజేపీ గిరిజన మోర్చా నాయకులు కిరణ్ నాయక్



**ఉర్కొండ, మార్చి 22 (జనం సాక్షి) :** కంకరకే పరిమితమైన బుర్వనీగుంట రోడ్డును వెంటనే పూర్తి చేయాలని బిజెపి గిరిజన మోర్చా నాయకులు కిరణ్ నాయక్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు లింకు రోడ్లుగా ఉన్న మట్టి రోడ్లను బీటీలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. కానీ ఆ పని పూర్తికి కావాల్సిన నిధులను మాత్రం సకాలంలో ఇవ్వడం లేదు. దీంతో బీటీ రోడ్డు ని ర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు పనుల ను మధ్యలోనే వదిలేసి చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా బీటీ కోసం కంకర పరిచిన రోడ్డు పై ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ప డుతున్నారు. సంబంధిత అధికారులను సం ప్రదించినా మా చేతుల్లో ఏమీ లేదన్న సమాధానమే వస్తుంది. చివరకు సర్కారు దయ....కాంట్రాక్టర్ పుణ్యం అన్న చం దంగా మారింది. మండలంలోని ఠాగూర్ తండా నుంచి బుర్వనికుంట ప్రారంభమైన ఈ పనులు 8 నెలలు గడుస్తు న్నా నేటికీ పూర్తికాలేదు. సుమారు కిలోమీ టర్ల మేర రోడ్డుపై కంకరను పోసి వదిలేశా రు. దీంతో కంకర పోసిన రోడ్డుపై ప్రయాణిస్తూ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మన దేశానికి స్వాత్రంత్రం వచ్చి 75 సంవత్సరాలు దాటిపోతున్న గిరిజన తండలకు సరైనా రోడ్డు సౌకర్యాలు లేక తండా వాసులు అనేకా ఇబ్బందిలకు గురవుతున్నారు. బొమ్మరాసిపల్లి గ్రామ పంచాయితీ కి సంబందించినా రోడ్డును పట్టించుకోవాలని కాబట్టి ప్రభుత్వ అధికారులు, గ్రామ సర్పంచ్ తక్షణమే తండ ప్రజాల సమస్యను తీర్చలాని బిజెపి గిరిజన మోర్చా మండల అద్యక్షుడు కరాటే కిరణ్ నాయక్, ఎం జె ఆర్ లంబాడి యువసేన సభ్యులు తిరుపతి నాయక్, కరాటే వినోద్ నాయక్, మురళీ నాయక్, తరుణ్ నాయక్, రాజేష్ నాయక్, చరణ్ నాయక్, రంజీత్ నాయక్ తండ ప్రజలు కోరుతున్నారు.

## స్వంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులు

**ఎర్రవల్లి, మార్చి 22 (జనం సాక్షి) :** ఎర్రవల్లి మండల కేంద్రంనుండి తిమ్మాపూర్ వెళ్ళే మట్టిరోడ్డు గుంతలమయంగా మారింది. నిత్యం తిమ్మాపూర్ నుండి మండల కేంద్రానికి వందలసంఖ్యలో జనం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డంతా మోకాలు లోతు గుంతలు ఉండడంతో చాలామంది ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. ప్రజల సమస్యను గుర్తించిన తిమ్మాపూర్ సర్పంచ్ కల్పన శంకర్ నాయుడు నష్ట నివారణ చర్యలు చేపట్టారు. ఎర్రవల్లి నుండి తిమ్మాపూర్ వరకు దాదాపు మూడు కిలో మీటర్లకు పైగా ఉన్న మట్టిరోడ్డుకు తన స్వంత ఖర్చులతో మరమ్మత్తులు చేపట్టారు. సర్పంచ్ దాతృత్వాన్ని పలువురు కొనియాడుతున్నారు.



# ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం

**గద్వాల టౌన్, మార్చి 22 (జనంసాక్షి) :** ఆదివారం గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పై బాసు హనుమంతు నాయుడు మీడియా సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్ అంకెల గారడీ తప్పా ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని విమర్శించారు.దళితులు,బీసీలు,ఎస్సీ,ఎస్టీలు,మైనారిటీలకు ఈ బడ్జెట్ న్యాయం చేయలేదు అని అన్నారు.బడుగు బలహీన వర్గాల హక్కులను కాల రాసిన బడ్జెట్ ఇది ఒకవైపు 42% రాజకీయ రిజర్వేషన్ల విషయంలో మోసం చేశారు.మరోవైపు బడ్జెట్ కేటాయింపుల్లో కూడా బీసీలను తీవ్రంగా మోసం చేశారని మండిపడ్డారు.బిసీలను ద్రోహం చేసి ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తున్నారు అని,తక్షణమే బీసీలకు 50 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ అంతా పచ్చి అబద్దాల పుట్ట అన్నారు.ఉమ్మడి పాలమూరుతో పాటు గద్వాల నియోజకవర్గానికి బడ్జెట్ తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు.3.24లక్షల కోట్ల భారీ బడ్జెట్ అని గొప్పలు చెప్పుకుంటున్నారే తప్పా క్షేత్రస్థాయిలో రైతులు, పేదలకు పైసా ప్రయోజనం లేదని,బడ్జెట్ మొత్తం ముఖ్యమంత్రి ప్రయోజనాల కోసమే అన్నారు.జోగులాంబ గద్వాల జిల్లాకు ఉపయోగపడే నెట్టెంపాడు, బీమా, జూరాల ప్రాజెక్టు పెండింగ్ పనులకు,కాల్వల ఆధునీకరణకు బడ్జెట్లో పైసా కేటాయించలేదన్నారు.పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రిగా ఉన్నా జిల్లా ప్రాజెక్టులపై వివక్ష చూపించారని ఆరోపించారు.కొత్త ఆయకట్టుకు నీరు అందించే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదన్నారు.ఎకరాకు 15వేల రూపాయలు రైతు భరోసా ఇస్తామని ఓట్లు వేయించుకొని ఇప్పుడు బడ్జెట్లో కేవలం 18వేలకోట్ల రూపాయలు కేటాయించడం రైతులను దగా చేయడమే అన్నారు.ఈ నిధులు రాష్ట్రంలోని రైతులందరికీ పెట్టుబడి సహాయం అందించడానికి ఏ మూలకు సరిపోవని అన్నారు.ఈ బడ్జెట్ రైతాంగాన్ని నట్టేట ముంచిందన్నారు.తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రెండో విడుత నిధుల గురించి బడ్జెట్లో ప్రస్తావన



లేకపోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విశ్వసనీయత, విజన్ లేదన్నారు.బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలబెడితే,కాంగ్రెస్ పాలనలో తెలంగాణను తిరోగమనంలోకి నెట్టేశారు అని మండిపడ్డారు.ప్రభుత్వం కేవలం కాగితపు లెక్కలతో కాలక్షేపం చేస్తుందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బిఎస్ కేశవ్,జి.రాఘవేంద్ర రెడ్డి,సూర్య గౌడ్,కౌన్సిలర్లు, చంటన్న, టిఎన్ఆర్ జగదీష్,పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధి కనబర్చాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధి కనబర్చాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఒక డోల్లా బడ్జెట్ అని అన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంలో ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసి, రైతాంగానికి అపూర్వమైన పథకంగా రైతుబంధును ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు భిన్నమైన పాలన అందిస్తామని చెప్పి, ఆరు గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చిందన్నారు. ఏ ప్రభుత్వానికైనా ఐదేళ్ల కాలంలో ఐదు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంటుందని, ఈ ప్రభుత్వం ఇప్పటికే మూడు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిందని, దాదాపు 60శాతం పదవీకాలం పూర్తయిందని తెలిపారు. అధికారంలోకి వచ్చే ముందు 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, వాటికి చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి, ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నీటి సమస్య పరిష్కరించాలి..

భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేషాలపల్లి లో గల డబుల్ బెడ్ రూం ఇళ్ళల్లో నెలకొన్న మంచినీటి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి కోరారు. ఆదివారం డబుల్ బెడ్ రూం ఇళ్లను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పనులు సకాలంలో జరుగక పోవడం వల్ల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే సమస్య పరిష్కారం చేయాలని కోరారు.

# అ'ధనం'గా వసూళ్లు!

- ఒక్కో సిలిండర్ పై రూ.30 నుండి రూ.50 వరకు వసూళ్లు
- నియమాలకు విరుద్ధంగా అక్రమ వసూళ్లకు తెరలేపిన గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు...
- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న సివిల్ సప్లై అధికారులు....



**మంగపేట, మార్చి 22(జనంసాక్షి) :** మంగపేట మండల కేంద్రంలోని ఓ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గత కొన్ని సంవత్సరాలుగా తమ ఇష్టానుసారంగా సిలిండర్ బిల్లు ల ధరల కంటే ఎక్కువ మొత్తంలో ప్రజల వద్ద నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారంటూ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గత కొద్ది రోజులుగా గ్యాస్ నిలువలు లేకపోవడంతో చేసేది ఏమీ లేక ఏజెన్సీ నిర్వాహకులు అడిగినంత ప్రజలు మూట చెపుతున్నారు. కొందరు ప్రజలు ప్రశ్నిస్తే వారిని సైతం టార్గెట్గా చేసుకొని సరైన సమయాల్లో సిలిండర్లను అందజేయకుండా కాలయాపన చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. సిలిండర్లపై అధికంగా ఎందుకు వసూలు చేస్తున్నారని వినియోగదారులు నేరుగా డెలివర్ బాయ్స్ ను ప్రశ్నించగా యాజమాన్యం సూచనల మేరకే తీసుకుంటున్నామని వారు తెలపడం గమనార్హం. అయితే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రోజుకు సుమారు 300 నుండి 350 సిలిండర్లను పంపిణీ చేస్తున్నారని ఇలా గ్యాస్ సిలిండర్ పై రూ. 30 నుండి రూ.50 రూపాయల వరకు అదనంగా వసూలు చేయడంతో నెలకు సుమారుగా మూడు లక్షల రూపాయల నుండి మూడున్నర లక్షల రూపాయల వరకు అడ్డదారిలో అక్రమంగా ప్రజల సొమ్మును కాజేస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. వాస్తవానికి భారతదేశంలోని నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీ లు డెలివరీ చార్జీలు వసూలు చేయడానికి సంబంధించిన స్పష్టమైన నియమాలు ఉన్నాయి. సాధారణంగా మనకు వచ్చే గ్యాస్ సిలిండర్ ధరలోనే డిలవరి చార్జీలు కలిసి ఉంటాయి. గ్యాస్ ఏజెన్సీ నుండి 15 కిలోమీటర్ల లోపు నివసించే వినియోగదారులకు ఎటువంటి అదనపు డెలివరీ చార్జీలు తీసుకోకూడదని నియమాలలో ఉంది. కానీ అందుకు విరుద్ధంగా ప్రజల నుండి సర్వీస్ ఛార్జ్ పేరుతో ఏజెన్సీ నిర్వాహకులు అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఈ విషయంలో సంబంధిత సివిల్ సప్లై అధికారులు దృష్టి సారించికపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అంతే కాకుండా గ్యాస్ ఏజెన్సీ లో డెలివరీ బాయ్స్ గా పనిచేస్తున్నటువంటి వ్యక్తులు నేరుగా రెండు వాహనాలను కొనుగోలు చేసి ఏజెన్సీ పేరు తో రిజిస్టర్ చేసుకొని నెల నెల వాహనాల వాయిదాల (ఈఎంఐ) డబ్బులను ప్రజల నుండి సిలిండర్లపై అధికంగా వసూలు చేసిన సొమ్ముతో చెల్లించడం జరుగుతుందని తెలపడం విడ్డూరంగా ఉంది. ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టానుసారంగా ప్రజలను దోచుకుంటూ తమ పబ్బాలు గడుపుకోవడం ఏంటి అని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లై అధికారులు తక్షణమే తనిఖీలు నిర్వహించి నిజ నిజాలను పరిశీలించి తక్షణమే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు లేనిపక్షంలో ఉన్నత స్థాయి అధికారులకు అక్రమ వసూళ్ల వ్యవహారాలు సాక్షాధారాలతో నిరూపిస్తామని బాధితులు తెలిపారు.

## జనగణన విజయవంతానికి శిక్షణ ఎంతో కీలకం

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



**వరంగల్ బ్యూరో, మార్చి 22 (జనం సాక్షి) :** జనగణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి సరైన శిక్షణ ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఆదివారం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరం (కంప్యూటర్ ల్యాబ్)లో ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జనగణన--2027 నిర్వహణపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛార్జ్ సెన్సస్ క్లర్కులు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, జనగణన ప్రక్రియపై పూర్తి అవగాహనతో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. జనగణన ద్వారా ప్రభుత్వానికి అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు అందుతాయని, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి సరైన వివరాలను సేకరించడం సిబ్బందిపై ఉన్న ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి విధివిధానాలపై సమగ్రంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. విధుల్లో నిబద్ధతతో పనిచేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సెన్సస్ అధికారి (డీఆర్ఓ) విజయలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి చంద్రకళ, వరంగల్ ఆర్డీఓ సుమ, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సంబంధిత అధికారులు (ఎంపీఎస-ఓలు), టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## భద్రకాళి బండ్, కాకతీయ మ్యూజికల్ గార్డెన్ అభివృద్ధి పనుల పరిశీలన

- అధికారులతో కలిసి పరిశీలించిన కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి
- భద్రకాళి బండ్, మ్యూజికల్ గార్డెన్ పనుల్లో వేగం పెంచాలి : ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**హనుమకొండ ప్రతినిధి మార్చి 22 (జనం సాక్షి) :** వరంగల్ నగరాన్ని పర్యాటక రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సోమవారం సిపీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు మరియు సంబందిత అధికారులతో కలిసి సందర్శించారు. ఇందులో భాగంగా హనుమకొండ నగరం హంటర్ రోడ్ లోని చారిత్రక వరంగల్ నగరానికి తలమానికంగా నిలుస్తున్న భద్రకాళి బండ్ కాకతీయ మ్యూజికల్ గార్డెన్ లలో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యార్థం భద్రకాళి బండ్ హంటర్ రోడ్ వైపు చేపడుతున్న రెండో దశ అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రకాళి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాడ వీధుల పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రకాళి చెరువులో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, మధ్యలో 9 నవగ్రహ దీవులను సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. పర్యాటకులను ఆకర్షించేందుకు తెలంగాణ లోనే తొలిసారిగా భద్రకాళి సరస్సుపై సుమారు రూ. 60 కోట్ల అంచనా వ్యయంతో కేబుల్ కార్ మరియు గ్లాస్ బ్రిడ్జ్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని, దీనివల్ల వరంగల్ పర్యాటక రంగం అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. వాకింగ్ ట్రాక్, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటుతో పాటు పర్యాటకుల కోసం ఫుడ్ స్టాల్స్ మరియు బోటింగ్ సౌకర్యాలను మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. భద్రకాళి సరస్సు చుట్టూ జరుగుతున్న మాడ వీధుల నిర్మాణం, ఘాట్ల అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి ఆలయ ఆధ్యాత్మికత దెబ్బతినకుండా పనులు జరగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### కాకతీయ మ్యూజికల్ గార్డెన్

దశాబ్దాలుగా నిరాదరణకు గురైన కాకతీయ మ్యూజికల్ గార్డెన్ కు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సుమారు రూ. 3.5 కోట్ల వ్యయంతో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా కొత్తగా మ్యూజికల్ ఫౌంటెన్ ఏర్పాటు, ఆకర్షణీయమైన బటర్ ఫ్లై పార్క్ నిర్మాణం, పిల్లల కోసం అత్యాధునిక ఆట పరికరాలతో కూడిన చిల్డ్రన్ ప్లే ఏరియా, ల్యాండ్ స్కేపింగ్, విద్యుత్ దీపాల ఏర్పాటు, గార్డెన్ లోపల కొత్తగా లోటస్ పాండ్ తామర కొలను మరియు ఔషధ మొక్కల పెంపకం పనులను పరిశీలించారు.



## మంత్రి సీతక్కను కలిసిన బెటాలియన్ అధికారులు

**గోవిందరావుపేట (జనంసాక్షి) :** చల్వాయి 5వ బెటాలియన్ అధికారి బి సీతారామ్ అదనపు కమాండెంట్ మంత్రి సీతక్కను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బెటాలియన్‌కు సంబంధించిన వివిధ పరిపాలనా అంశాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు సిబ్బంది సంక్షేమంపై చర్చించారు. ప్రత్యేకంగా, 5వ బెటాలియన్‌కు సంబంధించిన పెండింగ్ బిల్లుల విషయాన్ని మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ బిల్లులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి గారు సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం బెటాలియన్ ఆర్ఐలు స్వామి, సాయిబాబు, ఏఆర్ ఎస్ఐ రత్నాకర్, నారాయణ కలిశారు.

## సామాజిక బాధ్యతను తెలిపేలా లఘు చిత్రాలు

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**పాలకుర్తి, మార్చి 22 (జనంసాక్షి)** సామాజిక బాధ్యతను తెలిపేలా లఘు చిత్రాలు రావడం ఆహ్వానించదగిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పేర్కొన్నారు. మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన పూజరి రాజు దర్శకత్వంలో చిత్రీకరిస్తున్న "ఒక ఫోటో ప్రేమ కథ" షార్ట్ ఫిల్మ్ పోస్టర్ లాంచింగ్ కార్యక్రమం ఆదివారం హన్మకొండలోని నిర్వహించారు. మాజీ మంత్రి దయాకర్ రావు పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ లఘు చిత్రంలో మండలానికి చెందిన నటులు మాచెర్ల సాంబరాజు, దుస్స హరీశ్, లంక శివ. హరిక. తేజస్వినిలు నటించారని దర్శకుడు రాజు తెలిపారు. ఈ లఘు చిత్రం త్వరలో విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

## రాజురాలో రూ. కోటి 60 లక్షలతో చెక్ డ్యాం నిర్మాణానికి భూమిపూజ

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



**కుభీర్, మార్చి 22 (జనంసాక్షి) :** ముధోల్ నియోజకవర్గంలో సాగునీటి రంగానికి పెద్దపీట వేస్తామని, రైతాంగ సంక్షేమమే తన ధ్యేయమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్పష్టం చేశారు. ఆదివారం కుభీర్ మండలంలోని రాజురా గ్రామంలో రూ. ఒక కోటి 60 లక్షల వ్యయంతో నిర్మించనున్న చెక్ డ్యాం పనులకు ఆయన భూమిపూజ చేసి, పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ చెక్ డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చెక్ డ్యాం టెండర్లను నిలిపివేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రాంత రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, టెండర్లను రద్దు చేయకుండా ఆమోదించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పదేపదే విన్నవించినట్లు తెలిపారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, ఈ పనులకు తుది అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. రైతులకు ఈ చెక్ డ్యాం నిర్మాణం పూర్తయితే సుమారు 200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని, అలాగే భూగర్భ జలమట్టం పెరిగి పరిసర ప్రాంతాల్లోని బావులు, బోర్లు సమృద్ధిగా నీటిని కలిగి ఉంటాయని వివరించారు. పనుల విషయంలో రాజీ పడకూడదని కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. పనులు నాణ్యతగా లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాగునీటి రంగాన్ని మెరుగుపరచడమే తన ప్రధాన లక్ష్యమని, పనులను వేగవంతం చేసి రైతులకు త్వరగా నీరు అందించాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో బైంసా ఏఎంసీ చైర్మన్ ఆనందరావు పటేల్, ఆత్మ చైర్మన్ వివేకానంద, కుబీర్ ఏఎంసీ చైర్మన్ గోనే కళ్యాణ్, సర్పంచులు సాయినాథ్, మారుతి, క్రాంతి, నాయకులు నాగేష్, మోహన్, దత్తాత్రి, బషీర్, రవి కుమార్, మండల నాయకులు , రైతులు పాల్గొన్నారు.

## నిర్మల్ జిల్లాలో కట్టుదిట్టమైన వాహన తనిఖీలు

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు



**నిర్మల్ బ్యూరో, మార్చి 22 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలను కాపాడే లక్ష్యంతో ఆదివారం నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, ఇది చట్టపరంగా శిక్షార్హమైన నేరమని ఆమె హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జరిమానాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేసే అవకాశం కూడా ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ లేకుండా కార్లు డ్రైవ్ చేయడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, అతివేగం, ట్రిపుల్ రైడింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ సురక్షితంగా ప్రయా ణిం చాలని, తమ కుటుంబాల భద్రత కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 22, (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల ఆశ్రమ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి తరగతి గదులు, వంటశాల, భోజనశాల, నిత్యావసర సరుకుల నిల్వలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, హాజరు పట్టికలు, వసతి గదులు, పరిసరాల పరిశుభ్రత పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేయడం జరుగుతుందని, శుద్ధమైన త్రాగునీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు.

## కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐఎన్టీయుసీ కృషి

- పేరుకే ఏఐటీయూసీ గుర్తింపు సంఘం
- సమస్యలను గాలికొదిలేసి పబ్బం గడుపుతుంది
- ఐఎన్టీయుసీ నేతలు రాజేందర్, బుచ్చయ్య



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐఎన్టీయుసీ నిరంతరం కృషి చేస్తుందని ఐఎన్టీయుసీ రాష్ట్ర కార్యదర్శి పసునూటి రాజేందర్, ఐఎన్టీయుసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జోగ బుచ్చయ్యలు తెలిపారు. భూపాలపల్లి ఐఎన్టీయుసీ ఆఫీస్ ఆవరణలో భూపాలపల్లి ఏరియా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ బేతెల్లి మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి పసునూటి రాజేందర్ హాజరై మాట్లాడుతూ భూపాలపల్లి ఏరియాలో మెడికల్ బోర్డు నిలిపివేతపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాము నిలిపివేయలేదని స్పష్టత ఇచ్చినప్పటికీ, సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి పునరుద్ధరణ చేయించలేని స్థితిలో గుర్తింపు సంఘం ఉండిపోయిందని ఎద్దేవా చేశారు. సింగరేణి కార్మికుల సమస్యల పట్ల గుర్తింపు సంఘం అయిన ఏఐటీయూసీ ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. పేరుకే గుర్తింపు సంఘం కాని, కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. సింగరేణి కార్మికుల హక్కులు కాపాడంలో గాని, సంక్షేమానికి కృషి చేయడంలో గాని ఐఎన్టీయుసీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. కార్మికుల పక్షాన పోరాడే సామర్థ్యం కేవలం ఐఎన్టీయుసీకి మాత్రమే ఉందని తెలియజేశారు.

సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం పర్క్స్‌పై ఆదాయపన్ను మాఫీ, కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు, మెడికల్ బోర్డు పునరుద్ధరణ వంటి కీలక అంశాలను ఐఎన్టీయుసీ నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తోందని చెప్పారు. ఐఎన్టీయుసీ జాతీయ అధ్యక్షుడు డా. జి.సంజీవరెడ్డి, ఐఎన్టీయుసీ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ ల నాయకత్వంలో ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర మంత్రుల సహకారంతో బి.జనక్ ప్రసాద్ నాయకత్వంలో కార్మికుల సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, దీన్ని గుర్తింపు సంఘం నేతలు తాము సాధించామని చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. 2024-25 సంవత్సరానికి సింగరేణి లాభాల వాటా కార్మికులకు మెరుగైన వాటా ఇప్పించింది ఐఎన్టీయుసీ కాదా, కార్మికుడు గనిలో కానీ రోడ్డు పై గానీ మరణిస్తే ఆ కుటుంబానికి రూ.1కోటి 25 లక్షల రూపాయలు ప్రమాద బీమా ఇప్పించింది, సివిల్ ప్రిలిమ్స్ క్లియర్ చేసిన విద్యార్థులకు రాజీవ్ గాంధీ అభయ హస్తం కింద రూ.1 లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తుంది, సింగరేణి ప్రాంత గ్రామ నిరుద్యోగుల కొరకు స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తుంది ఐఎన్టీయుసీ కాదా అని గుర్తు చేశారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ హోదాలో మెడికల్ బోర్డులో అండర్ గ్రౌండ్లో మెడికల్ అన్ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్, ట్రేడ్ మెన్, ఈపి ఆపరేటర్లకు సర్ఫేస్లో సూటబుల్ జాబ్ ఇప్పిస్తాం అని చెప్పి యాజమాన్యంతో ఒప్పందం చేసుకొని ఇప్పటివరకు ఇప్పించ లేక పోయిందని, ఇది ఏఐటీయూసీ చేతకాని పనితీరుకు నిదర్శనమన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఏ హోదాతో సీఎండీతో జరిగే స్ట్రక్చర్ కమిటీలో కూర్చుంటున్నారని, ఇది రాజకీయ జోక్యం కాదా, మా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎవరైనా ఇలా మీటింగ్ లో కూర్చున్నారా.. అంటూ ప్రశ్నించారు. ఏఐటీయూసీ గుర్తింపు హోదాలో రెండు సంవత్సరాలు ఉండి, స్ట్రక్చర్ కమిటీ మీటింగ్ ను బై కాట్ చేసి యాజమాన్యాన్ని బ్లాక్ మెయిల్ చేసింది వాస్తవం కాదా, సింగరేణి సంస్థలో మహిళలకు కూడా ఏఐటీయూసీ చేసింది ఏమి లేదని ఆయన తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఈ సమావేశంలో ఐఎన్టీయుసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ రత్నం సమ్మిరెడ్డి, బ్రాంచ్ నాయకులు కుదుదుల శంకర్, సింగరేణి బీసీ అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి నవీన్ కుమార్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు శనిగరపు శ్రీనివాస్, కె.సంతోష్ కుమార్, పిట్ సెక్రటరీలు సంగం శ్రీనివాస్, గట్టు రాజు, ఐఎన్టీయుసీ నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 మార్చి 2026

# మాడుగులపల్లిలో సాగుతున్న మరణ మృదంగం

- ప్రజాప్రతినిధులారా, మీ నిద్ర ఎప్పుడు వదులుతారు..?
- వరుస ప్రమాదాలు నిలువునా పోతున్న ప్రాణాలు..!
- ఓట్లప్పుడు వచ్చే నాయకులు చావులు చూసి ఎందుకు మౌనంగా ఉంటున్నారు..?
- టోల్ గేట్ వసూళ్లలో ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాల మీద లేదా..?

**మాడుగులపల్లి, మార్చి 22 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్డు ఇప్పుడు సామాన్యుల పాలిట యమపాశం లా మారింది. అభివృద్ధి మంత్రం జపిస్తున్న పాలకులు, ఈ రోడ్డుపై జరుగుతున్న వరుస మరణాలను చూస్తూ కూడా కళ్ళు మూసుకోవడం దారుణం. ఇక్కడ సర్వీస్ రోడ్డు లేక అదుపు తప్పిన వాహనాలు సామాన్యులను బలి తీసుకుంటుంటే, సంబంధిత అధికారులు, టోల్ గేట్ నిర్వాహకులు మాత్రం మొద్దునిద్ర పోతున్నారు.

**ప్రమాదం జరిగినప్పుడు డ్రామాలు ఆ తర్వాత మౌనం**




ఈ మృత్యు బాటపై ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణం పోతే చాలు అధికారులు, టోల్ గేట్ యాజమాన్యం పరుగు పరుగున వచ్చి హడావుడి చేస్తారు. త్వరలోనే రోడ్డు వేస్తాం బాధితులను ఆదుకుంటాం అంటూ కంటితుడుపు హామీలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఆ శవం కాటికి చేరకముందే వీరి హామీలు బుట్టదాఖలవుతున్నాయి. ఈ సైలెంట్ వెనుక ఉన్న మర్మమేమిటి? ప్రజల ప్రాణాల కంటే టోల్ వసూళ్లే ముఖ్యమా అని మండల ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు.

**ప్రజాప్రతినిధులారా ఇది మీ వైఫల్యం కాదా..?**

ఓట్ల కోసం గడపగడపకు తిరిగే ప్రజాప్రతినిధులు, ప్రజలు రోడ్ల మీద కుప్పకూలుతుంటే ఎందుకు నోరు మెదపడం లేదు? మీ నియోజకవర్గంలో, మీ మండల కేంద్రంలో ఇంతటి దారుణం జరుగుతుంటే అసెంబ్లీలోనో, అధికారుల దగ్గరో ఎందుకు నిలదీయడం లేదు? మాడుగులపల్లి ప్రజల ఓట్లు కావాలి కానీ, వారి ప్రాణాలు కాపాడటం అవసరం లేదా? మీ నిర్లక్ష్యం వల్ల ఇంకా ఎంతమంది తల్లులకు కడుపు కోత మిగులుస్తారో సమాధానం చెప్పాలి. తక్షణమే సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేయాలి ఇకపై సాకులు చెబితే సహించేది లేదు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలి. టోల్ గేట్ వసూళ్ల నిలిపివేయాలి రోడ్డు సౌకర్యం సరిగ్గా లేనప్పుడు టోల్ వసూలు చేసే హక్కు ఎవరిచ్చారు? బాధ్యత విస్మరించిన టోల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. కలెక్టర్ జోక్యం చేసుకోవాలి జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ మరణ మృదంగాన్ని ఆపాలి.

ఇప్పటికైనా స్థానిక నాయకులు, అధికారులు తమ మొద్దునిద్ర వీడి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో మాడుగులపల్లి చౌరస్తాలో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకోవడం ఖాయం. అప్పుడు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

## మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన



**హాలియా, మార్చి 22 (జనం సాక్షి) :** విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ విద్యార్థి యువజనోత్సవాల సందర్భంగా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా హాలియాలో నిర్వహించిన రెండు కిలోమీటర్ల అవగాహన పరుగు కార్యక్రమాన్ని ఆదివారం పట్టణ సీఐ సతీష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు విద్యార్థులు ముందుండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని దెబ్బతీసి కుటుంబ భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయని తెలిపారు. మత్తు పదార్థాల విక్రయం, వినియోగంపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకుంటోందని, అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు యువతలో చైతన్యం పెంచుతాయని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ మార్పుకు కట్టుబడి ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాలు నిర్వహించిన అవగాహన పరుగు కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర మండల విద్యాధికారి తరి రాము, విద్యార్థి సంఘ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, యువజన సంఘ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఇతర ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కుంగ్‌ఫూలో విద్యార్థులకు బెల్ట్ ప్రదానం..



**గోదావరిఖని, మార్చి 22 (జనంసాక్షి) :** స్థానిక జిఎం కాలనీ గ్రౌండ్లో హుయాన్ చుంగ్ కుంగ్ ఫూ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ లో కుంగ్ ఫూలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్ట్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. మాస్టర్ ఏం.రాజేశం ఆధ్వర్యంలో బెల్ట్ టెస్ట్ చేపట్టారు.ఈ బెల్ట్ టెస్ట్ లోమాస్టర్. ఏం. రాజేశం వద్ద కుంగ్ ఫూలో శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులు కుంగ్ ఫూ ప్రదర్శనలో నేర్చుకున్న నైపుణ్యం తో కుంగ్ ఫూ లో బెల్ట్ లు సాధించారు..10మంది విద్యార్థిని, విద్యార్థులు ఎల్లో బెల్ట్ లు హేమచంద్ర, కె.యుగేందర్, హార్దిక్, అభిరామ్ , వైదు వైష్ణావీ, హర్షవర్ధన్, హేమంతు, ఎసయేస్వి, లాస్య వర్ణిక, సంజీవ్ , బ్రౌన్ బెల్ట్ టెస్ట్ లో నిహారిక, తేజశ్రీ, ఎండీ గౌస్ పాషా, కార్తికేయకు ఈ బెల్ట్ ల ప్రధానశీ మాస్టర్ రాజేశం ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఎగ్జామినర్ చేతుల మీద బెల్ట్ లు, సర్టిఫికెట్స్ ప్రధానం చేయడంజరిగినది. ఈ కార్యక్రమంలో జి. నారాయణ చీఫ్ రిఫరీ, కే. రాములు, సీనియర్ చీఫ్ ఇన్స్టక్టర్ కే.వీరాస్వామి విద్యార్థుల పేరెంట్స్ పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న నల్ల బెల్లం భారీగా పట్టివేత

- ముగ్గురు అరెస్ట్



**దేవరకొండ, మార్చి 22 (జనం సాక్షి) :** నల్గొండ అసిస్టెంట్ కమిషనర్(ఎన్ఫోర్స్మెంట్) బి.సంతోష్ ఆదేశాల మేరకు, ఏఈఎస్ ఎన్ఫోర్స్మెంట్ ఏ. కిషన్ పర్యవేక్షణలో ఎక్సైజ్ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దేవరకొండ మండలంలో భారీ దాడులు నిర్వహించారు.పడమటి పల్లి క్రాస్ రోడ్ సమీపంలో జరిపిన ఈ రూట్ వాచ్లో అక్రమంగా తరలిస్తున్న నల్ల బెల్లం, పటిక మరియు నాటు సారాను పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. కొండమల్లేపల్లి బాపూజీనగర్కు చెందిన సంపంగి రాములు అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇతని వద్ద నుంచి 900 కిలోల నల్ల బెల్లం (30 బ్యాగులు), 50 కిలోల పటికతో పాటు ఒక మహీంద్రా బొలెరో ఫోను స్వాధీనం మ్యాక్స్ ట్రాక్కు (TG.05T.9996), ఒక మొబైల్ చేసుకున్నారు. దేవరకొండకు చెందిన పత్లావత్ లాలు (ఏ1), కొండమల్లేపల్లికి చెందిన అంగోత్ తరుణ్ (ఏ2) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 900 కిలోల నల్ల బెల్లం, 20 కిలోల స్పటిక మరియు 10 లీటర్ల నాటు సారాను సీజ్ చేశారు. వీటితో పాటు రవాణాకు ఉపయోగిస్తున్న మారుతి 800 (AP.10AJ.1159), మారుతి ఆల్టో (AP.28BB.4312), ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో మొత్తంగా 1800 కిలోల నల్ల బెల్లం, 70 కిలోల పటిక, 10 లీటర్ల నాటు సారా మరియు మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన వస్తువులు, వాహనాల మొత్తం విలువ సుమారు 10 లక్షల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, ఎన్ఫోర్స్మెంట్ కానిస్టేబుళ్లు శేఖర్ రెడ్డి, నాగరాజు మరియు అనిల్ పాల్గొన్నారు. తదుపరి చర్యల నిమిత్తం కేసు పత్రాలను, స్వాధీనం చేసుకున్న ఆస్తులను దేవరకొండ ఎస్.హెచ్.ఓకి అప్పగించినట్లు అధికారులు వెల్లడించారు.

## వరల్డ్ వాటర్ డే సందర్భంగా కృషినగర్ కాలనీలో ర్యాలీ




**శేరిలింగంపల్లి, మార్చి 22 (జనంసాక్షి) :** ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకొని శేర్లింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి కృషినగర్ కాలనీలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు నేతృత్వం వహించి నీటి ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆదివారం చేపట్టిన ఈ కార్యక్రమానికి మియాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషినగర్ కాలనీలో వరల్డ్ వాటర్ డే సందర్భంగా నిర్వహించిన 'సేవ్ వాటర్' ర్యాలీకి స్థానిక ప్రజలనుండి విశేష స్పందన లభించిందన్నారు. నీరు ప్రాణికోటికి జీవం అని, ప్రతి నీటిబొట్టును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. 'నీటిని కాపాడుకుందాం', 'సేవ్ వాటర్ – సేవ్ ఫ్యూచర్' వంటి నినాదాలతో కృషినగర్ కాలనీ కాలనీ వీధులలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగిందని, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనడం శుభపరిణామం అన్నారు. పెరుగుతున్న పట్టణీకరణ, వాతావరణ మార్పుల కారణంగా భవిష్యత్తులో నీటి కొరత మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల ప్రతి ఒక్కరూ నీటిని జాగ్రత్తగా వినియోగించడం అత్యవసరం అని వివరించారు. ఈ కార్యక్రమంలో వాటర్ ఎయిడ్ సంస్థ ప్రదినిధులు, సీనియర్ నాయకులు బండారు మోహన్ ముదిరాజ్, సుప్రజ, భగత్ ముదిరాజ్, గిరి, కృష్ణ, జ్యోతి, కాలనీ వాసులు వంశీకృష్ణ రెడ్డి, పాపిరెడ్డి, కమలాకర్ రెడ్డి, లక్ష్మీ కాంత్ రెడ్డి, శ్రీనివాస్, సింగరావు, అజయ్ కుమార్ రాంభూపాల్ రెడ్డి, రాజు, జనార్ధన్ రెడ్డి, శ్రీనివాస్, మహేష్, ప్రసాద్, మరియు చిన్నపిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**మధిర, మార్చి 22 (జనంసాక్షి) :** అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని, బీమా ప్రకారం సొమ్ము వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం మధిర నియోజకవర్గంలో సుడిగాలిలా పర్యటించారు. అందులో భాగంగా మధిర మండలం ఆత్కూరులోని అగ్నిప్రమాదానికి గురైన శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రితో పాటుగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మాజీ డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మాజీ ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాద ఘటన జరిగిన సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీని పరిశీలించారు, మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చేపడుతున్న చర్యలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులు నుంచి సమాచారం తీసుకున్నారు. అనంతరం కోల్డ్ స్టోరేజీలో ఘటనలో నష్టపోయిన మిర్చి బాధితులతో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ సి.ఎం. మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ శీతల గిడ్డంగిలో రికార్డు ప్రకారం ఉన్న మిర్చి సంబంధిత రైతులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం బీమా ద్వారా అందించాలని అధికారులకు ఆదేశించారు. మధిర మార్కెట్లో కూడా మిర్చి అమ్మకాలు, కొనుగోలు ఖమ్మం మాదిరిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతంలో మళ్లీ మంటలు చెలరేగకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలు పూర్తిగా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు.

## విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**మధిర, మార్చి 22 (జనంసాక్షి) :** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బంది పై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.ఆదివారం మధిర ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఎల్.డి.ఆర్.ఎం. రూమ్, డయాలసిస్ సెంటర్, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, రేడియాలజీ బ్లాక్, ఓపి రూమ్ లను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు.రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోజువారీ కేసుల వివరాలు, ముఖ్యమైన రిజిస్టర్లు, నెలవారీ నివేదికలను, ఔషధాల లభ్యత, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, సేవలు మరింత నాణ్యంగా అందేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎమర్జెన్సీ వార్డ్‌లో కేసు షీట్ లను పరిశీలిస్తూ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగులకు రెగ్యులర్ గా అందుతున్న భోజనం నాణ్యత అంశాలను రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మధిర తహసీల్దారు రాంబాబు, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ఈ నెల 24న పట్టుబడిన వాహనాల వేలం

- ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆధ్వర్యంలో వాహనాల వేలం
- ఉదయం 10 గంటల లోపు పేరు నమోదు చేసుకోవాలి



**దేవరకొండ, మార్చి 22 (జనం సాక్షి) :** దేవరకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు నేడు వేలం వేయడం జరుగుతుందని, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ దేవరకొండ ఆవరణలో నల్గొండ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో ఈ వేలం పాటను నిర్వహించబడుతుందని, ఆసక్తి గలవారు ప్రభుత్వం ద్వారా నిర్దేశించబడిన ధరావత్తు సొమ్మును చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనమునకు 10,000/– రూపాయలు, నాలుగు చక్రాల వాహనములకు 30,000/– రూపాయలు ఉదయం పది గంటల లోపు డిపాజిట్ చేసి తమ పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. వేలం పాటలో వాహనం దక్కించుకొని వారికి తమ డిపాజిట్ తిరిగి చెల్లించబడుతుందని అన్నారు. వేలానికి సంబంధించిన వాహనాల జాబితా, నియమనిబంధనలు మరియు రిజిస్ట్రేషన్ ప్రక్రియతో సహా మరిన్ని వివరాల కోసం ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

## శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్‌లో అప్పు తీసుకుంటే అంతే సంగతి..

- తప్పుడు లెక్కలు చూపుతూ బెదిరింపులు
- బాధితుడు కృష్ణ చైతన్య



**వలిగొండ, మార్చి 22 (జనం సాక్షి) :** అవసరాలకు రుణం తీసుకున్నందుకు శ్రీ రామ్ ఫైనాన్స్ కంపెనీ వేధింపులతో చావే శరణమని ఎల్బీనగర్ చెందిన బాధితుడు పిన్నపురాల కృష్ణ అలియాస్ కృష్ణ చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు భువనగిరి పట్టణంలోని శ్రీ రామ్ ఫైనాన్స్లో ట్రేడింగ్ నిమిత్తం 2018 అక్టోబర్లో రుణం కోసం దరఖాస్తు చేసుకోగా 60 లక్షల రుణం మంజూరు చేసి రూ 57 లక్షల 47 వేల 66 6 చెక్కు ఇచ్చారు. సదరు సంస్థ నిర్ణయించిన విధంగా నెలకు 1,82,500 చొప్పున 60 నెలల పాటు 1.09 కోట్లు వాయిదాల పద్ధతిలో చెల్లించిన గాని ఇంకా 62 లక్షలు చెల్లించాలని వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా రుణం తీసుకున్నప్పుడు బీమా కోసం సొమ్ము వసూలు చేసిన సంస్థ బీమా పత్రాలను నాకు ఇవ్వలేదన్నారు ఆ సంస్థ లీగల్ అడ్వైజర్ శ్రీనివాస్ రెడ్డి తనతో పాటు తనకు గ్యారెంటీగా ఉన్నా సంతోష్ కుమార్ తీవ్ర మానసిక ఒత్తిడి గురి చేశారని ఆరోపించారు. వేధింపుల కారణంగానే సంతోష్ కుమార్ బీపీ పెరిగి తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 26న శ్రీ రామ్ ఫైనాన్స్ ఎదుట నిరసన చేస్తామని ఫైనాన్స్ ఏజెంట్లు మార్కెటింగ్ వ్యక్తులు ఉద్యోగులు కష్టమర్లు బాధితులు అధిక సంఖ్యలో రావాలని కోరారు. శ్రీ రామ్ ఫైనాన్స్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## సాలూర రైతు కేజీ గంగారాంకు పుడమిపుత్ర జాతీయ అవార్డు పురస్కారం



**బోధన్, మార్చి 22 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రానికి చెందిన రైతు కేజీ గంగారాం తాను వ్యవసాయంలో అవలంబిస్తున్న విధానాలకు గుర్తించి వసుంధర విజ్ఞాన వికాస మండలి, వైద్యుల విజ్ఞాన వేదిక ఆయనను పుడమి పుత్ర జాతీయ అవార్డు పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ నెల 26వ తేదిన హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆయనకు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డు అందించి ఘనంగా సన్మానించనున్నారు. సాలూర వాసి అయిన కేజీ గంగారాం గత 35 సంవత్సరాల నుంచి వ్యవసాయమే జీవనాధారంగా చేసుకుని రకరకాల పంటలు పండిస్తున్నారు. వరి,చెరుకు,కూరగాయల పంటలు,పండ్ల తోటలయిన మామిడి,జామ లాంటి పంటలు పండిస్తున్నారు.భూమినే నమ్ముకున్న ఆయన సాటి రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.వరి కొనుగోలుకై, శనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, రైతుభీమ, తదితర సమస్యలపై ఆయన ప్రభుత్వాన్ని మీడియా వేదికగా నిలదీశారు. తాను ఏ పార్టీలో ఉన్న రాజకీయాలకు అతీతంగా రైతుల పక్షాన నిలబడడమే ఆయన కర్తవ్యంగా భావిస్తారు.ఆయన కష్టపడేతత్వానికి, రైతు ఉద్యమకర్తగా గుర్తించి వారు ఆయనకు పుడమిపుత్ర జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.తనకు జాతీయ పురస్కారానికి ఎంపిక చేసిన పెద్దలకు ,రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గత ప్రభుత్వం కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు గాలికి వదిలేసింది

- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రుద్రంగి, మార్చి 22 (జనం సాక్షి) :** ప్రజల అభ్యున్నతి, రైతుల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందనీ,త్వరలోనే కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉన్నతాధికారులతో కలిసి కలికోట సూరమ్మ ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గతంలో ఈ ప్రాజెక్టు కోసం రైతులు, పార్టీ నాయకులు కలిసి 37 నెలల పాటు ప్రతి నెల 22వ తేదీన ధర్నాలు, దీక్షలు, పాదయాత్రలు నిర్వహించి నిరసనలు తెలియజేసిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి ప్రభుత్వం పనులు ప్రారంభించలేకపోయినా, ప్రజల ఆశయాలను గౌరవిస్తూ ప్రస్తుతం ప్రభుత్వం ఈ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి కట్టుబడి ఉందని తెలిపారు.గతంలో ఈ ప్రాజెక్టు పనులు ముమ్మరం చేయాలని పెద్ద ప్రభుత్వ హయాంలో అప్పటి



పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవన్ రెడ్డి లక్ష్మణ్ వంటి అనేక మంది వచ్చి ప్రాజెక్టును పరిశీలించారని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ భూభాగానికి నీరు అందించే ప్రాజెక్టుల్లో ఈ ప్రాజెక్టును ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో చేర్చి నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఉత్తమ్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో కూడా పనులు పురోగమిస్తున్నాయని తెలిపారు.శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి మల్యాల గ్రామంలో జిల్లా యజ్ఞంలో భాగంగా 1737 కోట్లతో ప్రాజెక్టు పనులకి అంకురార్పణ చేశారని రుద్రంగి నాగారం చెరువు వారి హయాంలోని పూర్తయింది అని తెలిపారు.అలాగే, వేములవాడ నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, చెరువుల అభివృద్ధి, కాలువల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.. నియోజకవర్గ పరిధిలోని మల్రిపల్లి ప్రాజెక్టు లచ్చంపేట కాలువ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అన్నారు..ప్రజల అభ్యున్నతి, రైతుల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి అతి త్వరలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశిస్తూ, ప్రజల ఆశలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆయన వెంట రుద్రంగి సర్పంచ్ గండి నారాయణ, ఉపసర్పంచ్ మాడిశెట్టి అభిలాష్ తోపాటు నాయకులు తదితరులు ఉన్నారు.

## ఆదర్శ పాఠశాల విద్యార్థులకు నిత్యం నరకయాతన



**పి.ఏ.పల్లి, మార్చి 22 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండలం కేంద్రం నుండి మల్లాపురం రోడ్డున వెళ్లాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.రోజువారీగా నిత్యం పి.ఏ.పల్లి మండలంలోని ఆదర్శ పాఠశాలకు, మల్లాపురం వెళ్లాలంటే విద్యార్థులు ఆటోలు,వారి తల్లిదండ్రులు వాహనాల యందు స్కూలుకు తీసుకు వెళుతుంటారు.కానీ ఆ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో విద్యార్థులు నిత్యం నరకయాతన పడుతున్నారు.కొంతమంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాలైన సంఘటనలు కొన్ని చోటు చేసుకున్నాయి.ప్రజా ప్రతినిధులు,అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న కూడా పట్టించు కోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు,ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోని రోడ్డుకు మరమ్మతులు చేపించాలని వాహన దారులు,ప్రజలు వేడుకుంటున్నారు.




# మధుమేహ రోగులకు ఊరట

- చౌకగా సెమాగ్లుటైడ్ జనరిక్
- అందుబాటులోకి తెచ్చిన డాక్టర్ రెడ్డీస్, పలు సంస్థలు

**హైదరాబాద్:**మధుమేహం, దీర్ఘకాలిక ఊబకాయం (అధిక బరువు) సమస్యలు ఉన్నవారి చికిత్సకు సమర్థంగా ఉపయోగపడే 'సెమాగ్లుటైడ్' ఔషధం సామాన్యులకూ అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయంగా 'ఓజెంపిక్', 'విగోవి' వంటి బ్రాండ్ల పేర్లతో ఆదరణ పొందిన ఈ మందు.. శరీరంలో జీఎల్‌పీ-1 హార్మోన్ తరహాలో పనిచేసే ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచుతుంది. గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. ఈ బ్రాండ్‌ను ఆవిష్కరించిన నోవో నార్డిస్క్ ఉత్పత్తి చేస్తున్న మందుల ధరలు అధికంగా ఉండటంతో, మనదేశంలో సామాన్యులు వినియోగించడం కష్టంగా ఉంది. ఈ మందుకు సంబంధించిన మాలిక్యూల్ పేటెంట్ గడువు మనదేశంలో ముగిసిన నేపథ్యంలో, డాక్టర్ రెడ్డీస్, గ్లెన్‌మార్క్, జైడస్, టొరెంట్, ఆల్కెమ్, యూఎస్‌వీలాంటి భారతీయ ఫార్మా దిగ్గజాలన్నీ



శనివారం తమ జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్లు, ఓరల్ మందులను మార్కెట్లో విడుదల చేశాయి. నాట్కో ఫార్మా శుక్రవారమే విడుదల చేసిన సంగతి విదితమే. బ్రాండెడ్ మందులతో పోలిస్తే బాగా తక్కువ ధరకే ఈ జనరిక్ వెర్షన్లు అందుబాటులోకి వస్తుండటం, సామాన్యులకు ఊరట కలిగించే అంశమే.డాక్టర్ రెడ్డీస్ 'ఒబెడా' పేరుతో ఇంజెక్టబుల్ సెమాగ్లుటైడ్‌ను ప్రవేశపెట్టింది. 2, 4 ఎంజీ మోతాదుల్లో డిస్పోజబుల్ పెన్నుల రూపంలో ఈ మందును తీసుకొచ్చింది. వారానికి ఒకసారి మాత్రమే దీన్ని తీసుకోవాలి. ప్రతి పెన్ ద్వారా కనీసం 4 వారాలకు సరిపడా డోసులు అందుతాయని, నెలకు రూ.4,200 ఖర్చు అవుతుందని సంస్థ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ తెలిపారు. యూఎస్‌వీ సైతం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ భాగస్వామ్యంతో యూసెమా బ్రాండ్ పేరుతో జనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్‌ను భారత్‌లో విడుదల చేసింది.సన్ ఫార్మా నావెల్‌ట్రీట్, సెమాట్రినిటీ పేర్లతో ఇంజెక్షన్లను విడుదల చేసింది. నావెల్‌ట్రీట్‌ను ఊబకాయ చికిత్సకు ఉపయోగిస్తారు. దీనికి వారానికి రూ.900 - 2,000 వరకు ఖర్చవుతుంది. సెమాట్రినిటీని టైప్-2 మధుమేహ చికిత్సకు ఉపయోగిస్తారు. దీనికి వారానికి రూ.750-1,300 ఖర్చు అవుతుందని కంపెనీ తెలిపింది.గ్లెన్‌మార్క్ ఫార్మా టైప్-2 మధుమేహం కోసం 'గ్లిపిక్' బ్రాండ్‌ను తీసుకొచ్చింది. వయల్స్ రూపంలో లభించే ఈ మందు కోసం వారానికి రూ.325 - 440 ఖర్చవుతుంది.జైడస్ లైఫ్‌సైన్సెస్ సెమాగ్లిన్, మాషెమా, ఆల్టర్‌మెట్ పేర్లతో జనరిక్ వెర్షన్లను విడుదల చేసింది. నెలవారీ చికిత్సకు సగటున రూ.2,200 ఖర్చవుతుంది.ఆల్కెమ్ లేబొరేటరీస్.. సెమాసైజ్, ఒబెస్మా, హెపాగ్లైడ్ పేర్లతో సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్లను విడుదల చేసింది. ముందుగానే నింపిన డిస్పోజబుల్ ఇంజెక్షన్ పెన్ ప్రారంభ ధరను నెలకు రూ.1,800 (వారానికి రూ.450)గా నిర్ణయించింది. ప్రతిసారీ కొత్త పెన్ కొనాల్సిన అవసరం లేకుండా, కేవలం మందు ఉన్న కాట్రిడ్జ్ మార్చుకుని, తిరిగి వినియోగించుకునే పెన్‌ను ఆల్కెమ్ ప్రత్యేకంగా తీసుకొచ్చింది.

# డాలర్ దెబ్బకు ధరల విలవిల

- స్మార్ట్‌ఫోన్ - ల్యాప్‌టాప్ ధరల దూకుడు
- ర్యామ్, నంద్ స్టోరేజీ ధరలు పెరగడం వల్లే



**న్యూఢిల్లీ:**డాలర్‌తో పోలిస్తే రూపాయి క్షీణత వల్లా సెమికండక్టర్ చిప్‌సెట్ల కొరత రెండేళ్ల క్రితం ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాల తయారీని తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. ఇప్పుడు మెమొరీ చిప్‌లు ధరలు పెరగడం వల్ల స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు అంతకంతకూ అధికమవుతున్నాయి. డిర్యామ్, నంద్ స్టోరేజీ వ్యయాలు పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ అంతకంతకూ క్షీణించడం ఈ పరిస్థితికి కారణం. ఫలితంగా గతేడాదితో పోలిస్తే 2026లో స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు 13% తగ్గొచ్చని పరిశ్రమ సంఘాలు అంచనా వేస్తున్నాయి. ఫోన్, కంప్యూటర్ వంటి



పరికరాల్లో డేటాను శాశ్వతంగా భద్రపరచేందుకు వాడే స్టోరేజీ మాడ్యూల్స్ కోసం సెమికండక్టర్ చిప్స్ కావాలి. వీటి ధరలు ప్రతినెలా పెరుగుతున్నాయి. ముఖ్యంగా 512 జీబీ, 1 టీబీ మాడ్యూల్స్ ధరలు మరింత అధికమవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లలో కీలకమైన డిర్యామ్ (డైనమిక్ ర్యాండమ్ యాక్సెస్ మెమొరీ), స్టోరేజీ మాడ్యూల్/నంద్ ఫ్లాష్‌కు అంతర్జాతీయంగా కొరత ఎక్కువైంది. ఏఐ (కృత్రిమమేధ) డేటా సెంటర్లకు అవసరమైన హైబ్యాండ్‌విడ్త్ మెమొరీ (హెచ్‌బీఎం) వ్యవస్థలకు అంతర్జాతీయంగా ఒక్కసారిగా గిరాకీ పెరగడం ఇందుకు కారణం. మెమొరీచిప్‌లు తయారు చేసే ఎస్‌కే హైనిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, శామ్‌సంగ్ వంటివి తాము తయారు చేస్తున్న మెమొరీ కార్డులను డేటా సెంటర్లకే కేటాయిస్తున్నాయి. ఫలితంగా గత నవంబరు నుంచి వీటి ధరలు 50% పెరిగాయని సమాచారం. అందువల్లే స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు ధరలు పెంచేస్తున్నాయి. ల్యాప్‌టాప్‌ల ధరలు కూడా దాదాపు 20-25% పెరిగాయని, వీటి అమ్మకాలూ నిదానిస్తున్నాయని చెబుతున్నారు.

### డాలర్ ప్రభావం

డాలర్ విలువ రూ.93ను మించడం వల్ల, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులన్నీ భారమవుతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు దేశీయంగా రూపొందుతున్నా, వాటిల్లోని కీలక విడిభాగాలను దిగుమతి చేసుకుని, ఇక్కడ అసెంబ్లింగ్ చేయిస్తున్నారు. ఇందువల్లే వివో, ఓపో, రియల్‌మి, పోకో, శామ్‌సంగ్, వన్‌ప్లస్, మోటరోలా, షియామీ కంపెనీల ఫోన్ల ధరలు 40% వరకు పెరిగాయి.శామ్‌సంగ్ ప్రీమియం ఫోన్ ఎస్ 26 ధరలను తీసుకుంటే, అదే తరహా ఎస్ 25 కంటే రూ.20,000 ఎక్కువగా ఉంది. 5జీ ఫీచర్ల వల్ల ప్రారంభశ్రేణి స్మార్ట్‌ఫోన్ల ధర రూ.7,500- 8000 నుంచి రూ.11,000- 11,500కు చేరింది. స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు తగ్గేందుకు, ధరలు పెరగడంతో పాటు రాయితీలు తగ్గడమూ కారణమని చెబుతున్నారు. ముడిపదార్థాలు, విడిభాగాల ధరలు పెరిగిన నేపథ్యంలో.. ఆన్‌లైన్ పోర్టళ్లు, విక్రయశాలలు కూడా ఫోన్లపై రాయితీలు తగ్గించేశాయి. స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో 60% వరకు రూ.25,000లోపువే ఉంటాయి. ఈ విభాగ కొనుగోలుదార్లకు ధర-రాయితీ అత్యంత ఆకర్షణీయం. వీటిల్లో ప్రతికూలత వల్ల, కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నారు. కొత్త ఫోన్ల ధరలు పెరగడంతో, ప్రారంభస్థాయి కొనుగోలుదార్లు సెకండ్‌హ్యాండ్ మార్కెట్‌ను ఆశ్రయిస్తున్నారని ఆలిండియా మొబైల్ రిటెయిలర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కైలాష్ లఖ్యానీ తెలిపారు. ఇందువల్ల సంప్రదాయ విక్రయశాలల్లో స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు ఈ ఏడాది జనవరి - ఫిబ్రవరి మధ్య 35% తగ్గాయని, మార్చిలోనూ నెమ్మదిగానే ఉన్నాయని వివరించారు. యుద్ధ పరిస్థితుల వల్ల, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే, ఫోన్లు - ల్యాప్‌టాప్‌ల అమ్మకాలపై మరింత ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు.

### వారంలో పసిడి 10%.. వెండి 15% తగ్గాయ్

2011 తర్వాత బంగారానికి ఒక వారంలో అధిక క్షీణత ఇదే

పసిడి ధర అంతర్జాతీయంగా గతవారం 10% తగ్గింది. 2011 సెప్టెంబరు తర్వాత ఒక వారంలో పసిడి ధరలో అధిక క్షీణత ఇదే. 2008 అక్టోబరు తర్వాత పసిడి ఒక నెలలోనే అత్యధిక నష్టాన్ని నమోదు చేసే దిశగా ప్రస్తుతం సాగుతోంది. ఈ ఏడాది ప్రారంభం నాటి ధరలతో పోలిస్తే మాత్రం, ఇంకా పసిడి ధర 5% అధికంగానే ఉంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందే పసిడి ధర బాగా పెరగడం ఇందుకు కారణం. ఈనెల 20న (శుక్రవారం) పసిడి ఔన్సు (31.10 గ్రాముల) ధర 2.47% తగ్గి 4,492 డాలర్లకు దిగివచ్చింది. గతవారం ప్రారంభంలో ఇది 5000 డాలర్ల దరిదాపుల్లో ఉంది. వరుసగా మూడో వారమూ వెండికి నష్టాలు కొనసాగాయి. గతవారం ఈ లోహ ధర 15% వరకు క్షీణించింది. 2026 మొత్తం మీద చూస్తే వెండి ధర ఒక శాతానికి పైగా తగ్గింది. శుక్రవారం ఈ లోహ ధర ఔన్సుకు 4.78% తగ్గి 67.81 డాలర్ల వద్ద ముగిసింది. గతవారం ప్రారంభంలో 80 డాలర్ల వద్ద ఉండటం గమనార్హం.పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో దేశాల ఆర్థిక వ్యవస్థలు నెమ్మదించొచ్చనే అంచనాలకు తోడు డాలర్ బలోపేతం కావడం వల్ల పసిడి, వెండి

# అమెజాన్ నుంచి ఏఐ స్మార్ట్‌ఫోన్

**న్యూఢిల్లీ:**సొంతంగా ఏఐ (కృత్రిమమేధ) స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించేం దుకు ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్ సన్నాహాలు చేస్తోంది. వాయిస్ అసిస్టెంట్ అలెక్సాతో పాటు అభివృద్ధి చేసిన అమెజాన్ సర్వీసెస్‌తో అనుసంధానం అయ్యేలా ఈ ఫోన్ ఉంటుందని సమాచారం. ఇది సంప్రదాయ స్మార్ట్‌ఫోన్ లాగా పనిచేస్తుందని.. దీంతోపాటు ఏఐ సేవలూ అందిస్తుందని చెబుతున్నారు. అమెజాన్ యాప్‌పై మరింత సులభంగా కొనుగోళ్లు చేసేందుకు, ప్రైమ్‌లో వీడియోలు చూసేందుకు, అమెజాన్ మ్యూజిక్‌లో సంగీతం ఆలకించేందుకు, ఆహార డెలివరీ సేవలు పొందేందుకు ఉపయోగపడేలా ఈ స్మార్ట్‌ఫోన్‌ను తీర్చిదిద్దాలన్నది అమెజాన్ ప్రణాళిక. ఈ ఫోన్ ధర ఎంత ఉండొచ్చు, ఎప్పుడు విపణిలోకి రావచ్చు, ప్రాజెక్టు ఆర్థిక వివరాల వంటివీ తెలియరాలేదు. ఒకవేళ అనుకున్నట్లు రాకపోతే, ఈ ప్రాజెక్టును పక్కనపడేసే వీలూ ఉందని తెలిసింది.







# ఇరాన్ చమురునాడి సౌత్‌పార్స్

## దేశీయ గ్యాస్ అవసరాల్లో 80% ఇక్కడి నుంచే..



**టెహ్రాన్:**సౌత్ పార్స్ గ్యాస్ క్షేత్రంపై ఇజ్రాయెల్ దాడి చేయడంతో ఇరాన్ ఆగ్రహంతో ఊగిపోతోంది! గల్ఫ్ దేశాల్లోని ప్రధాన ఇంధన కేంద్రాలపై ప్రతీకార దాడులతో విరుచుకుపడుతోంది. ఫలితంగా అంతర్జాతీయ ఇంధన విపణిలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పరిస్థితి విషమిస్తుండటంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం చేసుకొని.. ఇరాన్ ప్రతీకార దాడులను ఆపకపోతే 'సౌత్ పార్స్'ను పూర్తిగా పేల్చివేస్తామంటూ తాజాగా హెచ్చరిక జారీ చేశారు. ఈ నేపథ్యంలో అసలు సౌత్ పార్స్ ఎక్కడుందో, దాని ప్రాముఖ్యతలేంటో పరిశీలిస్తే.. పర్షియన్ గల్ఫ్‌లో సౌత్ పార్స్ ఉంది. ఇది ప్రపంచంలోకెల్లా అతిపెద్ద గ్యాస్ క్షేత్రం. ఖతార్‌తో కలిసి దీన్ని ఇరాన్ పంచుకుంటోంది. ఇరాన్ వైపున ఉండే భాగాన్ని సౌత్ పార్స్ అంటారు. ఖతార్ వైపున 'నార్త్ డోమ్'గా పిలుస్తారు.ప్రపంచంలో సహజవాయువును అత్యధికంగా వినియోగించే దేశాల జాబితాలో అమెరికా, చైనా, రష్యాల తర్వాత నాలుగో స్థానంలో ఇరాన్ ఉంది. ఆ దేశంలో వాతావరణం చల్లగా ఉంటుంది. ఇళ్లలో వాతావరణాన్ని వెచ్చగా మార్చుకునేందుకు గ్యాస్‌నే ఎక్కువగా వినియోగిస్తుంటారు. వంటకూ, విద్యుదుత్పత్తికీ దానిపైనే అధికంగా ఆధారపడుతుంటారు. ఇరాన్ ఉపయోగించే గ్యాస్‌లో దాదాపు 80% సౌత్ పార్స్ నుంచే వస్తుంది. అందుకే ఈ క్షేత్రాన్ని ఇరాన్ ఇంధన జీవనాడిగా చెబుతుంటారు. నిరుడు సౌత్ పార్స్‌లోని కొన్ని భాగాలపై ఇజ్రాయెల్ దాడి చేసినప్పుడు ఇరాన్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడ్డాయి. వేలకోట్ల రూపాయల పెట్టుబడులతో తమవైపున నార్త్ డోమ్‌ను ఖతార్ ఇటీవలి ఏళ్లలో బాగా అభివృద్ధి చేసింది. తద్వారా ద్రవీకృత సహజవాయువు (ఎల్‌ఎన్‌జీ) అతిపెద్ద సరఫరాదారుల్లో ఒకటిగా ఎదిగింది. యావత్ ప్రపంచ అవసరాల్లో ఐదింట ఒక వంతు గ్యాస్‌ను ఖతారే సరఫరా చేస్తోందంటే అందుకు ప్రధాన కారణం- నార్త్ డోమ్. ప్రధానంగా ఆసియా, ఐరోపా దేశాలకు గ్యాస్ ఎగుమతులతో ఇది భారీగా ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

### ప్రతీకార దాడులు విస్తృతమైతే..

తమ దేశీయ అవసరాలకు అత్యధికంగా గ్యాస్‌ను అందించే సౌత్ పార్స్‌పై దాడులతో ఇరాన్ తీవ్ర




ఆగ్రహంతో రగిలిపోతోంది. ఖతార్, సౌదీ అరేబియా సహా పలు ఇతర గల్ఫ్ దేశాల్లోని ఇంధన క్షేత్రాలపై దాడులకు దిగింది. మున్ముందు మరింత తీవ్రస్థాయిలో విరుచుకుపడతామనీ చెబుతోంది. ఖతార్ ప్రధాన ఇంధన కేంద్రమైన రాస్ లఫాన్ పారిశ్రామిక నగరం టెహ్రాన్ దాడుల్లో దెబ్బతిని ఈ నెల 2న మూతపడింది. గురువారం దానిపై మరోసారి ఇరాన్ దాడి చేసింది. సౌదీ రాజధాని రియాద్‌లోని రెండు రిఫైనరీలపైనా దాడులు జరిగాయి. మరోవైపు- హర్మూజ్ జలసంధిలో రవాణా కార్యకలాపాలు ఇప్పటికే ఆగిపోయాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఇంధన రేట్లు పెరుగుతున్నాయి. సౌత్ పార్స్‌లో 1,800 లక్షల కోట్ల ఘనపుటడుగుల గ్యాస్ నిల్వలు ఉన్నట్లు అంచనా. 13 ఏళ్లపాటు యావత్ ప్రపంచం అవసరాలకు సరిపోయే మొత్తమది. తుర్కియే, అర్మేనియా వంటి కొన్ని దేశాలకు మాత్రమే గ్యాస్‌ను టెహ్రాన్ ఎగుమతి చేస్తోంది. నిజానికి సౌత్ పార్స్‌ను ఉపయోగించుకొని ఎల్‌ఎన్‌జీ సరఫరాలో కీలకంగా ఎదగాలని ఇరాన్ గతంలో ప్రణాళికలు రచించింది. అయితే అణు కార్యక్రమం వల్ల దానిపై అంతర్జాతీయంగా ఆంక్షలు అమల్లో ఉండటంతో ఆ ప్రణాళికలు దెబ్బతిన్నాయి.ముస్లిం సోదరులకు సీఎం రేవంత్ రెడ్డి రంజాన్ శుభాకాంక్షలురంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

# ఇరాన్ చమురు మనకు దక్కుతుందా?



**న్యూఢిల్లీ:**పశ్చిమాసియా ఘర్షణల కారణంగా, సరఫరాలకు ఆటంకం ఏర్పడి బ్రెంట్ ముడిచమురు బ్యారెల్ ధర 112 డాలర్లను మించింది. యుద్ధానికి ముందు ఇది సగటున 70 డాలర్లుగా ఉండేది. ప్రపంచ దేశాలకు చమురు ధరల సెగ తాకడంతో, ఇప్పటికే సరఫరాకు సిద్ధం చేసిన ఇరాన్ చమురును ఏప్రిల్ 19 వరకు విక్రయించుకోవచ్చని అమెరికా సడలింపు ఇచ్చింది. దాదాపు 100-140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ చమురు సరఫరాకు సిద్ధంగా ఉందని అంచనా. ఈ నేపథ్యంలోనే ఇరాన్ నుంచి ముడి చమురు కొనుగోళ్లను తిరిగి ప్రారంభించాలని మన దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు యోచిస్తున్నాయని.. ఇందుకోసం ప్రభుత్వ మార్గదర్శకత్వం, చెల్లింపు నిబంధనలపై స్పష్టత కోసం ఎదురుచూస్తున్నాయని వార్తా సంస్థ రాయిటర్స్ పేర్కొంది. అమెరికా సడలింపుల నడుమ, ఇరాన్ నుంచి ముడిచమురు తిరిగి కొనుగోలు చేయడానికి ఆసియా దేశాలు సిద్ధమవుతున్నాయి. కానీ ఇంతకుముందు నుంచే ఇరాన్‌పై ఆంక్షలు అమలవుతున్నందున, తమ ప్రభుత్వాలు - అమెరికా నుంచి స్పష్టమైన ఆదేశాల కోసం కంపెనీలు వేచి చూస్తున్నాయని చెబుతున్నాయి. చెల్లింపు విధానాలు, బీమా కవరేజీపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే రష్యా చమురు కొనుగోలుకు కూడా అమెరికా అనుమతులు ఇచ్చిన సంగతి విదితమే.పశ్చిమాసియా, ఆసియా జలాల్లోని ట్యాంకర్లలో ప్రస్తుతం 100 -140 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురు నిల్వ ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే ప్రపంచ మార్కెట్లకు సరఫరా చేయడానికి తమ వద్ద అదనపు ముడి చమురు అందుబాటులో లేదని ఇరాన్ పేర్కొంది. ఇరాన్ చమురుపై అమెరికా ఆర్థిక మంత్రి వ్యాఖ్యలు, ప్రధానంగా కొనుగోలుదార్లకు భరోసా ఇవ్వడానికే ఉద్దేశించినట్లు కనిపిస్తున్నాయని ఇరాన్ చమురు మంత్రిత్వ శాఖ ప్రతినిధి సమన్ ఘోద్దూసీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో 200 రోజులకు సరిపడా, అత్యవసర చమురు నిల్వలుంటే, మనదేశంలో 70-80 రోజులకు సరిపడా వ్యూహాత్మక నిల్వలున్నాయని ప్రభుత్వం ప్రకటిస్తోంది. యుద్ధం ప్రారంభమయ్యాక, చమురు సరఫరాకు ఆటంకాలు పెరిగి, మనదేశంలో ఎల్‌పీజీ-ఎల్‌ఎన్‌జీ సరఫరాలపై ఆంక్షలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇరాన్ ముడి చమురుపై భారత్‌కు ఆసక్తి పెరిగింది. రష్యా చమురుపై ఆంక్షలను అమెరికా సడలించగానే, అక్కడనుంచి ముడి చమురు కొనుగోలు చేయడానికి భారతీయ రిఫైనరీలు త్వరగా చర్యలు తీసుకోవడం గమనార్హం.ఆసియా దేశాల ముడి చమురు దిగుమతుల్లో సుమారు 60% పశ్చిమాసియా నుంచే రవాణా అవుతుంది. ఇందుకు కీలక నౌకా రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధిలో ఆటంకాలు ఏర్పడటం, సమస్యను పెంచింది. 2018లో అమెరికా ఆంక్షలు కఠినతరం చేయక ముందు భారత్, జపాన్, దక్షిణ కొరియా, అనేక ఐరోపా దేశాలు ఇరాన్ ముడి చమురును అత్యధికంగా కొనుగోలు చేసేవి. చైనా మాత్రం ఇరాన్‌కు ప్రధాన వినియోగదారుగా కొనసాగుతూ, తరచు తక్కువ ధరలకే చమురు కొనుగోలు చేస్తోంది. ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షల సడలింపు నేపథ్యంలో, సోమవారం నాటి ట్రేడింగ్‌లో చమురు ధర కాస్త దిగి వస్తుందనే ఊహాగానాలు వస్తున్నాయి. అయితే తమ వద్ద పెద్ద మొత్తంలో ముడి చమురు అందుబాటులో లేదని ఇరాన్ పేర్కొనడంతో, 'మార్కెట్లను శాంతపర్చడానికే' అమెరికా ప్రకటనలు ఉద్దేశించినట్లున్నాయని రాయిటర్స్ పేర్కొంది. ఇరాన్ చమురు రవాణా, చెల్లింపు వ్యవస్థలు.. ముఖ్యంగా ఇరాన్ 'షాడోఫ్లీట్' అని పిలిచే పాత ట్యాంకర్ల వాడకంపై ఇప్పటికీ అనిశ్చితి నెలకొని ఉంది. అందువల్లే భారత రిఫైనరీలు కూడా ఇరాన్ ముడి చమురు కొనుగోలుకు సంబంధించి జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయని సమాచారం.

# హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం: సీఎం చంద్రబాబు

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌ను మించేలా అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. వైకాపా పాలనలో అమరావతిని పూర్తిగా పక్కన పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అత్యంత అధునాతన టెక్నాలజీతో అమరావతిని స్మార్ట్ సిటీగా మారుస్తామన్నారు. కృత్రిమ మేధ వినియోగం, విస్తరణ లక్ష్యంగా గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ఏర్పాటు చేసిన సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్‌లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1990 దాటాక మనవద్ద ఇంటర్నెట్ ప్రారంభమైందనీ, 1995 నుంచి నాలెడ్జ్ ఎకానమీ మొదలైందని చెప్పారు. "ఉమ్మడి ఏపీలో ఐటీ కంపెనీలు తెచ్చేందుకు అనేకమందితో మాట్లాడా. దిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిశా. భారత్‌లో ఐటీ కంపెనీలు పెట్టాలని కోరా. లెక్కలు, ఇంగ్లీష్‌లో భారతీయులు గొప్పవాళ్లని ఆయనకు చెప్పా. హైదరాబాద్‌లో ఐటీ కార్యాలయం పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరా. అప్పట్లో హైదరాబాద్ వచ్చేందుకు వాళ్లు తొలుత నిరాకరించారు. అక్కడికి వస్తే మాకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తారని అడిగారు. అప్పట్లో ఐఎస్‌బీ తెచ్చేందుకు ఎంతో కృషి చేశా. శంషాబాద్ విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు సేకరించాం. హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు, నల్సార్, ట్రిపుల్ ఐటీ తీసుకువచ్చాం. అప్పట్లో కేవలం మంజీరా నుంచే తాగునీరు వచ్చేది. కానీ, కేవలం 9 నెలల్లోనే కృష్ణానది నుంచి తాగునీరు తీసుకొచ్చాం.1999-2004 మధ్య హైదరాబాద్‌ను శరవేగంగా అభివృద్ధి చేశాం. అప్పట్లో నేను కృషి చేయడం వల్లే జినోమ్ వ్యాలీ వచ్చింది. అనేక కారణాల వల్ల 2004లో ఓడిపోయాం. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పదేళ్లు పట్టింది. 2014 నుంచి 2019 వరకు ఏపీలో అనేక కార్యక్రమాలు చేపట్టాం. కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడితే ఎన్నికల్లో గెలవలేం అని అన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త పరిమితులు

## నగదు రూ.10 లక్షలు దాటితే 'ప్యాన్'

**న్యూఢిల్లీ:**ఆర్థిక లావాదేవీల్లో నిత్యం ఉపయోగించే శాశ్వత గుర్తింపు సంఖ్య కు సంబంధించి కేంద్రం కొన్ని మార్పులు చేపట్టింది. లావాదేవీ పరిమితులను గణనీయంగా పెంచింది. కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 అమలులో భాగంగా కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఆదాయపు పన్ను నిబంధనలు-2026ను నోటిఫై చేసింది. ఇందులో భాగంగా పాన్‌కు సంబంధించిన లావాదేవీ పరిమితులను సవరించింది. ఏప్రిల్ 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి.ఒక ఆర్థిక సంవత్సరంలో ఖాతాలో రూ.10 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు ఒకేసారి లేదా విడతల వారీగా జమ చేసినా, ఉపసంహరించుకున్నా పాన్ వివరాలు ఇకపై ఇవ్వాల్సి ఉంటుంది. ఒకటే బ్యాంకు లేదా వేర్వేరు బ్యాంకుల్లో జరిగినా ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రస్తుతం ఒక రోజులో రూ.50 వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు.ఇళ్లు, స్థలాల కొనుగోలు, అమ్మకం, బహుమతి లేదా ఉమ్మడి డెవలప్‌మెంట్ ఒప్పందాల విషయంలో లావాదేవీ విలువ రూ.20లక్షలు దాటితే ఇకపై పాన్ తప్పనిసరి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. స్థిరాస్తి ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఈ పరిమితిని రెట్టింపు చేయడం గమనార్హం.ద్విచక్ర వాహనం సహా ఏ మోటారు వాహనమైనా, దాని ధర రూ.5 లక్షలు మించితే కొనుగోలుదారుడు పాన్ సమర్పించాల్సి ఉంటుంది. పాత చట్టంలో ద్విచక్ర వాహనాలకు ఈ నిబంధన లేదు. కార్లకు, ఇతర మోటారు వాహనాలకు ధరతో సంబంధం లేకుండా పాన్ సమర్పించాల్సి వచ్చేది. కొత్తగా రూ.5 లక్షల పరిమితిని తీసుకొచ్చారు.హోటళ్లు లేదా రెస్టారెంట్ల బిల్లులు, కన్వెన్షన్ సెంటర్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు చేసే చెల్లింపులు రూ.లక్ష దాటితే ఇకపై పాన్ సమర్పించాలి. ప్రస్తుతం హోటల్, రెస్టారెంట్ బిల్లు రూ.50 వేలు దాటితే పాన్ ఇవ్వాల్సి వస్తోంది. ఈ మొత్తాన్ని రెట్టింపు చేశారు.ప్రస్తుతం బీమా పాలసీ కొనుగోలు సమయంలో వార్షిక ప్రీమియం రూ.50వేలు దాటితేనే పాన్ అడుగుతున్నారు. ఇకపై ప్రతి పాలసీకి పాన్ సమర్పించడం తప్పనిసరి.





# పల్లెను విడిచి..
# పట్నంలో సర్పంచ్‌లు

## పల్లె ప్రకృతి వనాలపై 'నిర్లక్ష్యం' నీడ



### నీళ్లు లేక పచ్చని చెట్లు ఎండిపోతున్నాయి

- అర్కతల్‌లో పల్లె ప్రకృతి వనం.. కళావిహీనం
- పేరుకుపోతున్నా డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం.. సమస్యలు
- సర్పంచ్ గ్రామంలో ఉండి సమస్యలు తీర్చాలి : గ్రామస్తుల ఆవేదన

**నవాబుపేట్, మార్చి 22 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతి గ్రామంలో పల్లె ప్రగతి పథకం ద్వారా పచ్చదనాన్ని పెంచి, చల్లని వాతావరణాన్ని కల్పించాలని లక్ష్యంగా పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. కానీ మండల పరిధిలోని అర్కతల్ గ్రామంలో పల్లె ప్రకృతి వనం చెట్లకు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. పచ్చని చెట్లు ఆకులు రాల్చి, కొమ్మలు విరిగి కుప్పకూలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా స్కూల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ పల్లె ప్రకృతి వనానికి మొత్తం 5 లక్షల 66, 209 రూపాయల అంచనా విలువ ఉంది. కూలీల ఖర్చు 2 లక్షల 97,753 రూపాయలు, సామాగ్రి ఖర్చు 2 లక్షల 68,456 రూపాయలు. మొత్తం 1215 మానవ రోజుల పని జరిగింది. కానీ నీటి సౌకర్యం లేకుండా పోవడంతో ఈ పెట్టుబడి పూర్తిగా వృధా అవుతోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. మురుగునీరు రోడ్లపై ఏరులై పారుతోంది. వీధి దీపాలు, సీసీ రోడ్లు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సమస్యలు ఎప్పుడు పరిష్కారమవుతాయో తెలియడం లేదని గ్రామస్తులు అంటున్నారు. పంచాయతీ కార్మికులు ఉన్నప్పటికీ, వారు సొంత పనుల్లో ఎక్కువ సమయం గడుపుతున్నారని, చెట్లకు నీళ్లు పోయడం లేదని ఆరోపిస్తున్నారు. ఇక గ్రామ సర్పంచి విషయంలో గ్రామస్తుల ఆవేదన మరింత తీవ్రంగా ఉంది. సర్పంచి పల్లెను విడిచి పట్నంలో నివసిస్తున్నారని, గ్రామ సమస్యలు తీర్చడానికి రావడం లేదని విమర్శిస్తున్నారు. వచ్చే వారంలో రెండుసార్లు మాత్రమే అధికారులు పర్యవేక్షణకు వస్తున్నారని, అది కూడా సర్పంచికి ముందస్తు సమాచారం ఇచ్చిన తర్వాతే అని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచి గ్రామంలో లేకపోవడంతో ప్రజల బాధలు రోడ్డున పడుతున్నాయని అంటున్నారు.
ఎన్నికల సమయంలో గ్రామ అభివృద్ధే లక్ష్యమని, ఎన్నో హామీలు ఇచ్చి గెలిచిన సర్పంచి ఇప్పుడు గ్రామాన్ని విడిచి పట్నంలో తిరుగుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదనంగా గ్రామ కంఠంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి రేకుల షెడ్డు నిర్మించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. గత సర్పంచి ఈ స్థలాన్ని ఎవరికీ ఇవ్వలేదని, నూతన సర్పంచి కబ్జా చేయడం న్యాయమా అని ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి వద్ద సమస్యలు విన్నవించినప్పుడు సర్పంచికి చెప్పండని చేతులు దులుపుకుంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సర్పంచి స్థానికంగా గ్రామంలో ఉండి, ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసి ప్రజల సమస్యలు తీర్చాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# కార్మిక సమస్యలు పరిష్కరించడంలో గుర్తింపు సంఘం విఫలం

### ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యాక్షుడు నర్సింహారెడ్డి




**యైటింక్లయిన్ కాలనీ మార్చి 22 (జనంసాక్షి) :** సింగరేణి కార్మిక సమస్యలు పరిష్కరించడంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం పూర్తిగా విఫలమయిందని ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యాక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలుపొంది రెండున్నర సంవత్సరాలు అవుతుందని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు పరిష్కరించలేదన్నారు. స్ట్రక్చర్ సమావేశాల్లో చర్చించిన ఏ ఒక్క అంశం కూడా సర్క్యులర్ రూపంలో అమలు కాలేదన్నారు. మెడికల్ ఇన్‌వాలీడేషన్, ఇన్‌కమ్ ట్యాక్స్ మినహాయింపులు, మారుపేర్లు, స్వంతింటి కళ పథకం వంటి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. గుర్తింపు సంఘం పదవి కాలం ముగిసిందనే సాకుతో బస్సు జాత నిర్వహిస్తోందన్నారు. గుర్తింపు సంఘం చేస్తున్న మోసపూరిత రాజకీయాలను గమనించాలని, హక్కుల సాధన కోసం నిజాయితీ పోరాడే శక్తులతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. తాము ప్రాతినిధ్య సంఘంగా స్వంతిఇంటి కళ నేరవేర్చేందుకు ప్రభుత్వంతో మాట్లాడి ఇప్పిస్తామని తెలిపారు. అలాగే వారసత్వ ఉద్యోగాలను ప్రభుత్వం తీసివేయాలేదని, గుర్తింపు సంఘం యాజమాన్యంతో మాట్లాడి వచ్చే నెలన నుండి మెడికల్ బోర్డు నిర్వహించలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు బీ. శంకర్ నాయక్, పోగుల ధర్మపురి, వడ్డేపల్లి దాసు,ఎండి అక్రమ్, టైసన్ శీను, నాచగోని దశరథం గౌడ్, సాలిగామ మల్లేశ్, కొంగర రవీందర్, ఆకుల రాజయ్య, తోకల సమ్మయ్య చిలుముల అవినాష్, విజయ్, నున్న జగదీశ్, కంది శ్రీనివాస్, ప్రవీణ్, దిలీప్, నరేశ్, మధుసూదన్, వెంకటరాజం, సుదర్శన్, మహేందర్‌లు పాల్గొన్నారు.

# ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు 'ఉగాది పురస్కారాలు'

- 40 విభాగాలకు దరఖాస్తుల ఆహ్వానం
- రెండు తెలుగు రాష్ట్రాల జర్నలిస్టులకు అవకాశం
- మహిళా జర్నలిస్టులకు ప్రత్యేకంగా 5 పురస్కారాలు
- టీజేఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు



**హయత్ నగర్, మార్చి 22 ( జనం సాక్షి) :** ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తూ.. అక్షరాయుధాలతో సమాజా న్ని చైతన్యపరుస్తున్న జర్నలిస్టులను గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు పేర్కొన్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ జర్నలిస్టులకు ఉగాది పురస్కారాలు కార్యక్రమంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులైన తెలుగు జర్నలిస్టులకు పురస్కారాలు అందజేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కేవలం నిరసనలు, పోరా టాలకే పరిమితం కాకుండా, వృత్తిపరంగా జర్నలిస్టులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2023లో ఈ పురస్కారాల ప్రక్రియను ప్రారంభించామన్నారు. గత మూడేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, విజయవాడ నగరాల్లో అత్యద్భు తంగా కార్యక్రమాలను నిర్వహించామని, ఈ ఏడాది (2026) కూడా ఈ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించబోతున్నామని వివరించారు. గతంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, సుప్రీంకోర్టు పూర్వపు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ వంటి మహనీయుల చేతుల మీదుగా ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు పురస్కారాలు అందజేశామని, ఈ ఏడాది కూడా అంతే స్థాయిలో గొప్పగా నిర్వహించేందుకు ప్రయతిస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం 40 విభాగాలకు గాను 50 మంది జర్నలిస్టులకు ఉత్తమ జర్నలిస్టు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. అందులో మహిళా జర్నలిస్టులకు ప్రత్యేకంగా 5 పురస్కారాలు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు రాజకీయంగా, పాలనా పరంగా విడిపోయినా జర్నలిస్టులు మాత్రం విడిపోలేదు అని, అందుకే మేమంతా తెలుగు జర్నలిస్టులం అని గర్వంగా చెబుతున్నామన్నారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం జర్నలిస్టుల ఐక్యతకు సంక్షేమానికి కృషి చేస్తుందని, ఇటువంటి కార్యక్రమాలు ప్రతియేటా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభ కలిగిన జర్నలిస్టులను గుర్తించి, సమాజానికి మెరుగైన జర్నలిజాన్ని అందించడమే తమ సంఘం లక్ష్యమన్నారు. వృత్తి పట్ల నిబద్ధత, అంకిత భావం కలిగిన జర్నలిస్టులకు ఈ పురస్కారాలు మరింత ఉత్తేజాన్నిస్తాయని రంగనాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాస్, బోడపాటి సుబ్బారావు, హనుమంతా చారి, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గజ్జల శ్రీనివాస్, మేనం శ్యామ్, గడ్డం సత్యనారాయణ, తదితరులు ఈ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమానికి కన్వీనర్‌లుగా వ్యవహరిస్తున్నారు.

# క్రీడాకారులకు ట్రాక్ సూట్ల అందజేత

### ప్రతిభావంతులను ప్రోత్సహిస్తాం: డా. దారం రఘురామన్



**కరీంనగర్ టౌన్ మార్చి 22 (జనం సాక్షి) :** క్రీడా నేపథ్యం లేని సాధారణ కుటుంబాల నుంచి వచ్చినప్పటికీ ప్రతిభతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న హ్యాండ్‌బాల్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కరీంనగర్ బోయవాడకు చెందిన దారం సుశీల ట్రస్ట్ ముందుకు వచ్చింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రముఖ వైద్యుడు డా. దారం రఘురామన్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు ట్రాక్ సూట్లు, పర్సనల్ కిట్లు అందజేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు బెజ్జంకి రాజగోపాల్ ద్వారా ఈ క్రీడాకారుల ప్రతిభను తెలుసుకున్న డా. రఘురామన్, వెంటనే వారిని ప్రోత్సహించాలని నిర్ణయించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని గుల్లకోట గ్రామం హ్యాండ్‌బాల్ క్రీడకు ప్రసిద్ధి చెందగా, అక్కడ పనిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ శిక్షణలో అనేక మంది ప్రతిభావంతులు వెలుగులోకి వచ్చారు.
ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించిన డా. రఘురామన్, వారికి ట్రాక్ సూట్లు అందజేసి అభినందించారు.
ఈ సందర్భంగా జి. విష్ణు వర్ధన్ ఎస్జీఎఫ్ అండర్-17 విభాగంలో జాతీయ స్థాయిలో బంగారు పతకం, అండర్-19 జాతీయ ఛాంపియన్‌షిప్ (గుజరాత్)లో కూడా పాల్గొన్నారు. అరవింద్ ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జూనియర్ నేషనల్స్‌లో పాల్గొన్నారు. వి. అఖిల హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన అండర్-19 నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో, జె. తిర్సా గుజరాత్‌లో ఎస్జీఎఫ్ అండర్-17 నేషనల్స్‌తో పాటు రాజస్థాన్‌లో జరిగిన జూనియర్ నేషనల్స్‌లో పాల్గొన్నారు. బి. శ్రీజ హిమాచల్ ప్రదేశ్‌లో అండర్-19 నేషనల్‌లో పాల్గొనగా, జె. అక్షయ బెంగళూరులో జూనియర్ నేషనల్స్‌లో ప్రతిభ చాటారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ప్రదర్శన చేసి ఉన్నత స్థాయికి చేరాలని డా. రఘురామన్ ఆకాంక్షించారు.

## శ్రీ.శ్రీ భాష్యం విజయసారథి మెమోరియల్ అవార్డు ప్రదానం



**కరీంనగర్ టౌన్ మార్చి 22 (జనం సాక్షి) :** సర్వ వైదిక సంస్థానం వ్యవస్థాపకులు స్వర్గీయ శ్రీ.శ్రీ భాష్యం విజయసారథి స్మారకార్థం నిర్వహించిన మెమోరియల్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అవార్డు గ్రహీత ప్రభాకర్ శర్మను సన్మానించారు.అనంతరం భాష్యం విజయసారథి సంస్కృతంలో రచించిన సుమారు 100 గ్రంథాలను ఒకే సంపుటిగా ముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.తనకు రాజకీయ జీవితంలో ప్రేరణనిచ్చిన మహా ఆధ్యాత్మికవేత్త భాష్యం విజయసారథి అని పేర్కొన్నారు. వారి ఆశీస్సులతోనే తాను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని తెలిపారు. యజ్ఞ వరాహ క్షేత్ర అభివృద్ధి కోసం ఆయన ఎల్లప్పుడూ కృషి చేశారని గుర్తు చేశారు.ఈ ఆలయానికి వెళ్లే మార్గానికి శ్రీ భాష్యం విజయసారథి మార్గ్ గా నామకరణం చేయడం తనకు గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. అలాగే నగరంలోని శ్రీ రాజరాజేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్మించనున్న కళా వేదిక ముందు ఆయన విగ్రహం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, ఏనుగు రవీందర్ రెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం పెంచికల్ పేట గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన లో భాగంగా ఈరోజు పోచమ్మ బోనాల కార్యక్రమం లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొని అమ్మవారికి బోనం సమర్పించారు. విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా నెత్తిన బోనమెత్తుకుని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుందని, అమ్మవారి ఆశీస్సులతో మంథని ప్రాంత ప్రజలు సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఈ సందర్భంగా అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌ని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

## సుప్రీమ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**గన్నేరువరం, మర్చి 22 (జనంసాక్షి):** గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామంలో ఆదివారం కరీంనగర్ సుప్రీమ్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో సుమారు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకోవడం జరిగింది, ఇలాంటి ఉచిత శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది బిపి షుగర్, ఈసిజి, సిబిపి పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మాంకాళి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు తాడూరి వెంకటరమణారెడ్డి, వార్డు సభ్యులు అలువాల ప్రదీప్, జిర్ర ఆంజనేయులు, భూశంకర్, గుంటుక ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ప్రచారానికి ఆకర్షితులై ఇంటిపై సోలార్ పవర్ ఏర్పాటు

- గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ సర్పంచ్ మాధవి-నారాయణ కృషి



**మంథని, ( జనంసాక్షి ) :** ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తి బిజిలీ యోజన పథకం ద్వారా సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకోవడానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రచారంలో భాగంగా ఆకర్షితులై గ్రామ ప్రజలకు పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం పెంచికల్ పేట్ గ్రామ సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ ఆదర్శంగా నిలిచారు. సోలార్ ప్యానెల్ లు ఉపయోగించి మన ఇంటి మీదనే సౌర విద్యుత్ ఉత్పత్తి చేసిన ప్రక్రియను ప్రోత్సహించడంలో పెంచికల్ పేట్ గ్రామ సర్పంచ్ పల్లె మాధవి-నారాయణ కృషి చేస్తున్నారు. ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తి గురించి అవగాహన కోసం పెంచికల్ పేట్ సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రతి గృహానికి విద్యుత్ సరఫరా మెరుగవడంతో పాటు, మన్నికైన, పర్యావరణ అనుకూలమైన శక్తి ఉత్పత్తి అవుతుంది. సోలార్ ప్యానల్ ఏర్పాటు ద్వారా పర్యావరణాన్ని కాపాడటంతో పాటు విద్యుత్ అవసరాలు తీర్చే ఆదాయం సమకూర్చుకోవచ్చు అని అదేవిధంగా సూర్య శక్తిని ఉపయోగించడం వల్ల విద్యుత్ బిల్లు తగ్గడం, ప్రభుత్వ ఖర్చులు తగ్గించడం పర్యావరణం కాపాడటానికి ప్రతి ఇంటికి సోలార్ అవసరం అని.. ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి ప్రజల భాగస్వామ్యం, అవగాహన, మద్దతు అవసరం అని తెలిపారు.

### ట్రూఫిట్ జిమ్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్

**గోదావరిఖని :** స్థానిక లక్ష్మినగర్ లోనీ లోటస్ దగ్గర ట్రూఫిట్ జిమ్‌ను రామగుండం నియోజక వర్గం శాసనసభ్యులు ఎంఎస్ రాజ్ ఠాకూర్, ఆయన సతీమణి మనాలి ఠాకూర్ ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఉన్నారు

## క్రీడలతో యువతలో పోటీతత్వం, మానసిక ఉల్లాసం

### సర్పంచ్ సౌభాగ్యలక్ష్మి నాగప్ప చేతుల మీదుగా విజేతలకు బహుమతులు



**కొడంగల్, మార్చి 22 (జనంసాక్షి) :** క్రీడల ద్వారా యువకుల్లో మానసిక ఉల్లాసంతో పాటు పోటీ తత్వం పెరుగుతుందని అంగడి రాయిచూరు గ్రామ సర్పంచ్ కుమ్మరి సౌభాగ్యలక్ష్మి నాగప్ప అన్నారు. ఉగాది, రంజాన్ పర్వదినాల సందర్భంగా కొడంగల్ మండలం అంగడి రాయిచూరు గ్రామంలో ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2ను ఘనంగా నిర్వహించారు.
ఈ టోర్నమెంట్‌లో రైసింగ్ చాలెంజర్స్ ఎఆర్ జట్టు విజేతగా నిలిచింది. సర్పంచ్ కుమ్మరి సౌభాగ్యలక్ష్మి నాగప్ప ఈ జట్టుకు రూ.15,000 బహుమతి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన ఎఆర్ ఛాంపియన్ చేజర్స్ జట్టుకు ఉప సర్పంచ్ కూర్వ శ్యామమ్మ బాలప్ప చేతుల మీదుగా రూ.7,500 బహుమతి అందించారు. కార్యక్రమంలో బి. రాములు, ప్రతాప్ రెడ్డి, శేఖర్ గౌడ్, పకిరప్ప, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజేతలను అభినందించారు. ఈ టోర్నమెంట్ గ్రామ యువతలో క్రీడా ఉత్సాహాన్ని మరింత పెంచిందని, సామరస్యంతో క్రీడలు ఆడటం ద్వారా సామాజిక ఐక్యత బలపడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# బడుగు బలహీనవర్గాలకు.. రైతులకు మేలు చేసే బడ్జెట్

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్, బడుగు బలహీన వర్గాలకు రైతన్నలకు మేలు చేసే బడ్జెట్ అని షాద్ నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు ఆదివారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక విద్య వైద్యానికి పెద్దపీట వేస్తుందని మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నమని పేద విద్యార్థుల ఆకలి తీర్చేందుకు కృషి చేస్తున్నామని వసతి గృహాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామని అన్నారు గత పాలకులు పదేళ్ల కాలం పాటు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని విద్యా వైద్యం పేదలకు అందలేకపోయిందని రైతన్నలకు తీవ్ర అన్యాయం చేశారని కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ విద్యా వైద్యంతో పాటు రైతులకు మేలు చేసే విధంగా బడ్జెట్ ను ప్రవేశపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు గత పాలకులు రాష్ట్రాన్ని అభాసుపాలు చేశారని పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చాక రాజ్యాంగానికి లోబడి ప్రజాపాలన చేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు ఓవైపు సమస్యలు మరోవైపు అప్పులు ఆ అప్పులకు మిత్తులు కట్టుకుంటూనే రైతులకు రుణమాఫీ రైతు భరోసా కూడా కల్పిస్తున్నామని అన్నారు నాడు బంగారు తెలంగాణ అని చెప్పుకున్నారని పదేళ్ల తర్వాత బంగారు తెలంగాణ అయి ఉంటే ప్రజలు ఇంకా సమస్యలతో సతమతమవుతున్నారని ప్రజలకు ఇచ్చిన హామీలను తాము నెరవేరుస్తున్నామని నీటి ప్రాజెక్టులతో పాటు రైతాంగానికి అవసరమయ్యే సౌకర్యాలను పూర్తిగా కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు రెండున్నర సంవత్సరాలలో ఇంత అభివృద్ధి చేస్తుంటే బిఆర్ఎస్ నేతల కళ్ళు ఓర్వలేకపోతున్నాయని పదేళ్ల పాటు రాష్ట్రాన్ని డ్రగ్స్ గంజాయి రాష్ట్రంగా మార్చారని వారి ఎమ్మెల్యేలు డ్రగ్స్ తీసుకుంటూ దొరికిపోతున్నరని వారి పనితీరు ఏమిటో వారికి అర్థం కావాలన్నారు తాము వాటి నివారణకు తీవ్రస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు..

### ఓబిసి విభాగం చైర్మన్‌గా
## వీర్లపల్లి శంకర్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి) :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబిసి విభాగం చైర్మన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌ను కాంగ్రెస్ పార్టీ నియమించింది నేడు గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబిసి విభాగం భాగం చైర్మన్‌గా వీర్లపల్లి శంకర్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు తనను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబిసి విభాగం చైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ అధినేతలకు ధన్యవాదాలు తెలియజేశారు..



# సైబరాబాద్‌లో వీకెండ్ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్

- వివిధ ప్రాంతాలలో మొత్తం 173 మందిపై కేసు నమోదు



శేరిలింగంపల్లి, మార్చి 22: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున వరకు వీకెండ్ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరిగాయి. ట్రాఫిక్ విభాగం డీసీపీ రంజన్ రతన్ కుమార్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా చెకింగ్ చేపట్టారు. వివిధ ప్రాంతాల్లో వాహనదారులపై బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా.. మొత్తం 173 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. వీరందరిపై కేసులు నమోదు చేశారు.
ఈ కేసుల్లో 138 మంది ద్విచక్ర వాహనదారులు, 10 మంది ఆటో డ్రైవర్లు, 22 మంది కార్లు నడిపినవారు, 3 మంది భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. వీరందరినీ ఆయా ప్రాంతాల వారీగా అదుపులోకి తీసుకుని, కోర్టుకు హాజరుపర్చనున్నట్లు డీసీపీ రంజన్ రతన్ కుమార్ మీడియాకు తెలిపారు.
మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదాలకు కారణమైతే.. భారతీయ న్యాయ సంహిత 2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నేరానికి గరిష్టంగా 10 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. గత వారం మొత్తం 358 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను కోర్టులు పరిష్కరించాయని, వీరిలో 10 మందికి జరిమానా తో పాటు జైలు శిక్ష, 2 మందికి జరిమానా, సోషల్ సర్వీస్, మిగిలిన 356 మందికి జరిమానా విధించినట్లు డీసీపీ వెల్లడించారు.
రోడ్లపై మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిని అరికట్టడంలో ట్రాఫిక్ పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీసీపీ పిలుపునిచ్చారు.

# జల సంరక్షణ కోసం నడుంబిగించాలి

- నీటి ఎద్దడి శాశ్వత నివారణ చర్యలు ప్రజల చేతుల్లోనే
- వర్షపు నీరును ఒడిసి పట్టండి... ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత ఏర్పాటు చేయండి.
- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




కరీంనగర్ బ్యూరో, మార్చి 22 (జనంసాక్షి) :
వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటి పోయే పరిస్థితులు ఉన్నాయని, జల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలని, నీటి ఎద్దడి శాశ్వత నివారణ జల సంరక్షణతోనే సాధ్యమని, నీటిని సంరక్షించే బాధ్యత ప్రజల చేతుల్లోనే ఉందని నగర పాలక సంస్థ మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రోజు స్థానిక వైశ్య భవన్ లో మానేరు పర్యావరణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా సుజలాం సుఫలాం అనే గోడ ప్రతులని ఆవిష్కరించి మాట్లాడారు. ఎండాకాలం త్రాగు నీరు లేక ఎంతోమందిప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో వాన నీరు వృధాగా పోతున్న దానిని ఒడిసిపట్టుకోవాలనే ఆలోచన చేయకపోవడంతోనే, నేడు ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. నగరంలో ప్రతి ఒక్కరు తమ ఇంటిలో కచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలని అన్నారు. వ్యవసాయ భూముల్లో ఇంకుడు గుంతలు ఉంటే సాగునీరుకు ఇబ్బందులు ఉండవన్నారు. మానేరు పర్యావరణ సమితి అధ్యక్షులు తోట లక్ష్మణ రావు మాట్లాడుతూ... పొలాలలో ఎండిపోయిన బోరు భావి చుట్టు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవచ్చునని, గుట్టల చుట్టు, బీడు భూముల చుట్టు కాంటూరు కంధకాలు త్రావ్వుకోవాలని, ప్రతి గ్రామం లో వాగుకు అడ్డంగా వాటర్ షెడ్ ప్రాజెక్ట్ నిర్మాణం చేసుకోవటం వలన భూగర్భ జలాలు పెరిగి నీటి కొరత తీరు తుందన్నారు. సర్వో దయ అధ్యక్షులు పెద్ది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... కలుషిత నీరు త్రాగడం వలన లక్షలాది మంది ప్రజలు రోగాల భారిన పడుతున్నారని, చాలా మంది చిన్న పిల్లలు చనిపోతున్నారని, జలవనరులు కలుషితం కాకుండా కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో 66 వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్, మానేరు పర్యావరణ సమితి బాధ్యులు గంజి స్వరాజ్యబాబు, సామ నారాయణ, కొమురవెల్లి వెంకటేశం, గంగిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ ఏర్పాటును విరమించుకోవాలి

## బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడవెల్లి కొండల్ రెడ్డి



హుజురాబాద్, మార్చి 21 (జనం సాక్షి ): హుజురాబాద్ మండలం సిర్సపల్లి శివారులో నిర్మించబోయే డంపింగ్ యార్డ్, విద్యుత్ ఉత్పత్తి కర్మాగార ఏర్పాటును తక్షణమే విరమించుకోవాలని బిఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడవెల్లి కొండల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని హుజురాబాద్ క్లబ్ పంక్షన్ హాల్లో పర్యావరణానికి హాని కలిగించే ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అఖిల పక్షాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కొండల్ రెడ్డి మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టు వల్ల సిర్సపల్లితో పాటు చుట్టుపక్కల పది గ్రామాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో పాటు అనేక రకాల అనారోగ్య సమస్యలకు లోనయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత రైతులు వ్యవసాయ భూములు నష్టపోయే అవకాశం ఉందని, భూసారం తగ్గి పంటల దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. ప్రాజెక్టును తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు.



# అధికారుల నిర్లక్ష్యం

## బోర్డుపై మారని పాత జిల్లా పేరు

బొంరాస్ పేట, (జనం సాక్షి):
మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య భవనం ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిధిలో ఉన్నప్పటికీ అక్కడ ఉన్న బోర్డుపై మాత్రం ఇంకా పాత మహబూబ్నగర్ జిల్లా పేరే దర్శనమిస్తోంది. జిల్లాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా కార్యాలయ బోర్డులపై రాతలు మారడం లేదని ప్రజలు వాపోతున్నారు. కార్యాలయానికి వెళ్లిన ప్రజలు ఇదేమి సారూ ఇంకా మహబూబ్నగర్ జిల్లాలోనే ఉన్నామా అని వాపోతున్నారు. ఇప్పటికైనా బోర్డుపై జిల్లా పేరు మార్చాలని కోరుతున్నారు.

# యువతను పెడతోవ పట్టిస్తున్నవారు.. నాయకులే

## బీఆర్ఎస్ పాలనలో డ్రగ్స్ ప్రభావిత రాష్ట్రంగా మారింది : టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్



మొయినాబాద్, మార్చి 22 (జనంసాక్షి) :
తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారిగా మారి యువతను పెడతోవ పట్టిస్తు న్నారని, దీనికి మార్గనిర్దేశకులుగా ఉన్నవారే కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులేనని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్ తీవ్రంగా విమర్శించారు. డ్రగ్స్ వ్యసనానికి పాల్పడిన యువత అనారోగ్యాలతో పాటు కుటుంబ సభ్యులను కూడా మరచిపోతున్నారని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఆయన అన్నారు. ఆదివారం తోల్కట్ట గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన గౌరీసతీష్, మొయినాబాద్ డ్రగ్స్ కలకలం ఎంతో బాధ కలిగిస్తోందని పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను డ్రగ్స్ ప్రభావిత రాష్ట్రంగా మార్చే శారని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డ్రగ్స్ మాఫియాను ఉక్కుపాదంతో అణచివేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.
ఏ పార్టీకి చెందినవారైనా, ఎంత పెద్ద నాయకులైనా డ్రగ్స్ వ్యవహారంలో ఒకే చట్టం వర్తిస్తుందని, ఎవరినీ ఉపేక్షించేది లేదని గౌరీసతీష్ స్పష్టం చేశారు. మొయినాబాద్ సంఘటనపై జరుగుతున్న చర్యలు రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తున్నాయని, ఈ కోణంలో ప్రభుత్వం ముందుచూపుతో అక్రమ కార్యకలాపాలను అణచివేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



# యదేచ్ఛగా అక్రమ నిర్మాణం

ఆర్మూర్,మార్చి 22 (జనంసాక్షి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో నివాసిత, వాణిజ్య భవన అక్రమ నిర్మాణాలను ఇష్టానుసారంగా నిర్మించుకుంటున్నారు. భవన అనుమతుల సమయంలో తీసుకునే ప్లాన్‌కు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను యదేచ్ఛగా నిర్మాణం చేసుకుంటున్నారు. మున్సిపల్ పరిధి లోని పదవ వార్డులో కెనాల్‌కు చేరువలో నివాసిత గృహానికి పర్మిషన్ తీసుకొని వాణిజ్య భవనాన్ని నిర్మిస్తున్నారు.ప్రశ్నించే వరకు చూద్దామనే ధోరణిలో నిర్మిస్తూ నిబంధనలు భవన నిర్మాణదారులు ఉల్లంఘిస్తున్నారు. అనుమతికి విరుద్ధంగా అక్రమ నిర్మాణం పనులు చకచక జరుగుతున్నాయి. అనుమతులు తీసుకున్న తర్వాత నిర్మాణాలు పరిశీలించక పోవడం తోనే అసలు సమస్యకు కారణంగా తెలుస్తుంది. నిబంధనలు ఉల్లంఘించడం, సెట్ బ్యాక్ లేకపోవడం, మెట్లు బయటకు రావడం, రోడ్డు ఆక్రమించ డం వంటివి పట్టణ ప్రణాళిక విభాగానికి కనిపించడం లేదు. ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. మున్సిపల్ అధికారులు ఇకనైనా ఇలాంటి నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.



# ప్రైవేట్ బిల్లుకు ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వాలి

## రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జనంసాక్షి : టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రవేశపెట్టనున్న ప్రైవేట్ బిల్లుపై ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చందర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిందని, ఆ హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి లేదని పేర్కొన్నారు. అభయాస్త హామీ, 420 గ్యారంటీల అమలుకు టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే ప్రవేట్ బిల్లుకు పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు మద్దతు పలకాలని చందర్ కోరారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తామని రేవంత్ రెడ్డి మొదట సంతకం చేశారని తెలిపారు. 420 గ్యారంటీ హామీలకు చట్టబద్ధత కల్పించాలని, తద్వారా ప్రతి ఒక్కరికి లాభం చేకూరుతుందని చందర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 800 రోజులు గడిచిన ఇప్పటివరకు ఏ ఒక్క హామీని నెరవేర్చని ప్రభుత్వం కాంగ్రెస్ అని పేర్కొన్నారు. దళితులకు అభయాసం, విద్యార్థులకు స్కూటీలు, మహిళలకు గృహలక్ష్మి కింద 2500, వృద్ధులకు 4000 పెన్షన్ వీటన్నిటికీ చట్టబద్ధత కల్పించినట్టయితే ప్రతి ఒక్కరికి లాభం జరుగుతుందని చందర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఊరుకునేది లేదని ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో టిఆర్ఎస్ నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, గోపు ఐలయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# కలిసి అభివృద్ధి చేసుకుందాం

## రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్



గంభీరావుపేట మార్చి 22 (జనంసాక్షి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్ రంజాన్ పర్వదినానికి స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా వారిని గ్రామ ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి కలిసి ఇటీవల పెద్దమ్మ స్టేజి వద్ద ఎక్స్ ప్రెస్ స్టాప్ ఏర్పాటు చేయాలని తెలుపగా తక్షణమే స్పందించి స్టాప్ ఏర్పాటుకు కృషి చేసినందుకు తోటి వార్డు సభ్యులతో కలిసి శాలువాతో సన్మానించారు అనంతరం గ్రామంలోని మొత్తం 16 వార్డుల అభివృద్ధికి ఒక్కో వార్డుకు 10 లక్షల రూపాయల నిధులు అందించేలా చూడాలని వార్డు సభ్యులు వినతి పత్రం అందించారు అజ్మతుల్లా హుస్సేన్ మాట్లాడుతూ రాజకీయాలకు పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి ఐక్యమత్యంగా ఉండాలని గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమాలు అయినా నాదృష్టికి తీసుకురావాలని... పుట్టిన ఊరును పెరిగిన గ్రామాన్ని ఎన్నటికీ మర్చిపోనని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని మధ్య వర్తిత్వానికితావు లేకుండా మీకు ఏ పని ఉన్న నాకు నేరుగా సమస్యను తెలియజేయాలని అవసరమైతే హైదరాబాద్ లోని తన ఆఫీసుకు వచ్చి మీ పనులు చేసుకోవచ్చని తెలిపారు. వార్డు సభ్యులు గ్రామంలోని పాలిటెక్నిక్ కళాశాల, 50 పడకల ఆసుపత్రి పీజీలో కొత్త కోర్సులు చేర్చుట రోడ్డు వెడల్పు కార్యక్రమం గంభీరావుపేట లింగన్నపేట మధ్య గల బ్రిడ్జి, మినీ స్టేడియం పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించా రు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రెడ్డిమల్ల రాజనర్సు, పిట్ల శ్రీమతి, చిలుక ప్రశాంత్, ఎగదండి అర్జున్, గొల్ల సుశాంతిక, అక్క పెల్లి శిరీష, వీరబోయిన శ్రావణి, నాయకులు అక్కపల్లి బాలయ్య, హమీర్ పాల్గొన్నారు.

# నిమ్స్‌లో ఘనంగా పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ సదస్సు

- రేడియాలజీ సేవల ప్రాధాన్యతను డైరెక్టర్ డా. నగరి బీరప్ప వివరించారు
- శిరందాస్ శ్రీనివాస్‌కు కాకర్ల జీవిత సాఫల్య అవార్డు ప్రకటన



ఖైరతాబాద్, మార్చి 22 జనంసాక్షి : పంజాగుట్టలోని నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ట్రామా ఆడిటోరియంలో పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ సదస్సు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిమ్స్ డైరెక్టర్ డా. నగరి బీరప్ప హాజరై, రేడియాలజీ సేవల ప్రాధాన్యతను వివరించారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లోని నాలుగు తెలంగాణ ప్రభుత్వ వైద్య విద్యా సంస్థల ద్వారా టీఎంఎస్‌తో 4000 పడకలు, నిమ్స్‌లో అదనంగా 2000 పడకలు, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, కాకతీయ హాస్పిటల్‌ల్లో మరో 3000 పడకలు అందుబాటులోకి రానున్నాయని డా. బీరప్ప తెలిపారు. దీంతో వైద్య రంగంలో ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు తెలుగు రాష్ట్రాల్లో ఆధునిక వైద్య విధానాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడుతూ, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ చాప్టర్ ప్రతి సంవత్సరం జాతీయ సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తోందని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి కాకర్ల జీవిత సాఫల్య అవార్డును నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్‌కు ప్రకటించారు. మూడు దశాబ్దాల సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీనియర్ ప్రొఫెసర్ డా. ఎస్. రామ్మూర్తి మాట్లాడుతూ రేడియాలజీ విభాగం ఆధునిక సాంకేతికతతో రోగ నిర్ధారణలో కీలక పాత్ర పోషిస్తోందని, ఇలాంటి సదస్సులు సాంకేతిక నిపుణుల నైపుణ్యాలను మెరుగుపరుస్తాయని అన్నారు. ట్రస్ట్ ప్రతినిధి డా. ఎన్. కవితా రెడ్డి శ్రీనివాస్ కృషిని ప్రశంసిస్తూ, ఆయన గురు-శిష్య సంబంధానికి ఇది ప్రతీక అని తెలిపారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ జాతీయ అధ్యక్షుడు శంకర్ కె. భగత్ మాట్లాడుతూ వైద్య అనుబంధ వృత్తుల జాతీయ కమిషన్ ఏర్పాటులో శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఉత్తమ పరిశోధన పత్రం అవార్డును చెన్నైలోని శ్రీ రామచంద్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కు చెందిన విద్యార్థి చెరుకూరి ధనుష్ అందుకున్నారు. అవార్డు కింద నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు.

# 41వ డివిజన్ ప్రధాన నాలా పునర్నిర్మించండి

- మేయర్‌కు సిపిఐ కార్పొరేటర్ సూర్య విజ్ఞప్తి
- పాత నాలా దెబ్బతిని ఇళ్ల పునాదులకు ముప్పు
- మేయర్ సానుకూల స్పందన.. డివిజన్ పర్యటన హామీ



గోదావరిఖని, మార్చి 22 (జనంసాక్షి) : రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని, ప్రధాన నాలా పునర్నిర్మాణం సహ వివిధ అభివృద్ధి పనులకు రాబోయే బడ్జెట్ సమావేశంలో నిధులు కేటాయించాలని సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామిని కలిసి విజ్ఞప్తి చేశారు. 41వ డివిజన్‌లోని ప్రధాన నాలా దాదాపు ఒకటిన్నర కిలోమీటర్ల పొడవుతో ఇళ్ల మధ్యలో ప్రవహిస్తోందని, వరదలు వచ్చినప్పుడల్లా దుర్వాసన, కలుషిత నీరు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సూర్య వివరించారు. మొన్నటి ప్రజా పాలనలో ఈ నాలా శుద్ధి చేసే అవకాశం రాకపోవడంతో మేయర్ ప్రత్యేక శ్రద్ధ చూపి శానిటేషన్ విభాగానికి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ నాలా అనేక చోట్ల మూలమలుపుల్లో దెబ్బతిని, సమీపంలోని ఇళ్ల పునాదులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని సూర్య ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని పూర్తిగా పునర్నిర్మించాలని డిమాండ్ చేశా రు. అలాగే ప్రధాన నాలాకు కనెక్టింగ్‌గా ఉన్న చిన్న కాలువలు, డ్రైనేజీలను కూడా నిర్మించాల్సిన అవసరం ఉందని, వాటిపై దృష్టి పెట్టాలని మేయర్‌ను కోరారు.
అదనంగా 41వ డివిజన్‌లో ఖాళీ స్థలం ఉండటంతో అక్కడ 150-200 కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించా లని సూర్య సూచించారు. ఈ విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన మేయర్ మహంకాళి స్వామి 41వ డివిజన్‌కు పర్యటనకు వస్తానని, కార్పొరేటర్ అడిగిన పనులను చేపట్టడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు.

# అల్ఫోర్స్‌లో విద్యార్థులకు నైతిక విలువల పట్ల అవగాహన సదస్సు

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి




కరీంనగర్ బ్యూరో, మార్చి 22 (జనంసాక్షి) :
విద్యార్థులకు విజయంతో పాటు నైతిక విలువల పట్ల ఆసక్తి ఉండాలని, తరగతి గదిలో నేర్చుకున్నటువంటి నైతిక విలువలను ప్రతినిత్యం పరిరక్షించాలని తద్వారా వారికి సమాజంలో తగిన గుర్తింపే కాకుండా వివిధ అవకాశాలు వస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి, ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు శ్రీదేవి, డాక్టర్ సంగీత రెడ్డి, డాక్టర్ వనజా నరేందర్ రెడ్డి, యోగా గురువు లక్ష్మణ్, సంస్కృతం అధ్యాపకురాలు అరుణలతో కలిసి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో సుపథాం వారితో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేసినటు వంటి వ్యక్తిత్వ వికాసం అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నైతిక విలువల పట్ల అవగాహన కల్పించుటనే కాకుండా వాటిని అమలుపర్చే విధానాలను సైతం వారికి తెలియపరచాలని చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థుల్లో నైతిక విలువల పట్ల ఆసక్తిని పెంపొందించడానికి, వాటి ప్రాముఖ్యతను తెలియపరచడానికై ఈ విద్యాసంవత్సరం నుండి భగవద్గీత శ్లోకాల పఠనం, సంగీతం, సంస్కృతం శిక్షణ నిపుణులచే ఇప్పించడం జరుగుతుందని వారు తెలిపారు. ప్రతి విద్యార్థికి ఇవి చాలా అవసరమని తెలుపుతూ వీటిని నేర్చుకోవడం ద్వారా సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు వస్తుందని, చాలామంది విద్యార్థులు నేడు భగవద్గీత శ్లోకాల పఠనం పట్ల ప్రత్యేక శ్రద్ధ హిస్తున్నారని వారు తెలిపారు. 4 నుండి 8వ తరగతి విద్యార్థులకు ప్రతి ఆదివారం మే 15 వరకు కొనసాగుతుందని, ఆసక్తిగలవారు ఈ కార్యక్రమంలో పాల్గొని సామాజిక అవగాహనను పెంపొందించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ బస్సుల జిసిసి విధానంతో ఆర్టీసీపై ఆర్థిక భారం

- ప్రైవేట్ కంపెనీలకు భారీ చెల్లింపులు, ఆర్టీసీకి ఏమీ లాభం లేదు
- కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది, పే స్కేల్స్ అమలు లేదు
- జిసిసి రద్దు చేసి ఆర్టీసీకి ప్రాధాన్యం ఇవ్వాలి : సిఐటియు డిమాండ్



కరీంనగర్ టౌన్ మార్చి 22 ( జనం సాక్షి) :
విద్యుత్ బస్సుల అమలు విధానం ఆర్టీసీపై, ప్రజలపై, కార్మికులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతోందని సిఐటియు నాయకులు ఆరోపించారు. 2019 మోటార్ వెహికల్స్ యాక్ట్ సవరణలు, కేంద్ర విద్యుత్ బస్సుల విధానం ద్వారా రాష్ట్రాల హక్కులను కేంద్ర ప్రభుత్వం హరించిందని విమర్శించారు. కేంద్రం అమలు చేస్తున్న అన్ని విద్యుత్ బస్సుల పథకాలు గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జిసిసి) విధానంలోనే ఉన్నాయని, ఇందులో బస్సుల కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్ మొత్తం ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల చేతుల్లో ఉంటుందని తెలిపారు. ఆర్టీసీకి కేవలం రూట్ల నిర్ణయం మాత్రమే మిగులుతుందని, బస్సులు నడిచినా నడవకపోయినా ప్రతి నెలా ప్రైవేట్ కంపెనీలకు చెల్లింపులు చేయాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కరీంనగర్-2 డిపోలో నడుస్తున్న విద్యుత్ బస్సులకు జిసిసి విధానంలో కిలోమీటరుకు రూ.39.80 చెల్లిస్తున్నారని, ప్రతి సంవత్సరం 2 శాతం పెంపు ఒప్పందంలో ఉందని వెల్లడించారు. దీంతో మొత్తం కిలోమీటరు ఖర్చు రూ.54.80కి చేరుతోందని పేర్కొన్నారు. ప్రయాణికులపై కూడా అదనపు ఛార్జీలు విధిస్తున్నారని, 100 కిలోమీటర్ల లోపు రూ.10, ఆపై రూ.20 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు విద్యుత్ బస్సుల పథకాల కోసం కేంద్రం భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ, ఆర్టీసీలకు నేరుగా ఎటువంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు. ఆర్టీసీలో కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిందని, 2019లో 49,700 మంది ఉండగా, 2025 డిసెంబర్ నాటికి 38,535 మందికి పడిపోయిందని తెలిపారు. అదనంగా సుమారు 10,000 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని వివరించారు. 2021, 2025 పే స్కేల్స్ ప్రకటించకపోవడం, 2017 పే స్కేలు అరియర్స్ చెల్లించకపోవడం వంటి సమస్యలు కార్మికులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి ఆర్టీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, జిసిసి విధానాన్ని రద్దు చేయాలని, ప్రైవేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీలను ఆర్టీసీలకే అందించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఆర్టీసీ స్వయంగా విద్యుత్ బస్సులు కొనుగోలు చేసి నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్, సహాయ కార్యదర్శి పున్నం రవి, కోశాధికారి జి. రాజేశం, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ నాయకులు జి. శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు ఏ. రామ్మోహన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకుడు పి. మల్లయ్య, రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ నాయకుడు సిహెచ్. భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
23 మార్చి 2026

# కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం



- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసమని.. రాష్ట్రంలో ఆ పార్టీ బరితెగించిందని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీసీ వర్గాలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం తప్ప చేసిందదేమీ లేదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీల ఓట్లతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. అయినప్పటికీ బడ్జెట్‌లో వృత్తి కులాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బీసీల్లో ఎక్కువ మంది వృత్తి కులాలపై ఆధారపడి బతుకుతున్నారని తెలిపారు. ఏటా బీసీలకు 20 వేల కోట్ల బడ్జెట్ అన్నారని.. ఇప్పటివరకు రూ.5 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని ఆరోపించారు. ముదిరాజ్‌లను బీసీ ఏలో చేరుస్తామని చెప్పారని.. ఇప్పటివరకు ఏమైందో తెలియదన్నారు. బీసీలకు ఆత్మ గౌరవ భవనాలకు రూ.10 వేల కోట్ల విలువైన స్థలాలు కేసీఆర్ కేటాయించారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో విద్య, ఉద్యోగాల్లో బీసీల ప్రస్తావన లేదని.. ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, నిధుల ఊసే లేకుండా పోయిందని అన్నారు. బీసీలకు కనీసం నామినేటెడ్ పదవులు సైతం ఇవ్వడం లేదన్నారు. బీసీ సబ్ ప్లాన్ ఎక్కడికి పోయిందని నిలదీశారు. ప్రజలను నట్టేట ముంచడంలో కాంగ్రెస్ పార్టీ దేశానికి రోల్ మోడల్ అని విమర్శించారు. ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళనలు ఎవరికి కావాలని.. వీటితో బీసీలకు న్యాయం జరుగుతుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని బీసీ సమాజం క్షమించదని.. భవిష్యత్తులో నామరూపాలు లేకుండా చేస్తారని హెచ్చరించారు.

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో హైడ్రామా




**కరీంనగర్ (జనంసాక్షి) :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా హైడ్రామా నడుస్తోంది. సీనియర్ నేత, మాజీ మంత్రి టీ.జీవన్ రెడ్డి పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి గంటలు గడవకముందే, జగిత్యాలలోని ఆయన నివాసం వద్ద వెలసిన ఒక ఆసక్తికర పోస్టర్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జీవన్ రెడ్డి అభిమానులు, అనుచరులు ఆయన ఇంటి గోడలపై అంటించిన ఈ పోస్టర్ అందరినీ ఆకర్షిస్తోంది. ఇందులో ఒకవైపు సూపర్ స్టార్ రజనీకాంత్, మరోవైపు జీవన్ రెడ్డి ఫొటోలు ఉన్నాయి. వాటి మధ్యలో రజనీకాంత్ ఫేమస్ డైలాగ్.. "నేను ఒక్కసారి చెబితే వందసార్లు చెప్పినట్టే!" అని రాసి ఉండటం విశేషం. ఈ పోస్టర్ ద్వారా అనుచరులు పరోక్షంగా ఒక సందేశాన్ని ఇస్తున్నట్లు తెలుస్తోంది. జీవన్ రెడ్డి ఒకసారి రాజీనామా నిర్ణయం తీసుకున్నారంటే, ఇక వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, ఆయన మాట మీద నిలబడే వ్యక్తి అని చాటిచెప్పే ప్రయత్నం చేశారు.

40 ఏళ్లుగా కాంగ్రెస్ జెండా మోసిన జీవన్ రెడ్డి, పార్టీని వీడుతున్నారన్న వార్త కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. నిన్నటి వరకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన తన నిర్ణయానికే మొగ్గు చూపారు. తాజాగా వెలసిన ఈ పోస్టర్లు చూస్తుంటే, జీవన్ రెడ్డి మనసు మార్చుకునే అవకాశం లేదని, ఆయన 'తగ్గేదేలే' అంటున్నారని క్లియర్‌గా అర్థమవుతోంది. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత పార్టీని వీడటం కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ. మరి ఈ సంక్షోభాన్ని అధిష్ఠానం ఎలా ఎదుర్కొంటుంది?. పీసీసీ చీఫ్ లేదా స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగి ఆయనను శాంతింపజేస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది.

# అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులోకి..



- వేగం, ఖచ్చితత్వంతో వేగంగా రోగ నిర్ధారణ
- నిమ్స్ డైరెక్టర్ డా.నగరి బీరప్ప

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రోగ నిర్ధారణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఎన్నో అధునాతన యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, రోగ నిర్ధారణ ఖచ్చితత్వం, వేగం పెరగడం వల్ల రోగికి అతి త్వరలో వైద్య చికిత్స అందుతుందని నిమ్స్ డైరెక్టర్ డా.నగరి బీరప్ప అన్నారు. పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ సదస్సు నిమ్స్ ట్రామా ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిమ్స్ దేశంలోనే స్టేట్ ఆఫ్ ఆర్ట్ యంత్ర పరికరాలతో అత్యున్నత సేవలు అందిస్తుందని తెలిపారు. సంస్థలో రేడియాలజీలో డిజిటల్ ఎక్స్‌రే మెషీన్లు, మల్టీ డిటెక్టర్ సిటీ, ఎంఆర్ఐ, మామోగ్రఫీ, డెక్సా స్కాన్, సీఆర్మ్‌లు, ఆల్ట్రాసౌండ్ మెషీన్లు, అధునాతన డీఎస్ఏ లాబ్ అందుబాటులో ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో నాలుగు తెలంగాణ ప్రభుత్వ వైద్య విద్యా సంస్థలు (౧×మీా) ఏర్పాటుతో 4000 బెడ్స్ అందుబాటులోకి రానున్నాయి. నిమ్స్‌లో అదనంగా 2000 బెడ్స్, ఉస్మానియా, కాకతీయ ఆసుపత్రుల్లో మరో 3000 బెడ్స్ తో వైద్య అనుబంధ ప్రొఫెషనల్స్‌కి ఎన్నో ఉద్యోగాలు రానున్నాయని అభిప్రాయపడ్డారు. కాకర్ల సుబ్బారావు తెలుగు రాష్ట్రాల్లో ఆధునిక వైద్య విధానాన్ని, ప్రభుత్వ రంగంలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను విస్తరించడానికి ఆయన చేసిన కృషి అమోఘం, ఆయన కృషిని సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ చాప్టర్ ముందుకు తీసుకెళ్తుందన్నారు. కాకర్ల శత జయంతి సందర్భంగా జీవిత సాఫల్య అవార్డును నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్, రేడియాలజీ ఇమేజింగ్/థెరప్యూటిక్ ప్రొఫెషనల్స్ జాతీయ మండలి అధ్యక్షుడు శిరందాస్ శ్రీనివాస్ కి అవార్డును ప్రకటించడం గర్వకారణం అన్నారు. శ్రీనివాస్ ఆ అవార్డుకు అన్ని విధాలా అర్హుడని పేర్కొన్నారు. ప్రస్తుతం రేడియాలజీ విభాగం ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకొని రోగ నిర్ధారణలో కీలక భూమిక పోషిస్తుందని రేడియాలజీ విభాగం అధిపతి డా.ఎస్.రామ్మూర్తి చెప్పారు. వివిధ రకాల యంత్ర పరికరాలు వాటిని రోగ నిర్ధారణకు ఉపయోగించడానికి సాంకేతిక నిపుణులు ఎప్పటికప్పుడు వారు అప్డేట్ కావడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగ పడతాయని, అందుకు కృషి చేస్తున్న సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ కృషి అభినందనీయమన్నారు. అందులో కీలక భూమిక పోషిస్తున్న శ్రీనివాస్, దామోదర నాయుడు కృషి అభినందనీయమన్నారు. కాకర్ల సుబ్బారావు రేడియాలజీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధి డా.ఎన్.కవితారెడ్డి మాట్లాడుతూ.. శ్రీనివాస్ ఈ అవార్డుకు అన్ని విధాల అర్హుడు అని, గత ముప్పై ఏండ్లుగా ఆయన కృషికి ఇది గుర్తింపుగా కొనియాడారు. సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ జాతీయ అధ్యక్షులు శంకర్ కె భగత్ మాట్లాడుతూ.. జాతీయ కౌన్సిల్ ఏర్పాటుకు తాము గత నలభై ఏండ్లుగా పోరాడుతున్నామన్నారు. నలభై ఏండ్ల జాతీయ కమిషన్ కల నేడు నెరవేరడమే కాకుండా రేడియాలజీ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడిగా తమ సంస్థ సీఈఓ శిరందాస్ శ్రీనివాస్ ను కేంద్ర ప్రభుత్వం నియమించడం గర్వ కారణంగా చెప్పారు. కార్యక్రమంలో సర్ చైర్మన్ కే మునిరత్నం, అకడమిక్ డైరెక్టర్, కెఎస్ఆర్ జాతీయ సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ కే. దామోదర నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం.ఏ. వారిస్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మహేష్ బసవేని పాల్గొన్నారు. సదస్సులో దేశం నలు మూలల నుంచి మూడు వందల మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఉత్తమ పరిశోధన పత్రం అవార్డును శ్రీ రామచంద్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ కు చెందిన విద్యార్థి చెరుకూరి ధనుష్ అందుకున్నారు. ఈ అవార్డ్ కింద నగదు, ప్రశంసా పత్రం ఇచ్చారు.

## తల్లి రుణం తీర్చుకునేందుకు

# బీసీ బుద్ధిజీవులు కదలాలి

**బీసీ కులవృత్తుల దీర్ఘకవితల సదస్సులో జూలూరు గౌరీశంకర్**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'ఇది బీసీల విముక్తి సమయం, ఇది బీసీ యుగం, ఐక్యంగా కదిలితేనే సామాజిక న్యాయం సాధ్యం' అని బహుజన ఉద్యమకవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్ చెప్పారు. బీసీలలో కదలిక వచ్చిందని, దాన్ని సామూహిక శక్తిగా మార్చేపని బీసీ సాహిత్యకారులు బీసీ బుద్ధిజీవులపైననే ఉందన్నారు. బీసీలకు సామాజిక న్యాయం కోసం బీసీ సాహిత్య కారులు కదలటమంటే అది తల్లి రుణం తీర్చుకోవటం లాంటిదని భావోద్వేగంతో మాట్లాడారు. బీసీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రఖ్యాత సాహిత్య విమర్శకుడు సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం రవీంద్రభారతిలో జరిగిన 'బీసీ కులవృత్తుల దీర్ఘకవితలు' సదస్సు ప్రారంభ సభకు జూలూరు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులవృత్తి సాహిత్యాలు ప్రవాహంగా వస్తున్నాయని అవి ఇప్పుడు బీసీ వాదసాహిత్యంగా రూపుదాల్చాలన్నారు. కులచైతన్యం పెరిగిందని, దాన్ని బీసీ ఉద్యమ చైతన్యంగా చేసే, చారిత్రక పనిని బీసీ కవులు, సాహితీ వేత్తలు తమ భుజస్కంధాలపై వేసుకోవాలని పేర్కొన్నారు. బీసీ భావజాల అస్తిత్వాన్ని బీసీ ఉద్యమ జెండాగా ఎగురవేసే పని బీసీ బుద్ధిజీవుల చేతుల్లోనే ఉందని వివరించారు. బీసీ సాహిత్యవేత్తల కర్తవ్యం విశ్వమానవ విముక్తి గీతమన్నారు. కలుషిత ఆహారం తిని భావి భారతబిడ్డలు రాలిపోతుంటేయ బీసీ సాహిత్యకారులు పాలకుల దుర్నీతిని బైట పెట్టాలని జూలూరు గౌరీశంకర్ డిమాండ్ చేశారు. మొదటి సమావేశానికి డా.సంగిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు జూలూరుగౌరీశంకర్, ప్రారంభ కులాలుగా కాళోజీ తొలి అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, ముఖ్య అతిథిగా సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య పిల్లలమర్రి రాములు, విశిష్ట అతిథిగా కవి కందుకూరి శ్రీరాములు, ఆత్మీయ తిధిగా బహుళమహిళాపక్షపత్రిక సంపాదకురాలు జ్వలిత, కవయిత్రి తిరునగరి దేవికి దేవి పాల్గొనగా బీసీ దీర్ఘకవితలపై డాక్టర్ వెల్దండి, శ్రీధర్, ఓయు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు, బూర్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎంవీ రమణ, డాక్టర్ కస్ప నరేందర్, రెండవ సదస్సుకు సభాధ్యక్షులుగా కాళోజి అవార్డు గ్రహీత శ్రీరామోజు హరగోపాల్, ముఖ్య అతిథిగా కవి బెల్లి యాదయ్య, విశిష్ట అతిథిగా నాళేశ్వరం శంకరం, వక్తలుగా కంచెర్ల మహేష్, డాక్టర్ బండారి రాజ్ కుమార్, తూర్పింటి నరేష్, డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ తుండు కృష్ణకౌండిన్య దీర్ఘకావ్యాల పై మాట్లాడారు ముగింపు సదస్సుకు సభాధ్యక్షులుగా బీసీ సాహిత్యవేదిక కన్వీనర్ వున్నట్లు సుబ్బయ్య, ముఖ్య అతిథులుగా కవి రచయిత కాళోజీ అవార్డు గ్రహీత డాక్టర్ సీతారాం, బీసీ రచయితల సమాఖ్య అధ్యక్షులు గాజోజినాగభూషణం, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ పెబ్బేటి మల్లికార్జున్, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ పాల్గొనగా సభా పరిచయం చిక్కొండ్ర రవి, వందన సమర్పణ కవి పేర్ల రాము చేశారు కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన సాహిత్య కారులు, కవులు పరిశోధకులు పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామీణ అభివృద్ధి శిక్షణ కేంద్రానికి కూసం రాజమౌళి పేరు

- పంచాయితీ పరిపాలనలో రాజమౌళి సేవలు అమోఘం.. భావితరాలకు ఆదర్శం..
- గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా కృషి..
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క హామీ..
- ప్రతి గ్రామపంచాయతీ గ్రామసభలో రాజమౌళి చరిత్రను వినిపిస్తాం.
- తెలంగాణ పంచాయతీరాజ్ శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క
- గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేసిన రాజమౌళి కృషి అమోఘం : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి




**వరంగల్ ప్రతినిధి, మార్చ్ 22 (జనంసాక్షి):** తెలంగాణ గ్రామీణ అభివృద్ధి శిక్షణ కేంద్రానికి కూసం రాజమౌళి పేరును కేటాయిస్తామని పంచాయితీ పాలనలో రాజమౌళి సేవలు అమోఘమని ఆయన గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా అందించిన సేవలను భావితరాలకు అందించే విధంగా కృషి చేస్తామని పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

ఆదివారం గీసుకడ మండలం జాతీయ ఆదర్శ గ్రామమైన గంగాదేవిపల్లి మాజీ సర్పంచ్ కూసం రాజమౌళి ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో మంత్రి ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాజమౌళి గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి అని,వ్యక్తిగత గుర్తింపు కోసం కాకుండా సమాజం కోసం పని చేసిన నాయకుడిగా నిలిచారని పేర్కొన్నారు. గ్రామస్తులను ఐక్యంగా చేసుకుని ఒక్కొక్క అడుగు ముందుకు వేసి అభివృద్ధిని సాధించిన తీరు ఆదర్శప్రాయమని తెలిపారు.గంగాదేవిపల్లి గ్రామ అభివృద్ధికి కూసం రాజమౌళి చేసిన కృషి రాష్ట్రంలోనే అన్ని గ్రామ పంచాయతీల గ్రామసభల్లో వినిపించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గ్రామంలోని తెలంగాణ గ్రామీణ శిక్షణ కేంద్రానికి రాజమౌళి పేరును ఖచ్చితంగా కేటాయిస్తామని, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాజమౌళి తక్కువ చదువుకు న్నప్పటికీ సామాజిక స్పృహతో గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన నాయకుడని తెలిపారు. గ్రామాభివృద్ధి ధ్యేయంగా పనిచేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దారని, ఆయన చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను 90 దేశాల ప్రతినిధులు అధ్యయనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామస్తులు ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి, తహసీల్దార్ ఎండి రియాజుద్దీన్,ఎంపీఓ పాక శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కూసం స్వరూప, బాలవికాస ప్రతినిధి శౌరెడ్డి, రాజమౌళి కుమారులు రమేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య

**భువనగిరి (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లాలో అప్పుల బాధతో రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఆత్మకూరు(ఎం) మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన రైతు నాతి మల్లయ్య గౌడ్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయిపల్లి గ్రామానికి చెందిన నాటి మల్లయ్య గౌడ్ తనకున్న నాలుగు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాల కౌలుకు తీసుకుని మొత్తం ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాడు. అయితే పంట పెట్టుబడి కోసం దొరికిన చోటల్లా అప్పులు చేశాడు. తీరా పంట చేతికొచ్చే సమయంలో సాగునీరందక పంట పూర్తిగా ఎండిపోయింది. దీంతో మల్లయ్య తీవ్రంగా నష్టపోయాడు. పైగా కూతురు పెళ్లి కోసం తీసుకున్న అప్పులు కూడా భారమయ్యాయి. మొత్తం 20 లక్షల అప్పు ఎలా తీర్చాలా అని తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే అప్పులు తీర్చలేక తీవ్ర నిరాశలో మల్లయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హనుమంతు తెలిపారు.

# కొడుకు హత్యకు సుపారీ

**ఆమెను హత్య చేసి డబ్బుతో పరారైన కిరాయి హంతకుడు**

**రాయ్‌పూర్ (జనంసాక్షి) :** ఆస్తి వివాదం నేపథ్యంలో పెద్ద కుమారుడ్ని చంపాలని అతడి తల్లి ప్లాన్ చేసింది. కిరాయి హంతకుడ్ని నియమించింది. అయితే అతడు ఆ మహిళనే హత్య చేశాడు. పది లక్షల డబ్బు, నగలు దోచుకుని పారిపోయాడు. ఐదేళ్ల తర్వాత ఆ నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. 2021లో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో నివసించే ఒక కుటుంబంలో ఆస్తి వివాదం మొదలైంది. దీంతో శకుంతల యాదవ్, తన చిన్న కొడుకు అమిత్ యాదవ్‌తో కలిసి తన పెద్ద కొడుకును చంపడానికి ప్లాన్ వేసింది. వారికి తెలిసిన ఆసుపత్రి సెక్యూరిటీ గార్డు మిశ్రాను నియమించుకున్నారు. పెద్ద కుమారుడి హత్య కోసం రూ. 4 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అతడికి అడ్వాన్స్‌గా లక్ష చెల్లించారు.

కాగా, ఆ డబ్బు తీసుకున్న మిశ్రా తన గ్రామానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో శకుంతల, ఆమె చిన్న కొడుకు అమిత్ చివరకు అతడ్ని గుర్తించారు. పెద్ద కుమారుడ్ని హత్య చేయకపోవడంతో అడ్వాన్స్‌గా ఇచ్చిన లక్ష తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి ఇంటికి వచ్చి ఆ డబ్బు ఇస్తానని అతడు హామీ ఇచ్చాడు.

మరోవైపు కొన్ని రోజుల తర్వాత రాయ్‌పూర్‌కు మిశ్రా చేరుకున్నాడు. సహచరుడు కేతన్ తివారీతో కలిసి శకుంతల ఇంటికి వెళ్లాడు. ఆమె ఒంటరిగా ఉండటాన్ని గమనించారు. దీంతో ఇద్దరూ కలిసి తాడుతో శకుంతల గొంతునొక్కి హత్య చేశారు. ఆ ఇంట్లో ఉన్న పది లక్షల డబ్బు, బంగారు నగలు దోచుకుని పారిపోయారు.

కాగా, శకుంతల హత్య, ఆ ఇంట్లో దోపిడీపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే నిందితుడైన మిశ్రా పోలీసుల గప్పి పలు ప్రాంతాల్లో తిరిగాడు. మొబైల్ ఫోన్ వాడలేదు. పాన్, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను ఉపయోగించకుండా అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాడు. పలు ప్రాంతాలు మారుతూ 2022లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చేరుకున్నాడు. నరోడా ప్రాంతంలో అతడు స్థిరపడ్డాడు. ఎవరికీ అనుమానం రాకుండా జీవిస్తున్నాడు.

మరోవైపు, మిశ్రా గురించి సమాచారం అందుకున్న అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అతడ్ని అరెస్ట్ చేశారు. వృద్ధురాలి హత్య, దోపిడీ కేసులో ఐదేళ్లుగా పోలీసుల కళ్లగప్పి అతడు తిరుగుతున్నట్లు తెలుసుకున్నారు. ఈ కేసులోని ఇతర నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# బీసీలను అణగదొక్కుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- కల్లుగీత కార్మిక ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్



**చండూరు (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో బీసీలను అణగదొక్కు తున్నారని కల్లుగీత కార్మిక ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం చండూరు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా బీసీలను నిర్లక్ష్యం చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని విమర్శించారు. మోసాలకు, అబద్ధాలకు పెట్టిన పేరు కాంగ్రెస్ పార్టీ అని ఆరోపించారు. 2024- 25 బడ్జెట్‌లో బీసీలకు రూ. 9 వేల కోట్లు కేటాయిస్తే కేవలం రూ. 3 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు. 2026- 27 బడ్జెట్లో రూ. 12వేల కోట్లు కేటాయించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం బీసీలకు బడ్జెట్లో రూ. 20వేల కోట్లు కేటాయిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ పేర్కొన్నారని గుర్తు చేశారు. బీసీలను మోసం చేసి, దగా చేసి కాంగ్రెస్ పార్టీ రాజ్యమేలుతుందని అన్నారు.

బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపారని, రాష్ట్ర ఆదాయాన్ని రెండున్నర లక్షల కోట్లకు పెంచిన ఘనత కేసీఆర్‌దేనని వెల్లడించారు. ఐదు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందని విమర్శించారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయలన్న ఏకైక లక్ష్యంతో కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ నిలిపేశారని, , రైతుబంధుతోపాటు, రైతుబీమా ను ఎగ్గొట్టుతున్నారని మండిపడ్డారు.

విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి, ఆ శాఖకు కూడా భారీగా బడ్జెట్‌లో కోతపెట్టడం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. సమావేశంలో చండూరు మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు పెద్దగోని వెంకన్న గౌడ్, కౌన్సిలర్లు సామ సుజాత యాదవ రెడ్డి, కొండ్రెడ్డి మధు, బోడ శ్రీకాంత్, ఇరిగి రామన్న, చొప్పరి దశరథ, పాలకూరి రాములు,ఇడికూడా నాగరాజు, రాపోలు జగదీష్, బోయపల్లి రమేష్, గండూరి జనార్ధన్, కర్నాటి మల్లేష్, వీరమల్ల స్వామి, బోడ మోహన్ ,కట్కూరి సత్తయ్య, వర్కాల శ్రవణ్ రేవల్లి నరేష్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370